జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 16 పక్షపత్రిక ఆగస్టు 16-31, 2016




## అవినీతిని ఆపటానికి మీ సేవ, ఈ సేవలు చాలవు...

# సర్కారీ కార్యాలయాల్లో 'సర్వీస్ గ్యారంటీ' చేయాల్సిందే

# నాణ్యమైన విద్య, ఆరోగ్యంతోనే కలాం న్యూ ఇండియా సాధ్యం : జేపీ

పేద కుటుంబంలో పుట్టి గొప్ప ఆలోచనలతో కష్టపడి ప్రపంచ స్థాయికి ఎదిగిన మాజీ రాష్ట్రపతి డా॥ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో కులం, మతం, ప్రాంతం, భాషలను అధిగమించిన నూతన భారతదేశ నిర్మాణం చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విద్యార్థులు, యువతకు పిలుపునిచ్చారు.



కలాం న్యూ ఇండియా ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జూలై 27న కలాం తొలి వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లో విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమాల్లో జేపీ పాల్గొన్నారు. ఉదయం మాసబ్‌ట్యాంకు వద్దనున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, మధ్యాహ్నం కాప్రాలోని జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతోసమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు.



విద్యార్థినీ విద్యార్థులతో పలు అంశాలపై, పాఠ్యాంశాలపై చర్చించిన అనంతరం జేపీ మాట్లాడుతూ, విజ్ఞానం, సృజనాత్మకత, స్వేచ్ఛ, ఉదారవిలువలు, ఆధునికత నిండిన సమాజం కోసం కలాం కలలు గనేవారని, కలాం బాటలో నడవాలంటే ముందు మనం విద్య, ఆరోగ్య రంగాలను బాగుచేసుకోవాలని అన్నారు. అందరికీ ఉపాధి, సంపద సృష్టిలో అందరికీ భాగస్వామ్యం మన లక్ష్యం కావాలన్నారు. మన విద్యార్థినీవిద్యార్థుల్లో ప్రతిభకు ఏమాత్రం కొదవ లేదని, కానీ వారిలోని సామర్థ్యాన్ని వెలికితీసే చదువు కొరవడుతోందని అన్నారు. 1000 మంది పిల్లలున్న పాఠశాల కోసం ప్రభుత్వం ఏటా రూ.3 కోట్లు చొప్పున, అంటే ఒక్కో విద్యార్థి మీద రూ.30 వేలు ఖర్చుచేస్తోందని, ఉపాధ్యాయుల జీతాలు తప్ప పిల్లల చదువులు బాగుపడటం లేదని అన్నారు. ఈ పిల్లలందరికీ విశ్లేషణా శక్తి, తర్కం, ఊహాశక్తి,నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవ వంటివి పట్టుబడే విద్య అందకపోతే కలాంలాంటి వారికి మొక్కుబడి నివాళు లర్పించటం తప్ప వారి స్థాయిని ఎలా అందుకోగలరని ప్రశ్నించారు. మనదేశానికి స్వతంత్రం వచ్చి 70 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ విద్య, ఆరోగ్య రంగాల గురించి పట్టించుకోకపోవటం ఎన్నో తరాలను దెబ్బతీసిందని, ఆ దారుణ తప్పిదాన్ని ఇంకా కొనసాగనివ్వకూడదని అన్నారు. కాప్రా జడ్పీ హైస్కూలును దత్తత తీసుకుంటున్నానని, మిగిలిన పాఠశాలల్ని కూడా వీలున్నప్పుడు సందర్శిస్తూ విద్యార్థులకు పాఠాలు చెబుతానని జేపీ అన్నారు. కార్యక్రమాల్లో మాసబ్‌ట్యాంకు, మేడ్చల్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు కె. రాములు, వై. నర్సయ్యగౌడ్‌తోపాటు లీడ్ ఇండియా ప్రతినిధులు, సాంకేతిక విద్యాశాఖ అధికారులు సత్యనారాయణ, మురళీధర్ గుప్తా, కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజు, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, పేరెంట్స్ కమిటీ ప్రతినిధి సరోజ, ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, శివరామకృష్ణ, శ్రీనివాస్ వర్మ, వంశీమాదిరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలలో కూడా లోక్‌సత్తా నేతలు కలాంకు ఘననివాళులర్పించారు. సాధారణ జీవితం, అత్యున్నత పనితీరుతో దేశ ప్రజల మనసులను కలాం చూరగొన్నారని లోక్‌సత్తా పార్టీ తెలంగాణా అధ్యక్షుడు డా॥పాండురంగారావు ఈ సందర్భంగా అన్నారు. కలాం స్మృత్యర్థం మొక్కను నాటారు. కార్యక్రమాల్లో లోక్‌సత్తా పార్టీ నేతలు దుర్గారావు, శ్రీనివాసరెడ్డి, సరోజాదేవి, శైలజ, శివరాం, వెంకటేష్, గోపాల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



వివక్షలు, కులం, మతం , ప్రాంతం, భాష వంటి విభేదాలు లేకుండా కలలుగన్న నూతన భారత జాతీయవాదం వేళ్లూనుకోవటానికి రాజకీయ, పాలనా సంస్కరణలతో బహుముఖ కృషి చేస్తున్న లోక్‌సత్తాకు కలాం మద్దతిచ్చేవారన్న సంగతి తెలిసిందే. కలాం మృతి చెందిన 2015లో లోక్‌సత్తా ఉద్యమ 18వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆగస్టు 3న 'ఏపీజే అబ్దుల్ కలాం ప్రతిపాదించిన నూతన భారతదేశం - అవరోధాలను ఛేదించే రాజకీయ, పాలనా సంస్కరణలు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశంగా లోక్‌సత్తా నిర్వహించింది, 2016లో ప్రారంభించిన లోక్‌సత్తా 2.0 మలిదశ ఉద్యమ ఎజెండాలో కూడా ఆ సంస్కరణల్ని భాగం చేసింది.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఆగస్టు 16-31, 2016

సంపుటి - 7 సంచిక - 16

## లోపలి పేజీల్లో...

ఆరోగ్యంపై ఎట్టకేలకు కదిలిన మోదీ ............ 5
లోక్‌సత్తా అందరికీ ఆరోగ్యం విధానాన్ని......... 7
ప్రభుత్వోద్యోగుల అవినీతిని ఆపటానికి........... 8
పౌరసేవలు హక్కు కావాలి....................... 15
పౌరసేవల పత్రాల - పరిధి....................... 18
మార్పుకోసం మరో అడుగు....................... 23
మేలు చేయని మోదీ నిజాయితీ.................. 25
వైఫల్యం కాదు ప్రతిభకు కొరత.................. 27
ముఖ్యమంత్రుల్ని పరోక్షంగా ఎన్నుకోవటమూ.. 29
హోదాపై టీడీపీ, బీజేపీ దొంగాట................ 31
మోదీ, కేసీఆర్ కంటే స్వచ్ఛ హైదరాబాద్.......... 32
సహకార వ్యవస్థను అణగదొక్కటం .............. 33
లోక్‌సత్తా భావజాలం నా ప్రభుత్వోద్యోగం...... 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# రాష్ట్రాలకు బదులు వెనకబడిన 100 జిల్లాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలి



ఉమ్మడి రాష్ట్ర విభజన జరిగితే హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోవటం వల్ల మిగిలిన ఆంధ్రప్రదేశ్‌కు ఎంత నష్టం వస్తుంది, ఏం చేస్తే ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతుంది అనే అంశాల్ని రాష్ట్ర విభజనకు అనుకూలంగా లేఖలు ఇచ్చినవారు గానీ, ఈవేళ ఆ అంశం మీద పార్లమెంటులో గొంతు చించుకున్నవారుగానీ, రాష్ట్రంలో రగడ చేస్తున్నవారుగానీ విభజనకు ముందు మాట్లాడలేదు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన విషయాల్లో రాష్ట్ర అసెంబ్లీయే పార్లమెంటుకన్నా ముఖ్యమని, విభజనకు సమగ్ర, సామరస్య పరిష్కారాన్ని రాష్ట్రంలో చర్చించి అసెంబ్లీలో నిర్ణయించి కేంద్రానికి పంపుదామని, కేంద్రం పాత్ర కేవలం అమలుచేయటం వరకే ఉండాలని ఆరోజు లోక్‌సత్తా చెప్పినా వినిపించుకోలేదు. ఆ పరిస్థితుల్లోనే.. విడిపోతే పరిశేష ఆంధ్రప్రదేశ్‌కు ఏం కావాలో ప్రజల అభిప్రాయాలను వినేందుకు, చర్చించి ఏకాభిప్రాయం సాధించేందుకు లోక్‌సత్తా 'తెలుగు తేజం' పేరుతో రౌండ్‌టేబుల్ సమావేశాల్ని, బహిరంగ సభల్ని నిర్వహించింది. దురదృష్టవశాత్తూ ఏపీ నేతలకు రాష్ట్రప్రయోజనాల కంటే సొంత రాజకీయాలే ఎక్కువనే నానుడిని మరోసారి రుజువు చేస్తూ తెలుగు తేజాన్ని అడ్డుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్ ఆదాయమెంత? విడిపోతే ఏపీకి రెవిన్యూలోటు ఎంత? వంటి గణాంకాల్ని విడుదల చేయటంతోపాటు పరిశేష ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భవిష్యత్తుకు నిర్దిష్ట ప్రతిపాదనలను లోక్‌సత్తా చేసింది. విడిపోతే రాయలసీమకు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా వేగంగా నిర్మించటం, వెనకబడిన ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణకు ప్రత్యేక సాయం, ఏపీలో జాతీయ సంస్థల ఏర్పాటు, తెలంగాణలో విద్యుత్తు ప్రాజెక్టు, రెండు రాష్ట్రాల్లో మౌలికవసతులు తదితర ప్రతిపాదనలను జనవరి 18, 2014న నేను అసెంబ్లీలో చేశాను. ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ మొత్తానికీ ఇవ్వాలంటే గణాంకాల ప్రకారం ఇతర రాష్ట్రాలు అంగీకరించవు అనే ముందుచూపుతోనే రాయలసీమ వెనకబాటుతనం గణాంకాలు చూపుతూ సీమకు హోదా ప్రతిపాదించాను. ఈ గణాంకాలనే కాంగ్రెస్, బీజేపీ పార్లమెంటులోనూ చర్చకు తీసుకున్నాయి, లోక్‌సత్తా చేసిన పలు ప్రతిపాదనల్ని పునర్విభజన చట్టంలో ప్రతిఫలింప చేశాయి, ప్రత్యేకహోదాపై ప్రధానమంత్రి రాజ్యసభలో హామీ ఇచ్చారు. కానీ ఏపీ మొత్తానికీ ప్రత్యేక హోదా ఇస్తామని ఓట్ల కోసం అసంబద్ధ హామీనిచ్చాయి. వారు ఇస్తామంటే మనం కాదనటమెందుకు అని లోక్‌సత్తా కూడా ఏపీకి ప్రత్యేకహోదా ప్రతిపాదనకు మద్దతిచ్చింది. కానీ కొత్త ప్రభుత్వాలు ఏర్పడి ఏడాది గడిచినా విభజన హామీలు అమలుచేయకపోవటంతో మళ్లీ 2015లో 'తెలుగు భవిత' కార్యక్రమం ద్వారా లోక్‌సత్తా పోరాడింది. మిగతా రాష్ట్రాలకంటే ఆంధ్రప్రదేశ్ రెవిన్యూలోటు భర్తీకి ప్రత్యేకించి చేస్తున్నదేమీ లేదని 14వ ఆర్థికసంఘం పత్రాలను విడుదల చేసి మరీ చెప్పింది. కానీ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు కలిసిరాలేదు. ఓట్లు, సీట్లు లేకుండా, ప్రజలు ముందుకురాకుండా ఒక పరిధిదాటి ఫలితాలను సాధించటం అన్నివేళలా సాధ్యం కాదు గదా! ఇప్పుడు మళ్లీ రాజ్యసభలో ఓ ప్రైవేటు బిల్లు వల్ల ఏపీ ప్రత్యేకహోదా కోసం కొంత చర్చ మొదలైంది. ప్రత్యేకహోదా పదేళ్లు ఇస్తామన్న బీజేపీ ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉండి కూడా కాంగ్రెస్‌దే తప్పన్నట్టు మాట్లాడుతోంది. విభజన చట్టంలో పెట్టకపోవటం కాంగ్రెస్ తప్పే, కానీ మీరు గెలిస్తే ఇస్తామని మీ మేనిఫెస్టోలో పెట్టాక ఆ పని మీరు చేస్తానని ఒప్పుకున్నట్టేగా? ప్రధానమంత్రి పార్లమెంటులో ఇచ్చిన మాట దాదాపు చట్టంతో సమానం. ఒక రాష్ట్రం విషయంలో చేసిన ప్రకటన తప్పటం దేశ సమగ్రతకు మంచిది కాదు. కాబట్టి ప్రత్యేకహోదా హామీ నుంచి కేంద్రం తప్పించుకోలేదు. ఇక ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలకు విరుద్ధంగా రాష్ట్ర విభజన చేశారంటున్న ముఖ్యమంత్రి.. తాను ప్రజాభీష్టానికి విరుద్ధంగా ఎందుకు విభజన నిర్ణయం తీసుకున్నారో కూడా చెప్పాలి. ఒకవేళ రాష్ట్రం విడిపోతే ఆంధ్రప్రదేశ్‌కు ఏం చేయాలనుకున్నారో ఏనాడైనా ప్రజలకు వివరించారా? అసెంబ్లీలో మాట్లాడారా? కేంద్రప్రభుత్వానికి ఇచ్చారా? రాజకీయం మారకుండా కొత్త రాష్ట్రం ఏర్పాటు వల్ల జనం జీవితాలు మారవని, అయితే ప్రజాస్వామ్య విలువల దృష్ట్యా తెలంగాణ ఏర్పాటు అవసరం, అనివార్యం అని లోక్‌సత్తా విస్పష్టంగా పేర్కొంది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భవిష్యత్తుకు భరోసా ఇచ్చే పరిష్కారాలూ తెలిపింది. కానీ మీరేం చేశారూ?.. ఇకనైనా తెలంగాణలో ఒక మాట, ఆంధ్రప్రదేశ్‌లో ఇంకో మాట చెప్పే అబద్ధాలు ఆపి, నిజాలు మాట్లాడుకోవటం అవసరం. ఆంధ్రులు ఆరంభశూరులు, రాజకీయ అవసరాల కోసం జనాన్ని తాకట్టుపెడతారు అనే విమర్శలకు ఇక అవకాశమివ్వకుండా కలిసికట్టుగా ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను కాపాడుదాం. ఇందుకోసం లోక్‌సత్తా ఒక ప్రతిపాదన చేసింది- 'రాష్ట్రాలకు బదులు వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక హోదా' ఇవ్వాలని. రాయలసీమ (మార్కాపురంసహా), ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణలోని జిల్లాలు సహా దేశవ్యాప్తంగా వెనకబడిన 100 జిల్లాలను గుర్తించి వాటికి ప్రత్యేక హోదా పన్ను రాయితీల్ని ఇవ్వమని కేంద్రాన్ని కోరదాం. రాష్ట్రాల ప్రత్యేక హోదాలో భాగమైన రెవిన్యూలోటు భర్తీని ఏపీ విషయంలో వేరే రూపంలో కేంద్రం చేస్తోంది కాబట్టి, నీతి ఆయోగ్ వచ్చాక ప్రత్యేక హోదా రాష్ట్రాల ప్రతిపాదన లేదంటున్నారు కాబట్టి, జిల్లాలకు ప్రత్యేక హోదా పన్ను రాయితీలు ఇచ్చే ప్రతిపాదనను వారు పరిశీలించవచ్చు. జీఎస్టీ నేపథ్యంలో ప్రత్యేక హోదా పేరు మార్చయినా పారిశ్రామిక పన్ను రాయితీలివ్వొచ్చు. దీనికి ఏ రాష్ట్రమూ అభ్యంతరం చెప్పనక్కర్లేదు. యువత ఉద్యోగాల కోసం రాష్ట్రాలకు బదులు వెనకబడిన జిల్లాలకు/ప్రాంతాలకు ప్రత్యేక హోదా సాధించేందుకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు ఇప్పటికైనా కలిసి రావాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

మీ



LS Times August 16-31 2016 Issue.pmd 3 8/11/2016, 2:47 PM




# కార్టూన్ కార్నర్

వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6–3–655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

ఫోన్ : **040–23310288**
ఫోన్ / ఫ్యాక్స్ : **040–23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040–23311816**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |


- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.



LS Times August 16-31 2016 Issue.pmd 4 8/11/2016, 2:47 PM

# ఆరోగ్యంపై ఎట్టకేలకు కదిలిన మోదీ సర్కారు

## లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' నమూనాను తీసుకుంటే పటిష్ట జాతీయ ఆరోగ్య విధానం




అందరికీ నాణ్యమైన ఆరోగ్యం, విద్య రాజకీయానికి, సమాజానికి కేంద్రబిందువు అయితేనే పేదరిక నిర్మూలన, ఆత్మగౌరవంతో కూడిన జీవితాలు సాధ్యమంటూ తొలినుంచీ వాటి కోసం పోరాడుతున్న లోక్‌సత్తా కృషి వల్ల 2005లో యూపీయే ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ రూపొందించింది. లోక్‌సత్తా ఎంతో ఆచరణసాధ్యంగా ఈ మిషన్‌ని అందించినా, ఇందులో కేవలం పదిశాతాన్నే అమలు చేయగలిగింది. జాతీయ ఆరోగ్య మిషన్‌ని జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌గా అరకొరగా అమలు చేశారు. ఆ తర్వాత లోక్‌సత్తా ఒక రాజకీయ పార్టీగా ఏర్పడ్డాక 2008లో ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో అందరికీ ఆరోగ్యాన్ని అందించే యూనివర్సల్ హెల్త్ పాలసీని పార్టీ విధానంగా విడుదల చేసింది. 2009 ఎన్నికలలో పార్టీ మేనిఫెస్టోగా విడుదలైన 50 గ్యారంటీలలో కూడా ఈ హామీ ప్రముఖంగా ఉంది. లోక్‌సత్తా హెల్త్ పాలసీని చూశాకే అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అందులోని తృతీయ దశ వైద్యసేవలను మాత్రం తీసుకుని ఆరోగ్యశ్రీ పథకాన్ని అరకొరగా రూపొందించారు. అందరికీ ఆరోగ్యంలో కీలకమైన వ్యాధి నివారణ పద్ధతుల్ని, ప్రాథమిక వైద్యసేవల్ని విస్మరించిన ఆరోగ్యశ్రీ ఎలా కార్పొరేట్‌శ్రీగా మారిందో తొలి నుంచీ గణాంకాలతో సహా విమర్శించింది, స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని చూపిందీ లోక్‌సత్తా ఒక్కటే. ఆ తర్వాత నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చాక 2015లో రూపొందించిన విధానం కూడా అరకొరగానే ఉందని లోక్‌సత్తా కేంద్ర ప్రభుత్వానికి తెలియచేసింది. మారిన పరిస్థితులకనుగుణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ దేశాల ఆరోగ్య నమూనాలను మళ్లీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి, భారత్‌కున్న వైద్య నిపుణులు, ఆధునిక సాంకేతికత, మందుల తయారీ వంటి బలాల్ని, డిగ్రీ లేకుండా వైద్యులుగా చెలామణి అవుతున్నవారు పెద్దసంఖ్యలో ఉండటం వంటి లోపాల్ని బేరీజు వేసి.. జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా ఈదేశ ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించే ఒక ఆరోగ్య విధానం నమూనాను మోదీ ప్రభుత్వానికి లోక్‌సత్తా అందచేసింది. అది కూడా మోదీ ప్రభుత్వం హామీ ఇచ్చిన 2.5 శాతం కంటే తక్కువ



LS Times August 16-31 2016 Issue.pmd 5 8/11/2016, 2:47 PM

ఖర్చుతోనే. ఆ తర్వాత 2016 ఏప్రిల్‌లో నీతి ఆయోగ్ ముందు అన్ని వివరాలతో ప్రజంటేషన్ ఇచ్చింది. తర్వాత పార్లమెంటరీ ప్యానల్ ముందు కూడా వివరాలను తెలియచేసింది. మనకున్న సమస్య ప్రధానంగా అట్టడుగు స్థాయిలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ఉందని, జబ్బు వచ్చాక వైద్యం కన్నా, నివారణ, తొలిదశలో సరైన చికిత్స మీద దృష్టి పెట్టాలని లోక్‌సత్తా స్పష్టం చేసింది. గ్రామాల్లో ఉన్నవారికి ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే వెంటనే డాక్టర్ అందుబాటులో ఉండే పరిస్థితి లేదని, అట్టడుగుస్థాయి నుంచి, మనకున్న పరిమిత వనరుల్లో సరైన పరిష్కారాన్ని వెతకాలని వివరిస్తూ ప్రధానంగా మూడు పరిష్కారాలను లోక్‌సత్తా సూచించింది:

1) ప్రతి పౌరునికీ ఒక డాక్టర్ అందుబాటులో ఉండాలి. కొంతమంది వైద్యుల బృందంలో ఏ డాక్టర్‌ను ఎంచుకోవాలో కూడా స్వేచ్ఛ ఆ పౌరునికి ఉండాలి. దీని వల్ల గ్రామాల్లో సహా ప్రతి ఇంటికీ ఫ్యామిలీ డాక్టర్ అందుబాటులో ఉంటారు.

2) తాలూకా, మండల స్థాయిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు, చిన్న చిన్న నర్సింగ్ హోంలు కలిసి ప్రజారోగ్య సేవలు అందిస్తాయి. ఎమర్జెన్సీ కేసుల్లో మినహా ఫ్యామిలీ డాక్టర్ సిఫార్సు చేసిన రోగులకు మాత్రమే వీరు వైద్య సేవలు అందిస్తారు.

3) దిగువ రెండు స్థాయిల్లో చికిత్స సాధ్యం కాని రోగులకు వైద్యసేవలందించేందుకు జిల్లా, బోధనాసుపత్రులుంటాయి. ఇక్కడ ప్రస్తుతం పెడుతున్న ఖర్చును కనీసం 3రెట్లు పెంచాలి. ఈ పెద్దాసుపత్రుల్లో కూడా ఎమర్జెన్సీ మినహా మిగతా కేసుల్లో కిందిస్థాయి ఆసుపత్రులు సిఫార్సు చేస్తేనే రోగులకు వైద్యసేవలు అందిస్తారు.

ఈ మౌలిక మార్పులతో ప్రజలు జేబులో నుంచి రూపాయి ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా అందరికీ ఆరోగ్యాన్ని అందించే ఆరోగ్య నమూనాను లోక్‌సత్తా రూపొందించి కేంద్రప్రభుత్వానికి అందించింది. ఇప్పుడు వైద్య, ఆరోగ్య రంగాలపై కేంద్రం చేస్తున్న ఖర్చు స్థూల జాతీయాదాయంలో 1.21 శాతంకాగా, లోక్‌సత్తా నమూనాలో ఆ ఖర్చు మరో శాతం లోపే పెరుగుతుంది. అంటే 2శాతం లోపే అందరికీ అందుబాటులో వైద్యం అందించవచ్చు. ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇంత తక్కువ ఖర్చుతో ప్రజలకు ఆరోగ్యం అందించిన దాఖలాలు లేవు. లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' విధానంపై మరిన్ని వివరాలను www.fdrindia.org వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు.

లోక్‌సత్తా అందరికీ ఆరోగ్యం నమూనా సరిగ్గా అమలయితే తక్కువ ఖర్చుతో అందరికీ వైద్యం, ఆరోగ్యం అందటమే కాకుండా, పెద్దసంఖ్యలో యువతకు ఉద్యోగావకాశాలు కూడా లభ్యమవుతాయి.

ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య విధానాన్ని పరిశీలించి చర్చించేందుకు నిర్ణయించింది. దీనిపై ఈనెలలోనే బిల్లు రూపొందే అవకాశం ఉంది.

అందరికీ ఆరోగ్యం ఇవ్వాలని 12వ పంచవర్ష ప్రణాళికలో (2012-17) హామీ ఇచ్చినా ఒక నమూనాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏకాభిప్రాయానికి రాకపోవటం వల్ల ఇప్పటికీ ఆ కీలక సంక్షోభం అలాగే కొనసాగుతూ ఏటా ఐదేళ్లలోపు చిన్నారులు 12లక్షల మంది మరణిస్తున్నారని, 97 లక్షలమంది మలేరియా బారిన పడుతున్నారని, 25లక్షల మందికి టీబీ సోకుతోందని, ఆసుపత్రుల పాలయినవారు సగటున ఒక్కొక్కరూ రూ.40,000 ఖర్చు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ లెక్కలేనన్నిసార్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే మాటను నీతి ఆయోగ్ వద్ద, పార్లమెంటరీ కమిటీకి కూడా వివరించారు. విద్యాహక్కు చట్టం లేకుండానే అనేక దేశాలు ప్రజలకు నాణ్యమైన విద్యను అందించాయని, అలాగే హక్కు అంటూ చట్టం చేయనవసరం లేకుండానే ఆచరణాత్మకంగా, ఒక గ్యారంటీలా అందరికీ నాణ్యమైన వైద్యం, ఆరోగ్యాన్ని అందించాలని సూచించారు. ఆరోగ్య బడ్జెట్‌లో కేవలం 0.5శాతం పెంచితే ఈ దేశానికి అద్భుతాలు జరుగుతాయని, అందరికీ ఆరోగ్యం అందించటం కోసం ఆమాత్రం కూడా బడ్జెట్‌ను పెంచలేమని అంటే, ఇక ప్రభుత్వాలు అక్కర్లేదని నిర్మొహమాటంగానే చెప్పారు. లోక్‌సత్తా ప్రతిపాదనల్ని పలువురు వైద్యనిపుణులతో, పార్లమెంటు సభ్యులతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని ప్రముఖులతో కూడా జేపీ చర్చించారు. విద్య, ఆరోగ్యం వంటి విధానాల్లో మెరుగైన సేవలకు రాష్ట్రాలకు మరింత స్వయంప్రతిపత్తి కల్పించాలని సూచించారు. లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' విధానం కేంద్రప్రభుత్వ తాజా జాతీయ ఆరోగ్య విధానంలో ప్రతిఫలిస్తుందని, స్వతంత్రం వచ్చిన 70 ఏళ్ల తర్వాతైనా ప్రజలకు ఖర్చు లేకుండా నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుతాయని ఆశిద్దాం. ★



LS Times August 16-31 2016 Issue.pmd 6 8/11/2016, 2:47 PM

# లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' విధానాన్ని అమలుచేయండి, జిల్లాకు ప్రభుత్వ వైద్యకళాశాల మంజూరు చేయండి





జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా అందరికీ నాణ్యమైన వైద్యాన్ని దేశవ్యాప్తంగా అందించేందుకు లోక్‌సత్తా కృషి చేస్తోందని, లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' విధానాన్ని ఏపీలో అమలు చేసి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ని నిర్మించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, ఇందులో భాగంగా విజయనగరం జిల్లాలో ప్రభుత్వ వైద్యకళాశాలను మంజూరు చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబును ఒప్పించాలన్నారు. లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో జరిగిన సీనియర్ నాయకుల సమావేశంలో బాబ్జీ మాట్లాడుతూ, కేవలం వైద్యం కోసం చేస్తున్న ఖర్చు వల్ల ఒక్క విజయనగరం జిల్లాలోనే వందలాది కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని అన్నారు. మంత్రి మృణాళిని జిల్లా కేంద్ర ఆసుపత్రిని సందర్శించి కూడా వాస్తవాలను, లోక్‌సత్తా చెబుతున్న 'అందరికీ ఆరోగ్యం' పరిష్కారాలను గుర్తించకపోవటం విచారకరమన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో వైద్యసేవలు దారుణంగా ఉన్నాయని, జిల్లాకు రావలసిన కేజీహెచ్‌లాంటి ఆసుపత్రి దూరమవుతున్నా ఇక్కడి ప్రజాప్రతినిధులు నోరు మెదపటం లేదన్నారు. లోక్‌సత్తా పార్టీ సీనియర్ నేత అల్లంశెట్టి నాగభూషణం మాట్లాడుతూ, మంత్రులు, ప్రజాప్రతినిధులు తల్చుకుంటే విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రిని ఇప్పటికే సూపర్ స్పెషాలిటీ ఆసుప్రతిగా తీర్చిదిద్దేవారన్నారు. ఘోషా, కేంద్ర ఆసుప్రతుల్లో ఇప్పటికీ రోగులకు మౌలిక సదుపాయాలు లేవని వార్తలు తరచూ వస్తున్నా నాయకుల్లో చలనం లేదన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ పట్టణ అధ్యక్షుడు మొల్లేటి చిన్నారావు, తేజోకళ్యాణ్, అల్లం ప్రభాకర్, రెడ్డి సింహాచలం, ధనుంజయ్ తదితర నేతలు పాల్గొన్నారు.

**జేఏసీ ఏర్పాటు**

జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాలను సాధించటానికి ప్రజలతో కలిసి ఉద్యమించాలని లోక్‌సత్తా ఆధ్వర్యంలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో పార్టీలు, ప్రజాసంఘాలు తీర్మానించాయి. ప్రభుత్వ వైద్య కళాశాల సాధన కమిటీని ఏర్పాటు చేశాయి. భీశెట్టి బాబ్జీ నేతృత్వంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ మేరకు విధివిధానాలను రూపొందించారు. అందరికీ ఉచితంగా నాణ్యమైన ఆరోగ్యం అందించటం లోక్‌సత్తా లక్ష్యమని, విజయనగరం జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల కోసం రెండేళ్ళుగా లోక్‌సత్తా పోరాడుతోందని ఈ పోరాటంలో ఇప్పుడు అన్ని పార్టీలు, సంఘాలు కలిసిరావటం సంతోషకరమని బాబ్జీ అన్నారు. కమిటీ కన్వీనర్‌గా మామిడి అప్పల నాయుడు, కో-కన్వీనర్లుగా చోడి ఆదినారాయణ, మజ్జి కాంతారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా మమ్ములు తిరుపతిరావు, బి.ఉపేంద్ర, ఆర్.ప్రవీణ్‌కుమార్, పి.నవీన్‌కుమార్, జి.ప్రసాద్, జి.పైడితల్లి, కర్రి అప్పారావు ఎన్నికయ్యారు. సమావేశంలో ఎంవీఆర్ కృష్ణాజీ, సదాశివరావు, పైడితల్లి, బి.అంకారావు, చదలవాడ ప్రసాద్, ఆదాడ మోహన్, బి.భానుమూర్తి, టి.శ్రీను, ఉపేంద్ర, బీఎల్ నరసింగరావు, రవి తదితరులు పాల్గొన్నారు. ✶



LS Times August 16-31 2016 Issue.pmd 7 8/11/2016, 2:47 PM

# ప్రభుత్వోద్యోగుల అవినీతిని ఆపటానికి ఆన్‌లైన్ చాలదు

## ప్రజలకు హక్కుగా సేవలందించే 'సర్వీస్ గ్యారంటీ' చట్టం తేవాల్సిందే

**ఆంధ్రప్రదేశ్, జులై, 2016**

అమరావతి నిర్మాణం చుట్టూ రాజకీయం, పాలనతో 2019 ఎన్నికల్లో ఎనభై శాతం సీట్ల గెలుపు మీదే దృష్టి పెట్టిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మధ్య తమ పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే చేయించారట. ఇందులో టాప్ 20-30 స్థానాలలో వచ్చినవారు ముఖ్య వక్తలుగా తెలుగుదేశం రాష్ట్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు కిమిడి కళావెంకట్రావు ఆధ్వర్యంలో ప్రత్యేకించి ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేల పనితీరును ఎప్పటికప్పుడు అధ్యయనం చేసే ఓ పదిమంది సభ్యుల కమిటీ ఈ ఏర్పాట్లన్నీ చేసింది. నియోజకవర్గాన్ని, ప్రజాసమస్యల్ని పట్టించుకోకుండా చంద్రబాబు రహస్య కలాపాల్లో అండదండలందిస్తున్న నమ్మినబంట్లను వదిలేసి అధమ స్థానాల్లో ఉన్న మిగిలిన ఎమ్మెల్యేలను సభికులుగా సమావేశంలో కూర్చోబెట్టారు. టాప్ స్థానాల్లో ఉన్న ఎమ్మెల్యేల సక్సెస్ సీక్రెట్లేంటో సీరియస్‌గా తెలుసుకోండని బాబుగారు, చినబాబు గారు, అధ్యక్షులవారు వారిని ఆదేశించారు. తాజా సర్వే విజేతలు ఒకరొకరుగా తమ విజయాలను, ఆ వెనక సూత్రాలను వివరిస్తుంటే అథమస్థానాల్లో ఉన్నవారికి మైండ్ బ్లాంక్ అయిందట. ఏదో గొప్ప స్ఫూర్తిదాయక విషయాలు చెబుతారనుకుంటే, రొటీన్ మేనేజ్‌మెంట్ టెక్నిక్కులను చెప్తున్నారని కొంతమంది పైకే అనేశారట. ప్రజాసమస్యలపై అధ్యయనం, అధికారులకు తగిన సూచనలిచ్చి పనిచేయించటం, అసెంబ్లీలో చర్చించి పరిష్కరించటం, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూడటం, ప్రతి ఏరియాలో సమస్యల పరిష్కారానికి ముందుకొచ్చేలా ప్రజల్ని చైతన్యపరచటం వంటి విషయాలు చెబుతారనుకుంటే, వాటితో సంబంధంలేని ఫార్ములాలను టాప్ ఎమ్మెల్యేలు చెప్పారట. విజేతలు గొంతు సవరించుకుని చెప్పిన విజయసూత్రాలు.. ఎమ్మెల్యే బాధ్యతలకు, వారికి ఈ అవకాశం ఇచ్చిన ప్రజాస్వామ్యానికి, వారు ప్రమాణం చేసిన రాజ్యాంగానికి పెద్దగా సంబంధం లేకుండా ఉన్నాయట. కాసేపు నసిగినా, వాస్తవంగా ఎమ్మెల్యే చేయాల్సిన పనులకన్నా విజేతలు చెప్పిన టెక్నిక్కుల ద్వారానే ప్రజల్లో ఎక్కువ పాప్యులారిటీ వస్తుందని అందరూ ఒప్పుకున్నారట.

ఆంతరంగికులు మీడియాకు లీక్ చేసిన సమాచారం ప్రకారం.. టాప్ 25లో ఉన్న విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఇలా చెప్పుకొచ్చారు: "ఉదయం లేచిన దగ్గర్నుంచి సాయంత్రం వరకు కాలికి బలపం కట్టుకుని నియోజకవర్గంలో తిరుగుతాను. పిలవనివాళ్లదే పాపం. ఎవరు ఏ కార్యక్రమానికి పిలిచినా విధిగా హాజరవుతాను. బిజీగా ఉంటే కనీసం కనిపించి వస్తాను. ఒకవేళ ఆ సమయానికి వెళ్లలేకపోతే తర్వాతయినా వారి ఇంటికి వెళ్లి పలకరించి వస్తాను". పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కూడా దాదాపు ఇదే లైన్‌లో తన సక్సెస్ స్టోరీని వివరించారు. వీరితో పాటు మరికొంతమంది శాసనసభ్యులు కూడా అనుభవాలను పంచుకున్నారు. జనంలో వ్యక్తిగత సంబంధాలను నెరపుతూ తిరుగుతుండటంతోపాటు ఓ జాగ్రత్తను గుర్తుపెట్టుకుని మరీ పాటించాలని వారంతా హెచ్చరించారు. తలపెట్టిన ఏదైనా పని జరగకపోతే అధికారులతో ఘర్షణపడొద్దు.. అని వార్నింగ్ లెక్కన చెప్పారు. విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా పనిచేసి పెట్టాల్సింది అధికారులేనని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ప్రతి రోజూ కార్యాలయంలో అందుబాటులో ఉండి, అక్కడికి సమస్యలతో వచ్చేవారికి మర్యాదలు చేసి నోట్ చేసుకోవటం, వాటిని పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడటం, తిరిగి సమస్య చెప్పినవారికి సమాచారం అందించటం చేస్తుండాలని, వీటన్నిటిలో సహకరించటానికి కొంతమంది నమ్మినబంట్లను మెయింటెయిన్ చేయటంతోపాటు ప్రతి ఊరిలో ఇరవై మంది కార్యకర్తలను పిలిస్తే పలికే ఆంతరంగికులుగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీనికయ్యే ఖర్చంతా ఏడీవీడీ (ఎవరిది వారే భరించటం) అయినా, అధికారంలో ఉన్నాం కాబట్టి బోలెడు ఆదాయమార్గాలుంటాయి, జాగ్రత్తగా చేసుకోవాలని అని పార్టీ పెద్దలు ఆ తర్వాత హితవు పలికారు. ఈ మొత్తం వివరాలను ఒక నివేదికగా రూపొందించి చంద్రబాబుకు అందించేందుకు తెలుగుదేశం పార్టీ సమాయత్తమవుతోంది.




LS Times August 16-31 2016 Issue.pmd 8 8/11/2016, 2:47 PM

## తెలంగాణ, జులై, 2016

*"ఇంట్లో నల్లాలో నీళ్లు రావు.. ట్యాంకర్ కోసం ఫోన్ చేస్తే అదిగో ఇదిగో అంటారు.. మా ఇంటికి అర కిలోమీటరు దూరంలోనే ఫిల్టర్ బెడ్ ఉంది. అయినా నీళ్లకు కరువే.. ఎన్నిసార్లు అధికారులతో చెప్పినా ఫలితం లేదు. నా పరిస్థితే ఇలా ఉంటే సాధారణ ప్రజలకు మీరు సరిగ్గా స్పందిస్తారా".. ఇవి ఒకప్పుడు ఉద్యోగ ధర్మాన్ని తప్పుతున్నారు అని లోక్‌సత్తా హెచ్చరించినా పెడచెవిన బెట్టి సకల జనుల సమ్మె పేరుతో తెలంగాణ ప్రజలను ఇబ్బంది పెట్టిన ఉద్యోగ సంఘాల నాయకుడు, ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ అధికారులను నిలదీస్తూ ఆగ్రహంతో అన్న మాటలు! ఇటీవల హైదరాబాద్‌లోని శాసనసభ కమిటీ హాలులో అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌లు రాష్ట్రస్థాయి అధికారులందరితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, రహదారులు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, నగర పోలీసు కమిషనర్ మహేందర్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్ధన రెడ్డి సహా అన్ని శాఖల అధికారులు ఈ సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ.. తాను ఉద్యోగిగా పనిచేశానని, సోదర ఉద్యోగులు తన ఆవేదన అర్థం చేసుకోవాలని కోరారు. తాను కిస్మత్‌పూర్‌లో ఉంటానని, తన ఇంట్లో నీటికి తీవ్ర సమస్యగా ఉందని చెప్పారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ట్యాంకర్లను సకాలంలో పంపించలేకపోతున్నారన్నారు. తనకు ప్రభుత్వం 40మంది రక్షణ సిబ్బందిని ఇచ్చిందని, వారి కనీస అవసరాలకు నీళ్లు అవసరమవుతాయని అన్నారు. రక్షణ సిబ్బంది కోసం ప్రత్యేకంగా షెడ్లు నిర్మించాల్సి ఉన్నా రెండేళ్లయినా అధికారులు నిర్మించలేదని ఫిర్యాదు చేశారు.*

... పై రెండు వార్తలు ఆషామాషీవి కాదు. ఒక పార్టీ గెలుపు పోరాటంగానో, ఒక హోదాలో ఉన్న ప్రజాప్రతినిధి ఈతిబాధగానో సరదాగా చదివేసి అవతల పారేయదగ్గవి కావు. ఈ రెంటిలోనూ మన రోజువారీ జీవితాలకి, ప్రజాస్వామ్య వ్యవస్థకీ ఉన్నకొద్దీ తీవ్ర ప్రమాదకరంగా మారుతున్న ఒక సంక్షోభం దాగివుంది. అది- ప్రపంచంలోనే అత్యంత అధ్వాన్నమైన జాబితాలో పేరు సంపాదించుకున్న మన ప్రభుత్వోద్యోగ వ్యవస్థ! వియత్నాం, ఇండొనేషియా, ఫిలిప్పిన్స్, చైనా కంటే కూడా దారుణంగా భారత బ్యూరోక్రసీ ఉందని హాంకాంగ్‌కు చెందిన పొలిటికల్ అండ్ ఎకనామిక్ రిస్క్ కన్సల్టెన్సీ తన సర్వేలో తేల్చింది. ఇండియాలో ప్రభుత్వాధికారులు తప్పు చేస్తే చాలా అరుదుగా బాధ్యత వహించాల్సి వస్తుందని, వారిపై కఠిన చర్యలు, శిక్షలు దాదాపు ఉండవని, దేశంలో అవినీతికి, మౌలికవసతుల కొరతకు బ్యూరోక్రసీ కూడా ప్రధాన కారణమని వ్యాఖ్యానించింది.

బ్రిటీషువారి వారసత్వంగా ప్రజల నెత్తిన పెత్తనం చేయటం, పనుల కోసం వచ్చే జనం నుంచి లంచాలు గుంజటం, ఏమైనా ప్రశ్నిస్తే అవహేళన చేయటం, వేధించటం, ప్రజలకంటే అనేక రెట్లు ఎక్కువ ఆదాయాన్ని జీతభత్యాల రూపంలో పొందటం, ఒకసారి ఉద్యోగంలో చేరాక ఎలా పనిచేసినా జీవితాంతం అందులోనే ప్రమోషన్లతో కొనసాగటం, రిటైరయ్యాక అనేకమంది యువత కంటే కూడా ఎక్కువ డబ్బును పింఛనుగా పొందటం.. ఇవన్నీ కలిస్తే భారతదేశంలో సగటు ప్రభుత్వోద్యోగి. కొంతమంది ఆదర్శప్రాయ ఉద్యోగులున్నా,




సగటులో మాత్రం అత్యంత అధ్వాన్నం. పేరుకే గణతంత్ర దేశంగానీ ఇక్కడి ప్రజలలో 90శాతం మంది ఈ ప్రభుత్వోద్యోగుల ముందు ద్వితీయ శ్రేణి పౌరులుగానే ఉంటున్నారు. ప్రజాస్వామ్యంలో తామే సార్వభౌములం, ప్రభుత్వోద్యోగులు, పాలకులు సేవకులే అని గుర్తించే సాహసాన్ని కూడా ఈ ప్రజలు చేయలేకపోతున్నారు. ఒక శక్తిమంతమైన అస్త్రాన్ని సాధారణ ఇనపముక్కలా వాడుకున్నట్టు.. ప్రభుత్వోద్యోగుల తాకిడి నుంచి బైటపడటానికి ఎంతో విలువైన ఓటును ప్రజలు చిన్నచిన్న అవసరాలకు బేరం పెట్టుకుంటున్నారు. ఇదే అంశం పైన తెలుగుదేశం సర్వేలో విజయవంతమైన ఎమ్మెల్యేల ఫార్ములాలో బైటపడింది.



LS Times August 16-31 2016 Issue.pmd 9 8/11/2016, 2:47 PM

## సేవలు పెంచకుండా జీతాలు పెంచడమా, ఎక్కడికెళుతోంది ప్రజాస్వామ్యం?: జేపీ

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందిస్తున్న సేవలను ఏమాత్రం మెరుగుపరచకుండా కేంద్ర ప్రభుత్వోద్యోగుల జీతాలను మాత్రం మామూలు ప్రజలకొచ్చే జీతాల కంటే 2-4 రెట్లు ఎక్కువ పెంచారు.. అవినీతి, జీతాలు ఎక్కువ, సేవలు మాత్రం తక్కువ, ప్రజలు యాచకుల్లా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాలి అనే వ్యవస్థతో ఎక్కడికెళుతోంది ప్రజాస్వామ్యం? అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వోద్యోగుల సంఘటిత శక్తి ముందు దేశ ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నారని, నిధుల కొరత విద్య, ఆరోగ్యానికి ఉంటుందిగానీ జీతాలు పెంచటానికి ఉండదా అని జేపీ ప్రశ్నించారు. దేశంలోని 90శాతంమంది అసంఘటిత రంగంలో కనీస జీవన భద్రత లేకుండా ఉన్నారని, వారందరినీ సంఘటిత రంగంలోకి తేవటం, ప్రజలకు పూర్తిస్థాయి సేవలందించేలా పటిష్ట 'సర్వీస్ గ్యారంటీ' చట్టం వంటి మార్పులతో వాటితో ఉద్యోగవ్యవస్థను సంస్కరించాల్సింది పోయి ప్రజాస్వామ్యాన్ని ఉద్యోగస్వామ్యంగా మారుస్తున్నారన్నారు.

ఇప్పుడిస్తున్న నిధులతోపాటు 1శాతం జాతీయాదాయం అదనంగా ఖర్చు చేస్తే ఈదేశంలోని ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించవచ్చుని, అందుకు డబ్బులివ్వటానికి సమస్యలు ఏకరువు పెడుతున్న ప్రభుత్వం ఒక్క కలంపోటుతో రూ.లక్ష కోట్లకు పైగా జీతాల పెంపునకు కేటాయించిందని జేపీ అన్నారు. ప్రజలు ఎదగటానికి కావలసిన విద్య, ఆరోగ్యం, అవినీతి నిరోధం, ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు, మౌలిక వసతులు, పేదరిక నిర్మూలనలో మనదేశం ప్రపంచంలోని తొలి 50 ఆర్థికవ్యవస్థల్లో మనం అట్టడుగున ఉన్నామన్నారు.

పన్ను విధించటం, ఆ డబ్బును తమ మీదే ఖర్చు చేసుకోవటం ప్రతి ప్రభుత్వానికీ ఆనవాయితీగా మారిందని, ప్రజల పన్నుల డబ్బు ఉన్నది జీతాలకు పందేరం చేసుకోమని కాదని జేపీ అన్నారు. ప్రజలకు సేవలందించకుండా పన్నుల వసూళ్ల వ్యవస్థను పెంచాలనుకోవటం దుష్పరిపాలనకు దారితీస్తుందన్నారు. చేసే సేవకి ప్రతిఫలంగా ప్రభుత్వోద్యోగులకి జీతభత్యాలివ్వటం ప్రభుత్వ బాధ్యత. కానీ పన్నులు వసూలు చేసి కూడా "ప్రజలకి ఏ పనులు జరగకుండా ఉంటే, ప్రభుత్వ సేవలు అధ్వాన్నంగా ఉంటే, లంచాల బెడద ప్రజలని వేధిస్తుంటే ప్రభుత్వాలు పట్టించుకోవా? ప్రజలు మౌనంగా చూస్తూ కూర్చోవాలా?" అని జేపీ ప్రశ్నించారు.

కేంద్ర ప్రభుత్వం పెంచింది కాబట్టి రాష్ట్రాలు కూడా ఓటు బ్యాంకు ప్రయోజనాల కోసం ప్రభుత్వోద్యోగుల జీతాలను పెంచుతాయని, కేంద్రం నుంచి 42శాతానికి పెరిగిన నిధుల వాటా వల్ల వస్తున్న చాలా ప్రయోజనాలు దీనివల్ల హరించుకుపోతాయని జేపీ అన్నారు. నిజాయతీపరులైన గొప్ప ఉద్యోగులు అనేకమంది ఉన్నా వారు అరుదైన ఉదాహరణలేనని, ప్రభుత్వ కార్యాలయంలో అవహేళన, వేధింపులు, లంచం లేకుండా పని చేయించుకోవటం కోసం ఇప్పటికీ కోట్లాది మంది ప్రజలకు సాధ్యం కావటం లేదని, జీతాలను పెంచే ముందు వారందరి గురించీ ఆలోచించటం ప్రభుత్వ బాధ్యతని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ఎన్నికలలో గెలవాలంటే డబ్బు, మద్యం వంటివి ఖర్చు చేయటంతోపాటు సొంత జీవితమంటూ లేకుండా, తన బాధ్యతతో సంబంధం లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆ ఎమ్మెల్యేలు చెబుతున్నారు. ప్రభుత్వాధికారి చేత పనిచేయించుకోవటం కంటే ఓటు కోసం ఎంతకయినా దిగజారే నాయకులను పట్టుకోవటం తేలికని ప్రజలు కూడా భావిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యేలు తాము చేయాల్సిన శాసనసంబంధమైన పనులు వదిలేసి ప్రభుత్వంలో భాగంగా మారిపోయి ఉద్యోగులు చేయాల్సిన పని తాను చేయటం మొదలుపెట్టారు. ఇందుకోసం కార్యాలయాలు తెరవటం, కొంతమంది అనుచరగణాన్ని మెయింటెయిన్ చేయటం, ఉద్యోగుల బదిలీలు వగైరాల కోసం పైరవీలు చేయటం వంటివి చేస్తున్నారు. వీటన్నిటికీ ఒక ఎమ్మెల్యేకి నెలకు కనీసం రూ.10 లక్షలు ఖర్చవుతుందని, కాస్త ఘరానా ఎమ్మెల్యే అయితే ఇది ఇంకొన్ని రెట్లు పెరుగుతుందని చెబుతారు. ఈ డబ్బంతా ఎవరిస్తారు? ప్రజల నుంచే గుంజుతారు. పార్టీలు ఫిరాయించటం వంటి పనుల ద్వారా సంపాదిస్తారు. అక్రమ వ్యాపారాల ద్వారా, లీజులు, విద్య, వైద్యం వంటి మౌలిక రంగాలను ఆక్రమించటం వంటి వాటి ద్వారా కొట్టేస్తారు. ఇలా డబ్బు ఖర్చు పెట్టి గెలవటం, గెలిచాక రోజూ ప్రజల వ్యక్తిగత కార్యక్రమాలకు హాజరువేయించుకుంటూ వారి మధ్య ఉన్నట్టు నటించటం, నెలకు లక్షలతో కార్యాలయాల్ని, పెయిడ్



LS Times August 16-31 2016 Issue.pmd 10 8/11/2016, 2:47 PM

కార్యకర్తల్ని మెయింటెయిన్ చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించిపెట్టటం, ఈ మొత్తానికీ గానూ భారీగా ప్రజాధనాన్ని లూటీ చేయటం– ఇదీ నేటి ప్రజాస్వామిక రాజకీయం. పేరుకే ప్రజాస్వామ్యంగా ఉన్న ఈ రాజకీయంలో ఇమడలేక చాలామంది మంచివారు, సమర్థులు క్రమంగా రాజకీయాల నుంచి విరమించుకుంటున్నారు. కొత్తగా రావాలనుకుంటున్నవారు, ఈ పోటీయుగంలో ఎందుకింత రిస్కు అని రాజకీయాల్లోకి రావడమే మానేస్తున్నారు. ఇక ఏరంగంలోనూ పెద్దగా రాణించలేనివారు, అధికారం, డబ్బు ఎలా సంపాదించినా తప్పుకాదనుకునే మిడిమిడి జ్ఞానం కలవారు, అసమర్థులు ఈ కీలక రంగాన్ని కబ్జా చేసేస్తున్నారు. తాము తప్ప గతిలేదన్నట్టుగా వీళ్లు ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో చివరికి నష్టపోతున్నది ప్రజలు, ప్రజాస్వామ్యమే. ప్రజల జీవితాల్లో ప్రతి రంగాన్నీ ప్రభావితం చేసే రాజకీయాన్ని ఇలా వదిలేయటమే మన సమస్యలన్నిటికీ ప్రధాన కారణం. దీన్ని ప్రక్షాళన చేయాలంటే, ప్రధానంగా మన ప్రభుత్వోద్యోగ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. ప్రభుత్వోద్యోగులను నిజమైన ప్రజాసేవకులుగా మార్చాలి. పైన పేర్కొన్న ఉదంతాల్లో.. తెలంగాణలో పెద్ద హోదా గల ప్రజాప్రతినిధికి, ఓ మాజీ ప్రభుత్వోద్యోగికి కూడా ప్రభుత్వోద్యోగుల సేవలు అందటం లేదని స్పష్టంగా కనిపిస్తుంది.

నిజానికి రెండు రాష్ట్రాలయ్యాక కూడా రాజకీయం, జనం జీవితాలు ఏమీ మారలేదని చెప్పటానికి ఈ తాజా ఉదాహరణలను చెప్పాల్సివచ్చిందిగానీ, ఇది ఎప్పటినుంచో తెలుగునాట పాతుకుపోయిన పెత్తందారీ సంస్కృతి. దీనిపై లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఒక పౌరునిగా, ఐఏఎస్‌గా, ఉద్యమకారునిగా, జనరాజకీయవేత్తగా, శాసనసభ్యునిగా ఎన్నో ఏళ్లుగా హెచ్చరిస్తూ, పరిష్కారాలతో పోరాడుతూ వస్తున్నారు. ఈ బ్రిటీషు వలసపాలన వారసత్వాన్ని మార్చటానికి ముందుగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ఎమ్మెల్యేలు, ఎంపీల జోక్యం అవసరం లేకుండా, లంచాలు లేకుండా ఏర్పాటు చేయాలి. ప్రజలు ఒక హక్కుగా ప్రభుత్వ కార్యాలయాల్లో తమ పనుల్ని తలెత్తుకుని చేయించుకోగలిగే పరిస్థితుల్ని కల్పించాలి. ఇందుకోసం మొట్టమొదటి బలమైన ఏర్పాటు– సర్వీస్ గ్యారంటీ చట్టం అని జేపీ ప్రజలను చైతన్యపరుస్తూ ఆ చట్టం కోసం కృషి చేస్తున్నారు.



సర్వీస్ గ్యారంటీ చట్టం ప్రకారం.. సర్కారీ కార్యాలయాల్లో ప్రతి పనికీ ఒక నిర్ణీత కాలవ్యవధిని నిర్ణయించి, ఆ గడువులోగా పూర్తికాకపోతే అర్జీ పెట్టుకున్న పౌరుడు/పౌరురాలికి రోజుకు కనీసం రూ.250 పరిహారం చెల్లించే ఏర్పాటు చేయాలి. బ్రిటన్ భారతీయ పౌరుల్ని ద్వితీయ శ్రేణి పౌరుల్లా చూసిందిగానీ, తన సొంత పౌరులకు ఇలాంటి చట్టాన్ని తెచ్చింది. బ్రిటన్‌లో జులై, 1991లో జాన్ మేజర్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఈ సిటిజన్ ఛార్టర్స్‌ని విజయవంతంగా ప్రవేశపెట్టారు. 1992లో బెల్జియంలో, 1993లో మలేషియాలో, 1997లో ఆస్ట్రేలియాలో సిటిజన్ ఛార్టర్ల ద్వారా పౌరులకు హక్కుగా సేవలందించే పద్ధతిని తీసుకొచ్చారు. తర్వాత అనేక దేశాలు ఈ దారి తొక్కాయి. ఉద్యమాన్ని ప్రారంభించిన 1996–97 నుంచే లోక్‌సత్తా మనదేశంలో సిటిజన్ ఛార్టర్ల కోసం వ్యవస్థీకృత ప్రయత్నాల్ని ప్రారంభించింది. ప్రజలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సేవలతో 1998లో లోక్‌సత్తా దేశంలోనే తొలిసారిగా 'స్వరాజ్యం' పేరుతో పౌరహక్కుల పత్రాన్ని పుస్తకరూపంలో వెలువరించింది. అప్పటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సి. రంగరాజన్ ఈ సిటిజన్ ఛార్టర్ల పుస్తకాన్ని ఆవిష్కరించారు. గుంటూరు, తణుకు, కుత్బుల్లాపూర్ మునిసిపాలిటీల్లో కొన్ని సేవలకు ఈ సిటిజన్ ఛార్టర్లను అమలుచేశారు. కొంతమందికి పరిహారం కూడా చెల్లించారు. అలా పరిహారం పొందినవారికి లోక్‌సత్తా ప్రోత్సాహకాలను కూడా ఇచ్చింది. అయితే ఆ ప్రయత్నం వ్యవస్థీకృతం కాలేదు. అందుకే ప్రభుత్వ కార్యాలయాల్లో వేధింపులు, లంచాలు లేకుండా నిర్ణీత గడువులో సేవలందించేందుకు దేశవ్యాప్తంగా సర్వీస్ గ్యారంటీ చట్టాన్ని తెచ్చేందుకు లోక్‌సత్తా తన ప్రయత్నాల్ని కొనసాగించింది. చివరకు అన్ని అడ్డంకులనూ దాటుకుని బిల్లును పార్లమెంటు వరకూ తీసుకెళ్లగలిగింది. గత యూపీయే ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ గ్యారంటీ బిల్లు అప్పటి పార్లమెంటు కాలపరిమితి ముగియటంతో రద్దయింది. ప్రస్తుత నరేంద్ర మోదీ ప్రభుత్వం ద్వారా కూడా ఈ బిల్లును తీసుకొచ్చేందుకు లోక్‌సత్తా ప్రయత్నిస్తోంది. నిజానికి లోక్‌సత్తా కృషితోనే 2005లో వచ్చి అనేక అవినీతి వ్యతిరేక పౌరసమాజ ఉద్యమాలకు ఇంధనాన్నిచ్చిన సమాచార హక్కు చట్టం కంటే కూడా ఈ సర్వీస్ గ్యారంటీ చట్టం ఎంతో శక్తిమంతమైనది, ప్రశ్నించటాన్ని దాటి ప్రజలకు ఫలితాలనిచ్చేది, ఎన్నికల తీరుని మార్చి మంచి నాయకులను పెంచగలిగేది.



LS Times August 16-31 2016 Issue.pmd 11 8/11/2016, 2:47 PM

ఈ చట్టం వస్తే ఎన్నికలలో అక్రమంగా ఖర్చు చేయటానికి తమకు డబ్బు తగ్గుతుందని, అవినీతికి పాల్పడటంలో అధికారులు సహకరించరని సాంప్రదాయ రాజకీయ పార్టీల నేతలు అడ్డుకునే ప్రయత్నం చేస్తుంటే, ఈ చట్టం వల్ల తమ అదనపు ఆదాయానికి గండి పడి ఒళ్లు వంచాల్సి వస్తుందని, ప్రజల ముందు తలవంచాల్సి వస్తుందని అధికారులు అడ్డంగా నిలబడుతున్నారు. ప్రజలకు సేవ చేసి, ప్రజలిచ్చే పన్నుల డబ్బు ఆదాయాన్ని జీతం రూపంలో తీసుకుని ఎంతో బాధ్యతగా దేశనిర్మాణంలో భాగస్వాములు కావలసిన అధికారులు, సంఘటిత శక్తితో దేశాన్ని, ప్రభుత్వాల్ని బెదిరించేలా వ్యవహరించటం క్షమార్హం కాని తప్పిదం. ప్రతి ఎన్నికకూ ప్రజలకు ఏదో కొత్తగా చేసినట్టు కనిపించాల్సిరావటం, పట్టణ ప్రాంతాల్లో ప్రజలలో చైతన్యం పెరగటం, సాంకేతిక పరిజ్ఞానం విస్తృతం కావటంతో మీ సేవ, ఈ సేవ వంటి పేర్లతో కొంత ప్రజలకు వేగంగా, అవినీతికి తక్కువ అవకాశాలతో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు పనులు జరిగే ఏర్పాట్లు గత కొన్నేళ్లుగా మొదలయ్యాయి.

**ఆఫ్‌లైన్ టూ ఆన్‌లైన్..**

**గుడ్డిలో మెల్ల అన్నట్టుగానే తగ్గిన అవినీతి**

ఎలక్ట్రానిక్ సర్వీసుల వల్ల అవినీతి తగ్గిందని, సర్వీస్ గ్యారంటీ చట్టం వంటి వాటి అవసరం లేకుండానే ప్రజలకు పనులు వేగంగా జరుగుతున్నాయని ఇటీవల కొంతమంది వాదిస్తున్నారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం, తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం కూడా సాంకేతిక పరిజ్ఞానం వినియోగం చాలు.. రోజువారీ సేవల్లో అవినీతి కట్టడికి అనే భావాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అవినీతి పరుల్ని పట్టుకోవటం, బలమైన సాక్ష్యాలతో శిక్షలు పడేలా చూడటం చేయకుండా పంజరంలో చిలకలా ప్రభుత్వ పలుకుల్ని చెబుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఏకంగా టెక్నాలజీతో అవినీతిని అరికట్టండంటూ ఏకంగా హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌కు లేఖ రాసింది. అవినీతిపై ప్రజల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇదే సూచన చేసింది. ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిన బడా రాజకీయ నిందితుల్ని వదిలేసి ఇలాంటి అసమర్థ సలహాలనివ్వటంతో తెలంగాణ ఏసీబీ కాలక్షేపం చేస్తుంటే, క్షేత్రస్థాయిలో వాస్తవాలు మరో విధంగా ఉన్నాయి.

మీ సేవ కేంద్రాల ద్వారా కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాల కోసం మే, జూన్ నెలల్లో హైదరాబాద్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు భారీగా దళారుల చేతులు తడిపారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో 16 మండలాలున్నాయి. ఈ రెండు నెలల్లో గడువు దాటినా 2,000కి పైగా దరఖాస్తుల్ని అపరిష్కృతంగానే వదిలేశారు. కుల ధృవీకరణకు సంబంధించి 1,547, నివాస ధృవీకరణకు సంబంధించి 582 దరఖాస్తుల్ని పెండింగ్‌లో పెట్టారు. ఎందుకు జాప్యం అంటే.. సిబ్బంది కొరత అని జవాబిస్తున్నారు. మీ సేవ కేంద్రంలో ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేయగానే తహసీల్దారు కార్యాలయానికి చేరుతుంది. క్షేత్రస్థాయిలో ఆర్ఐలు పరిశీలించి అనుమతిస్తే తహసీల్దార్ ధృవీకరణ పత్రాన్ని ఇస్తారు. కానీ సిబ్బంది కొరతని, తహసీల్దారుకు తీరకలేదని వాయిదా వేస్తుండటం వల్ల ప్రజలు దళారులను ఆశ్రయిస్తున్నారు. విచిత్రంగా, దళారులకు మాత్రం ఈ సమస్యలేవీ తలెత్తటం లేదు. సాయంత్రంకల్లా అడిగిన ధృవీకరణ పత్రాన్ని తెచ్చి ఒక్కో అర్జీకి రూ.200-500 వసూలు చేస్తున్నారు. ఇందుకు మండల కార్యాలయాల్లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది గతంలోలాగే సహకరిస్తున్నారని వేరే చెప్పనక్కర్లా. ఇంకో కేసు జలమండలి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక హైదరాబాద్‌లో కొత్త నల్లాల జారీకి ఆన్‌లైన్ సేవలను పకడ్బందీ చేసినా ప్రజలకు వేధింపులు, లంచాలు తప్పటం లేదు. 45రోజుల్లో నల్లా కనెక్షన్‌కు ఆన్‌లైన్, యాప్ విధానాల్ని అందుబాటులో వున్నా ఇవేవీ పనిచేయటం లేదు. దళారులు ప్రతి కనెక్షన్‌కీ రేటు కట్టి వసూలు చేస్తూనే ఉన్నారు. ఒక వినియోగదారుడు మంత్రి పేషీలో ఫిర్యాదు చేశారు. మంత్రి పీఏ జలమండలి అధికారులతో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడినా ఏమీ ప్రయోజనం లేకుండా పోయింది. నగరవ్యాప్తంగా డివిజన్ల కార్యాలయాలతోపాటు ఖైరతాబాద్‌లోని సింగిల్‌విండో సెల్ దళారులకు అడ్డాగా మారింది. గ్రేటర్‌లో నెలకు 400 నుంచి 500 వరకు నల్లాలు జారీ అవుతుంటాయి. 15 ఎంఎం దయా కొత్త నల్లాలను ఆయా డివిజన్లలోని జీఎం స్థాయిలో జారీ చేస్తారు. 20 ఎంఎం నుంచి ఆపై 100 ఎంఎం కనెక్షన్‌లను ఖైరతాబాద్‌లోని సింగిల్‌విండో సెల్ నుంచి పొందాలి. మొదట వచ్చిన వారికి మొదట పద్ధతిలో ముగ్గురు అధికారుల కమిటీ నల్లాను కేటాయించాలి. కానీ దళారులదే రాజ్యం. కనెక్షన్ సైజు పెరిగినకొద్దీ ముడుపులు పెరుగుతున్నాయి. కీలక అధికారుల ఆశీస్సులతో, కింది స్థాయి ఉద్యోగుల అండతో దళారులు చెలరేగుతున్నారు. డిమాండ్‌ను బట్టి రేటు చెల్లిస్తే గంటల్లో నల్లా గ్రాంట్ అయిపోతుంది. లేదంటే కొర్రీల మీద కొర్రీలు పెట్టి బుర్ర తిరిగిపోయేలా చేస్తారు, నెలల తరబడి తిప్పించుకుంటారు. ఇళ్లు, భవన నిర్మాణానికి మునిసిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతి ఉండాలంటే తొలుత నల్లా కనెక్షన్ కోసం ఫీజిబిలిటీ




LS Times August 16-31 2016 Issue.pmd 12 8/11/2016, 2:47 PM

ధృవీకరణను జలమండలి జారీచేస్తుంది. ఇందుకోసం ప్లాట్ ఏరియానుబట్టి కొంతమొత్తాన్ని జలమండలి వద్ద డిపాజిట్ చేయాలి. భవన నిర్మాణం పూర్తయ్యాక నల్లా జారీ సమయంలో ఈ మొత్తాన్ని కనెక్షన్ ఛార్జీల నుంచి సదలిస్తారు. ఈ సమయంలోనూ వినియోగదారులు అదనంగా డబ్బు చెల్లించక తప్పటం లేదు. హైదరాబాద్ ఆవల తెలంగాణ జిల్లాల నుంచి కూడా అవినీతి మీద ఫిర్యాదులు భారీగానే ఉన్నాయి. తాజా కృష్ణవేణి పుష్కరాల్లో కూడా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి మీద ఫిర్యాదు చేయండంటూ ముఖ్యమంత్రి ఇచ్చిన నెంబర్‌కి లక్షల్లో ఫిర్యాదులు వచ్చాయంటారుగానీ, దాని గురించి ఎవరూ పెదవి విప్పరు. 'ఆ' అన్నా, 'ఊ' అన్నా పతాకశీర్షికల్లో వార్తలు తెచ్చుకోగలిగిన ముఖ్యమంత్రి.. అవినీతిపై జిల్లాల నుంచి ఎన్ని ఫిర్యాదులచ్చాయో ఏం చర్యలు తీసుకున్నారో మాత్రం చెప్పలేకపోతున్నారు.

ఇక ఆంధ్రప్రదేశ్‌లో పట్టాదారు పాసుపుస్తకాల జారీ టెక్నాలజీ యుగంలో అవినీతికి పెద్ద ఉదాహరణ. ప్రభుత్వం హడావుడిగా చేసిన వెబ్‌ల్యాండ్ మీద నమ్మకం లేక పట్టాదారు పాసుపుస్తకాలు కోసం ఆరాటపడుతున్న రైతుల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తేడా లేకుండా రూ.50,000 స్టాండర్డ్ లంచం వసూలుచేస్తున్నారు. ఏమన్నా తేడాలుంటే ఈ రేటు ఇంకా ఇంకా పెరుగుతుంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో టెక్నాలజీ తెచ్చిన పారదర్శకతతో అవినీతి గణనీయంగా తగ్గిపోయిందని, ప్రభుత్వోద్యోగుల పనితీరు బాగుందని 70-75శాతం కుటుంబాలు భావిస్తున్నట్టు, తమ అభిప్రాయ సేకరణలో తేలిందని చంద్రబాబు ప్రభుత్వం చెబుతుంటే.. అలాంటిదేమీ లేదు ప్రభుత్వ సేవలలో కీలకమైన రెవిన్యూ శాఖలోనే ఇంకా 42శాతం అవినీతి ఉందని చంద్రబాబు భావిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి వ్యాఖ్యానించారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్లతో ప్రచారం పొందటంలో సిద్ధహస్తుడైన చంద్రబాబు ఓపక్క లోటు బడ్జెట్ అంటూనే గోదావరి, కృష్ణా పుష్కరాలకు రూ.3,000 కోట్లు కేటాయించారు. శాశ్వత ఘాట్‌లని కథలు చెప్పినప్పటికీ ఈ పనులు యధావిధిగా నాసిరకంగానే ఉన్నాయి. నామినేషన్ పద్ధతిన నచ్చినవారికి ఈ పనులు అప్పగించటంతో ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి అధికారులు యధేచ్ఛగా దోచుకుని నాణ్యతకు బొర్రెలు పెట్టారు. మరోవైపు, ఉద్యోగుల బదిలీలకు విధివిధానాలను నిర్ణయించి ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని ప్రవేశపెట్టినా మే, జూన్‌లలో జరిగిన సాధారణ బదిలీల్లో గతంలోలాగానే ఎమ్మెల్యేలు, మంత్రులు కీలకపాత్ర పోషించారు. తమ మాట వినని జిల్లా స్థాయి అధికారులను పట్టుబట్టి మరీ బదిలీ చేయించుకున్నారు, తమకు కావాలసినవారికి, చేతులు తడిపినవారికి పోస్టింగులు ఇప్పించుకున్నారు. ఇందులోనూ పెద్ద అధికారులే మంత్రులకు యథాశక్తి తోడ్పాటునందించారు. ఇక చంద్రన్న సంక్రాంతి కానుక, రంజాన్ తోఫాల్లో నాసిరకం సరకుల్ని జనం మొహాన కొట్టి నేతలు కోట్లు నొక్కేయటానికి అధికారులు సహకరించటం అవినీతి విషవలయంలో ఓ పిట్టకథ.

## అవినీతి తగ్గితే ఎమ్మెల్యేలు, ఎంపీల చుట్టూ జనం ఎందుకు తిరుగుతున్నారు?

ఆన్‌లైన్‌తో ప్రభుత్వోద్యోగుల అవినీతి దాదాపు తగ్గిపోయిందంటున్న చంద్రబాబు ప్రభుత్వానికి సొంత పార్టీ ఎమ్మెల్యేల సక్సెస్ ఫార్ములాయే జవాబు చెబుతోంది. అవినీతి తగ్గితే ప్రజలు ఎమ్మెల్యేలు, ఎంపీల చుట్టూ తిరుగుతారు? ప్రజలకు రోజువారీ పనులు చేస్తేనే మనం గెలుస్తామని




తెలుగుదేశం ఎమ్మెల్యేలు సహచరులకు ఎందుకు పాఠాలు బోధిస్తున్నారు? అలాగే తెలంగాణలో ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులకే ఎందుకు సాధారణ అవసరాలకు కూడా దిక్కులేకుండా పోయింది?

ఈ మొత్తం తాజా సమాచారాన్ని, వివరాల్ని చూస్తే.. గతంలోలాగానే తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వోద్యోగుల వ్యవస్థ అత్యంత అధ్వాన్నంగా ప్రజలను వేధిస్తూ, వారి నుంచి లంచాలు గుంజుతూ, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వారిపై పెత్తనం చేస్తోందని, జనాభాల్లో 1శాతం కూడా లేనివారు దేశాభివృద్ధికి పెద్ద ఎత్తున అవరోధాలను సృష్టిస్తూనే ఉన్నారని స్పష్టమవుతోంది.

ఇది కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాదని, పలు



LS Times August 16-31 2016 Issue.pmd 13 8/11/2016, 2:47 PM

రాష్ట్రాల్లో, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో ఇదే అధ్వాన్న ఆధిపత్య సంస్కృతి అని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వల్ల ఖచ్చితంగా పరిస్థితులు మెరుగవుతున్నాయి. కానీ అది చాలదు. సాంకేతిక యుగంలో కొత్త పుంతలు తొక్కే అవినీతి కట్టడికి ప్రభుత్వ కార్యాలయాల్లో 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని అమలు చేయాలి. కొన్ని ప్రభుత్వ పనుల్లో ఎంత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినా అధికారులు, ప్రభుత్వంలోని ఇతర వ్యక్తుల పాత్ర కీలకంగానే కొనసాగుతుంది. కాబట్టి ఈ చట్టం అమలు అనివార్యం. క్రమంగా విద్య, ఆరోగ్యం వంటి ప్రభుత్వ మౌలిక విధులకు కూడా ఈ చట్టాన్ని విస్తరించాలి. ఆన్‌లైన్ సేవలతో అవినీతి పోయిందనుకుంటే, సర్వీస్ గ్యారంటీ చట్టాన్ని అమలు చేయటానికి ఎందుకు అభ్యంతరం? సర్వీస్ గ్యారంటీ చట్టంతోపాటే ఉన్నతస్థాయి అవినీతి కట్టడికి మరిన్ని ఏర్పాట్లు కావాలి. ఏసీబీ, సీబీఐలకు జవాబుదారీతనంతో కూడిన స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించాలి. జాతీయస్థాయిలో లోక్‌పాల్ తరహాలోనే రాష్ట్రాల్లో బలమైన లోకాయుక్తను, జిల్లాల్లో అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటుచేయాలి. వేగంగా అవినీతి కేసుల విచారణ జరిపి శిక్షలతోపాటు ఆస్తుల్ని జప్తు చేయాలి. అధికారాన్ని వార్డు స్థాయిలోకి వికేంద్రీకరించి స్థానికంగా సేవలందే ఏర్పాటు చేయాలి. ఏటా తలసరి రూ. 1,000–2,000 కేటాయిస్తూ ఎన్నికైన వార్డు కమిటీలతో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. ప్రభుత్వోద్యోగమంటే జీవితకాలం గ్యారంటీ అనే పద్ధతిని తొలగించి..బాధ్యతలకు తగ్గట్టు సక్రమంగా పనిచేయని ఉద్యోగులను తొలగించే ఏర్పాటు చేయాలి. సమాజంలో ఆయా రంగాలలో నిపుణులైనవారిని, గణనీయ సేవ చేసేవారిని నిర్ణీత కాలవ్యవధితో తాత్కాలిక ఉద్యోగులుగా నియమించే పద్ధతిని ప్రవేశపెట్టాలి. అప్పుడు ఈదేశంలో నగం సమస్యలకు నిజమైన పరిష్కారం మొదలవుతుంది. దీనికి కొన్ని రాజకీయ, ఎన్నికల్లో నల్లడబ్బు ప్రవాహాన్ని తగ్గించే ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణల్ని జోడిస్తే.. ప్రభుత్వోద్యోగ వ్యవస్థ పూర్తిస్థాయి ప్రజాసేవకుల వ్యవస్థగా రూపాంతరం చెందుతుంది. ప్రపంచీకరణ అవకాశాల మధ్య అధికార లాలస, డబ్బే రాజకీయం అనే పరిస్థితులున్నప్పుడు ఎంత గొప్ప చట్టానికయినా ఏదోకరకంగా తూట్లు పొడిచే అవకాశముంది కాబట్టే.. ప్రజలకు ప్రభుత్వ సేవలు సక్రమంగా అందటానికి ఆన్‌లైన్ సేవలు, సర్వీస్ గ్యారంటీ చట్టంతో పాటు ఇన్ని బహుముఖ సంస్కరణల్ని తెచ్చుకోవాల్సుంది. ప్రజాస్వామ్యం పరిణతి చెంది పాలకులు, ప్రభుత్వోద్యోగులు సేవకుల్లా వ్యవహరించటం సంస్కృతిగా మారేంతవరకూ ఇంత బహుముఖ పోరాటం తప్పదు.

ప్రభుత్వోద్యోగులు అంటే దేశంలోపలి సైన్యం. ఈ ముక్కోటి సైన్యం నిబద్ధతతో, నైపుణ్యతతో పనిచేస్తే ప్రపంచదేశాలు భారత్ వైపు తేరిపార చూడగలుగుతాయా?

ప్రభుత్వోద్యోగ వ్యవస్థ సక్రమంగా ఉంటే.. ఈదేశంలో రాజకీయ నాయకులు ఇంత బరితెగించి కోట్లు దోచుకునేవారు కారు, లక్షల కోట్లు ఇతర దేశాలకు తరలించేవారు కాదు, జనం సొమ్ము ఎగ్గొట్టి ఇతర దేశాలకు తరలివెళ్ల గలిగేవారు కాదు. రాజకీయాలలో ఇంత దోపిడీ, ఎన్నికలలో ఇంత నల్ల డబ్బు ఖర్చు, ఇన్ని అక్రమాలు జరిగేవి కాదు, ఇన్ని కోర్టు కేసులు పెరిగేవి కావు.. సమర్థులు, నిజాయతీపరులు రాజకీయాలలో ఓడిపోతుండేవారు కాదు. ఈదేశాన్ని బాగుచేయాలంటే, ప్రజలకు–ప్రభుత్వోద్యోగులకు మధ్య యుద్ధాన్ని సృష్టించాలని గొప్ప రైతు ఉద్యమకారుడు, నిజమైన ఆధునిక ప్రజాస్వామ్య నాయకుడు శరద్ జోషి అంటుండేవారట. కానీ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందించే రోజువారీ సేవలను పెంచకుండానే, ఉద్యోగుల అవినీతిని అంతమొందించకుండానే, సమాజ స్థితిగతుల గురించి ఆలోచించకుండానే.. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏకంగా 43శాతం మేర, ప్రధాని నరేంద్ర మోదీ రూ. 1లక్ష కోట్ల రూపాయల మేర ప్రభుత్వోద్యోగులకు జీతాల్ని పెంచేశారు. ప్రజల గురించి పైకి చెబుతున్న మాటల్లో ఏమాత్రం నిజాయతీ ఉన్నా, మరో మాట లేకుండా 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని తక్షణం తీసుకురావాలి. 2014కు ముందు పార్లమెంటు కమిటీ అభ్యర్థన మేరకు సర్వీస్ గ్యారంటీ చట్టాన్ని రూపొందించి అందించిన లోక్‌సత్తా 2014లో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా రౌండ్‌టేబుల్ సమావేశాలతో ఆ చట్టంపై సూచనల్ని ఆహ్వానించి మెరుగుపరిచిన బిల్లును కొత్త ప్రభుత్వానికి అందించింది. దేశవ్యాప్తంగా ఈ చట్టాన్ని అమలు చేయాలని కోరుతోంది. రాష్ట్రాలు కోరితే ఇదే నమూనాలో ప్రత్యేకించి రూపొందించటానికి సంసిద్ధతను ఇప్పటికే పలువురు ముఖ్యమంత్రులకు తెలియచేసింది. ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజలకు ప్రభుత్వ సేవలు సక్రమంగా అందటానికి, ప్రభుత్వోద్యోగులు చేయాల్సిన పనులు చేసి పెట్టి దోచుకునేవారి స్థానంలో నిజాయతీపరులు, సమర్థులు గెలవగలిగేలా ఎన్నికల వ్యవస్థను సంస్కరించటానికి కీలక అడుగుగా ప్రభుత్వ కార్యాలయాల్లో 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా ఆలస్యం చేయకుండా వెంటనే తీసుకురావాలి. ★



LS Times August 16-31 2016 Issue.pmd 14 8/11/2016, 2:47 PM

# 'పౌరసేవలు' హక్కు కావాలి

ప్రజల యొక్క, ప్రజల కొరకు, ప్రజల చేత అంటూ ప్రజాస్వామ్యం గురించి తరతరాలకూ చెరగని నిర్వచనాన్నిచ్చిన అబ్రహాం లింకన్ అధ్యక్షకాలంలో కూడా అమెరికాలో కొందరికే ఓటు హక్కు ఉంటే, మనదేశం స్వతంత్రం వచ్చిన తొలినాళ్ల నుంచీ దేశంలో అందరికీ వయోజన ఓటు హక్కునిచ్చి అత్యంత సాహసోపేత రాజకీయ సంస్కరణను అమలుచేసింది. ఇంత గొప్ప తొలిఅడుగును మనదేశం వేసినా, 'ప్రజలే ప్రభువులు .. పాలకులు, ప్రభుత్వోద్యోగులు సేవకులే' అనే ప్రజాస్వామ్య సంస్కృతి ఇంకా మనదేశంలో వేళ్లూనుకోలేదు. ప్రజలు, ప్రభుత్వం పాత్ర తారుమారైపోయి పౌరులు యాచించేవారుగా, పాలకులు, ప్రభుత్వోద్యోగులు దయదలిచి దానాలు, వరాలు ప్రకటించే యజమానులుగా కొనసాగుతున్నారు. చుట్టుపక్కల దేశాలతో పోలిస్తే ఏదోక రకంగా ఎన్నికలు జరిగి శాంతియుతంగా అధికార మార్పిడి జరుగుతోంది కాబట్టి మనది ప్రజాస్వామ్య దేశం అనే మేరకే సంతృప్తిపడాల్సి వస్తోంది. మన పాలనావ్యవస్థ ఇంకా బ్రిటీషు దొరల ప్రభావం నుంచి బైటపడలేదు. దానికితోడు స్వదేశంలో పాతుకుపోయి ఉన్న మధ్యయుగాలనాటి భూస్వామ్య సంస్కృతి. మెజారిటీ భారతీయుల్ని ద్వితీయశ్రేణి పౌరులుగా భావించే ఈ రెండు ధోరణులనూ భారత రాజ్యాంగం నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నప్పటికీ, ప్రజలలో పౌరసత్వ భావన వేళ్లూనుకునేలా చేసే అధికార వికేంద్రీకరణ, అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, గ్రామాలు-పట్టణాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు వ్యవసాయంలో స్వేచ్ఛా మార్కెట్ వంటి మౌలిక సంస్కరణలు తొలితరంలో రాకపోవటం వల్ల పౌరులు పాలకుల్ని, ప్రభుత్వోద్యోగుల్ని ఆధునిక దొరల్లా భావించే పరిస్థితి ఏర్పడింది.

అన్నీ ప్రభుత్వమే చేస్తుంది అనే సోషలిస్టు భావజాలం ఈ పరిస్థితిని సర్వత్రా మరింత పాతుకుపోయేలా చేసింది. నిజానికి కోట్లాది సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఢిల్లీలోనో, రాష్ట్ర రాజధానుల్లోనో పెద్ద పని ఉండదు. వారి రోజువారీ జీవితం ఎక్కువగా స్థానిక ప్రభుత్వాల చుట్టూనే తిరుగుతుంటుంది. 80శాతం పనులు స్థానికంగానే పూర్తి కావచ్చు. కానీ అధికారాన్ని కేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు లేకుండా ఏజన్సీలుగా మార్చేయటం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం, వేధింపులు, ఛీత్కారాలు, సిఫార్సులు లేకుండా పనిచేసే పరిస్థితి లేకపోవటం వల్ల ఎన్నికలలో ఓటుకు నోటు, మద్యం, తాత్కాలిక తాయిలాల పథకాలు, ఇతర ప్రలోభాలు వంటివి ఆశిస్తూ ఓటు వేసే వారి సంఖ్య పెరిగిపోయింది. ఈ రకంగా ఓట్ల వేటలో అసలు తాము చేయాల్సిన మౌలికమైన బాధ్యతల్ని - చట్టబద్ధ పాలన, శాంతిభద్రతల పరిరక్షణ, మౌలిక వసతుల ఏర్పాటు, విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి వాటిని ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సేవలందించే వ్యవస్థను మెరుగుపరిచే సంస్కరణల్ని, చట్టాల్ని తీసుకురాకపోవటం వల్ల రాజకీయ నాయకులు కూడా మూల్యం చెల్లించాల్సి వస్తోంది.

సేవకులుగా ప్రభుత్వోద్యోగులు ప్రజలకు చేసిపెట్టాల్సిన పనుల్ని ఏదోకరకంగా రాజకీయ నాయకులే చేసి పెడుతూ ఓట్లు దండుకోవటం ఎన్నికల రాజకీయంగా మారింది. ప్రజలకు చేయాల్సిన చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన పనులు పక్కనపడేసి ప్రజలకు రోజువారీ అందుబాటులో ఉండి వారికి అవసరమైన పనులు చేసి పెట్టి ప్రచారం తెచ్చుకుంటే, ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం, తాయిలాలు పంచితే, భవిష్యత్తుకు తీవ్ర నష్టం చేసేవైనా సరే కొన్ని తాత్కాలిక పథకాలను హామీగా పడేస్తే గెలుపునకు అవకాశాలుంటాయనేది ఫార్ములాగా మారింది. ఇవీ చాలకపోతే ప్రజల మధ్య ఆటవిక భావోద్వేగాలను రెచ్చగొట్టి విభేదాల్ని సృష్టించటానికి కూడా వెనకాడటం లేదు. ఈ క్రమంలో నియోజకవర్గానికి రెండొందల మంది దాకా రాజకీయ బ్యూరోక్రాట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా రాజకీయ బ్యూరోక్రాట్లని పోషించటానికి ఒక ఎమ్మెల్యే తక్కువలో తక్కువగా నెలకి పదిలక్షల దాకా ఖర్చు చేయాల్సి ఉంటుందని అనుభవజ్ఞులైన సాంప్రదాయ రాజకీయ పార్టీల నేతలు బహిరంగంగానే చెప్పే మాట. ఇంత డబ్బును, సమయాన్ని వెచ్చిస్తున్నందుకు ఎన్నికయ్యాక అనేకరెట్లు దండుకోవటం రాజకీయ నేతలకు ఆనవాయితీగా మారింది. ఈ క్రమంలో ప్రభుత్వ కార్యాలయాలను ప్రక్షాళన చేసే సాహసాన్ని నేతలెవరూ చేయటం లేదు. పైపెచ్చు ఎన్నికైనవారిలో చాలామంది నేతలు ప్రభుత్వోద్యోగుల విషయంలో తమకు అందుబాటులో ఉండే బదిలీలు, ఇతరత్రా అధికారాల్ని అక్రమ సంపాదనకు మార్గంగా వినియోగించుకుంటున్నారు. అంతేతప్ప, ప్రభుత్వోద్యోగిని సేవాభావానికి మారుపేరుగా మార్చే దిశగా నిర్మాణాత్మక ప్రయత్నం మాత్రం చేయటం లేదు.

స్వతంత్ర పోరాటకాలంలో గాంధీ, నెహ్రూ, పటేల్, సుభాష్ బోస్, అంబేద్కర్, సరోజినీ నాయుడు, మౌలానా ఆజాద్, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, ప్రకాశం పంతులు వంటి అనేకమంది



LS Times August 16-31 2016 Issue.pmd 15 8/11/2016, 2:47 PM

తమ ఆకర్షణీయమైన ఆదాయావకాశాల్ని, జీవితాల్ని ఫణంగా పెట్టి రాజకీయాల్లోకి వచ్చారు. ఒకతరం కాలంలో ఇంతమంది అసాధారణ నేతలు రాజకీయాల్లోకి రావటం బహుశా మరేదేశ చరిత్రలోనూ కన్పించదు. కానీ ఆర్థికవ్యవస్థ వేగంగా ఎదుగుతూ ఏరోజుకారోజు పనిచేయటం ఆదాయానికి కీలకంగా మారిన ఆధునిక పోటీ కాలంలో ఇలాంటి త్యాగాల్ని అందరి నుంచీ ఆశించటం ఆచరణసాధ్యం కాదు. దానికితోడు డబ్బే రాజకీయంగా మారిపోవటం, ఎన్నికల వ్యవస్థ కూడా దాన్ని ప్రోత్సహించే రీతిలో ఉండటం వల్ల ఇప్పటికే రాజకీయాలలో ఉన్న ఉత్తములు క్రమంగా వైదొలుగుతున్నారు, కొత్తగా రాజకీయాలలోకి రావాలని భావించే సమర్థులు, నిజాయతీపరుల సంఖ్య తక్కువగా ఉంటోంది. దేశజనాభాలో మూడొంతులు యువజనాభా ఉండటం కొండంత ఆశను రేకెత్తిస్తున్నా, రాజకీయాల్లో ఎదుగుతున్నవారు నేతల వారసులే తప్ప సామాన్య యువత కారు. రాజకీయాలలో కనీస లక్షణంగా ఉండాల్సిన నిజాయతీ, ఈవేళ అత్యున్నత అర్హతగా మారిపోయింది. దేశ ప్రయోజనాలతో పనిలేకుండా ఎంతకైనా తెగించి మాట్లాడే, దోచుకునే రాజకీయ ఎంటర్‌ప్రెన్యూర్‌లే ఇప్పుడు రాజకీయ నేతలుగా వస్తున్నారు. ప్రజల పేదరికాన్ని తొలగించే విధానాలు అమలుచేయకుండా, ప్రజలను నిరంతరం అర్థించే నిస్సహాయులుగా తయారుచేసి ఎప్పటికెయ్యది... అనే రీతిలో కేవలం ఓట్లు దండుకునే విధానాలనే అమలు చేసే రాజకీయ ఎంటర్‌ప్రెన్యూర్‌లు, వారి రాజకీయ బ్యూరోక్రాట్ల వ్యవస్థ మన ప్రజాస్వామ్యాన్ని ఆధునిక రాచరికంలాగా మార్చేసింది.

ఈ ప్రమాదకర పరిస్థితి నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుని రాజ్యాంగ నిర్మాతలు ఆశించినట్టు పరిణతి చెందేలా చేసుకోవటానికి, తక్షణ డిమాండ్లకు – దీర్ఘకాలిక లక్ష్యాలకు సమన్వయాన్ని సాధిస్తూ ప్రజల్ని ప్రభువులుగా నిలపటానికి ఏకకాలంలో బహుముఖ పోరాటం కావాలి. రాజకీయ, ఆర్థిక, న్యాయ సంస్కరణలు, పాలనా వికేంద్రీకరణ, అవినీతి అంతానికి అన్నిస్థాయిల్లో బలమైన చట్టాలు, ఎన్నికల వ్యవస్థలో మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి వాటితోపాటు సామాన్యుల జీవితాల్లో రోజువారీ సేవల్ని, అంటే ధ్రువపత్రాలు, మంచినీటి కనెక్షన్, పట్టాదారు పాసుపుస్తకం, ల్యాండ్ రికార్డులు, భూమి రిజిస్ట్రేషన్, విద్యుత్ కనెక్షన్ వంటి సేవలన్నిటినీ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, వేధింపులు, ఆలస్యం లేకుండా అందించేందుకు ఖచ్చితమైన ఏర్పాట్లు కావాలి. అలా ప్రజలకు పనుల్ని ఒక సేవలాగా చెప్పిన సమయంలో అందించలేకపోతే, రోజుకి రూ.250 పరిహారాన్ని చెల్లించాలి. దేశవ్యాప్తంగా ఇలాంటి 'పౌరసేవల హక్కు' చట్టం (సిటిజన్/పబ్లిక్ సర్వీసెస్ గ్యారంటీ యాక్టు) కోసం లోక్‌సత్తా ఉద్యమం సుదీర్ఘకాలంగా కృషి చేస్తోంది. 'స్వరాజ్యం' పేరుతో లోక్‌సత్తా ఉద్యమసంస్థ రూపొందించిన పౌరసేవల పత్రాల పుస్తకాన్ని 1998, అక్టోబర్ 2న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రంగరాజన్ ఆవిష్కరించారు. రెండు లక్షలకు పైగా స్వరాజ్యం కాపీల్ని ప్రజల్లోకి లోక్‌సత్తా తీసుకెళ్లింది. కుత్బుల్లాపూర్, గుంటూరు, తణుకు వంటి పురపాలక సంఘాల్లో కొన్ని సేవలకి అలాంటి సిటిజన్స్ ఛార్టర్లు 2001 నుండి కొంతకాలం అమలయ్యాయి. కాని చట్టబద్ధత లేకపోవటంతో కాలక్రమేణా మరుగునపడ్డాయి. ఆ తరువాత లోక్‌సత్తా కృషితో రెండు సర్వీసు గ్యారంటీ బిల్లులు 15వ లోక్‌సభాకాలంలో పార్లమెంటు ముందుకు వచ్చాయి. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని బృందం పార్లమెంటరీ కమిటీతో సంప్రదించి ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీని కూడా కలిపి ఒక సమగ్ర జాతీయస్థాయి పౌరసేవల హక్కు బిల్లును తయారు చేసింది. అయితే లోక్‌సభ రద్దవటంతో ఆ బిల్లులకు కూడా కాలం చెల్లింది.

అందుకే గత బిల్లులను మెరుగుపరిచి ప్రజాఉద్యమంతో ఒత్తిడి తెస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో కృషి చేస్తూ దేశవ్యాప్తంగా పౌరసేవల హక్కు చట్టం తెచ్చేందుకు మళ్లీ తాజాగా 2014లో అంతర్జాతీయ అవినీతి దినోత్సవమైన డిసెంబర్ 9 నుంచి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రయత్నం ప్రారంభించింది. ఇందులో భాగంగా హైదరాబాద్, విశాఖపట్నంలో రౌండ్‌టేబుల్ సమావేశాలను ఏర్పాటుచేసి వివిధ రంగాలకు చెందిన పౌరప్రముఖులు, నిష్ణాతుల నుంచి సూచనలు తీసుకుంటూ బిల్లుని మరింత మెరుగుపరిచే ప్రయత్నం చేపట్టింది. సమాచార హక్కు చట్టంలాగా జాతీయస్థాయిలో ఒకే చట్టాన్ని పార్లమెంటు ద్వారా తీసుకురావటం, వీలుకాకపోతే కేంద్రంలో, రాష్ట్రాల్లో వేర్వేరుగా పౌరసేవల హక్కు చట్టాన్ని తీసుకురావటం కోసం లోక్‌సత్తా కృషి చేస్తోంది.

ప్రజలకు సరైన సేవలు అందించటానికి చెప్పుకోదగిన దేశాలన్నీ కూడా పౌరసేవల గ్యారంటీ చట్టం లేదా ఆ తరహా ఏర్పాట్లను చేసుకున్నాయి. ఈ సేవ, మీ సేవ వంటి ఎలక్ట్రానిక్ సేవలు అందుబాటులోకి వచ్చిన్నప్పటికీ, మనదేశంలో ప్రభుత్వ సేవలు చెప్పుకోదగిన ఏ దేశంలో కంటే కూడా నాసిరకంగానే ఉన్నాయి. జాతీయస్థాయిలో 137, రాష్ట్రాలలో 700కి పైగా సిటిజన్ ఛార్టర్లున్నా వాటికి సమగ్ర చట్టబద్ధ ఏర్పాట్లు లేకపోవటం వల్ల హక్కుగా ప్రజలకు పనులు జరగటం లేదు. ఈ నేపథ్యంలో కోట్లాది ప్రజల రోజువారీ జీవితంతో ముడిపడిన పౌరసేవల హక్కు చట్టాన్ని మనదేశంలో తీసుకురావటం ఇప్పటికైనా అత్యవసరం. దేశాన్ని మార్చేసే



LS Times August 16-31 2016 Issue.pmd 16 8/11/2016, 2:47 PM

భారమంతా ఈ ఒక్క చట్టం మీదే మోపనక్కర్లేదుగానీ, అన్నిరంగాలనూ స్పృశించే పౌరసేవల హక్కు చట్టం మన ప్రభుత్వానికి, పాలనకు గుండెకాయగా మారుతుందనటంలో, స్వతంత్ర భారతంలో అత్యంత ప్రభావశీలమైన చట్టమవుతుందనటంలో మాత్రం సందేహం లేదు.

విద్యుత్ స్తంభం మీద ఫ్యూజ్ పోవటం, మురుగునీరు పేరుకుపోవటం వంటి స్థానిక పాలనా సమస్యల మీద నియోజకవర్గ ప్రజల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌తో సతమతమవుతూ, రాజకీయ బ్యూరోక్రాట్లను పోషించలేక ఉక్కిరిబిక్కిరవుతూన్న రాజకీయ నేతలకు కూడా ఊరటనిచ్చే చట్టమిది. లోక్‌సత్తా రూపొందించిన పౌరసేవల హక్కు బిల్లు స్వచ్ఛభారత్ లక్ష్యాలకు, స్థానిక ప్రభుత్వాల సాధికారతకు దోహదం చేసేలా ఉండటంతోపాటు విద్య, ఆరోగ్యం వంటి సేవలకు, నాణ్యతాప్రమాణాల పెంపునకు విస్తరించేందుకు వీలుగా జనరిక్‌గా రూపొందించినది. ఒకసారి ఇలాంటి చట్టం జాతీయస్థాయిలోను, రాష్ట్రాలలోను అమలయితే, సామాన్య ప్రజలకి దైనందిన కార్యక్రమాలలోను, ప్రభుత్వ ఆఫీసులతో లావాదేవీలలోను అసౌకర్యం లేకుండా సులభంగా సేవలందుతాయి. ప్రతిరోజూ లక్షలాది మంది లంచాలు, ఆలస్యం లేకుండా సేవలు పొందగలుగుతారు.

సుపరిపాలనకు కీలకమైన పౌరసేవల హక్కు చట్టాన్ని సాధించుకోవటానికి తెలుగు నాట అన్ని కాలేజీలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ, రెసిడెంట్స్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్లు, వినియోగదారుల సంఘాలు, మహిళా, రైతు, వృత్తి, ఇతర ప్రజాసంఘాలు ఎవరికి వారు, ఎక్కడికక్కడ చొరవ తీసుకుని సమావేశాలు, ప్రచార కార్యక్రమాలతో ముందుకురావటం, చట్టసభల ప్రతినిధులు, పాలకులు వాస్తవ దృష్టితో ఆలోచించి చట్టం చేసేందుకు వేగంగా స్పందించటం చారిత్రక అవసరం. ✸

# దేశమంతా ఒకే మార్కెట్

**జీఎస్టీపై 16 ఏళ్ల తర్వాత ముందడుగు.. రాజ్యాంగ సవరణ ఆమోదం**




గతంలో రైతులు తాము పండించిన ధాన్యాన్ని పక్క జిల్లాలో కూడా అమ్ముకోవటానికి వీల్లేకుండా చేసి ధరల్ని ప్రభుత్వాలు అణగదొక్కుతుండేవి. పైకి మాత్రం మొసలి కన్నీరు కారుస్తుండేవి. కూరగాయలు ధరలు పెరిగితే రోడ్ల మీద, శాసనసభల్లో నానాయాగీ చేసే రాజకీయ నాయకులు రైతులకు రేట్లు లేక ఆదాయం తగ్గటం గురించి మాత్రం మాట్లాడేవారు కాదు. ఈ నేపథ్యంలోనే లోక్‌సత్తా ఆధ్వర్యంలో వ్యవసాయో త్పత్తులపై ఆంక్షలకు వ్యతిరేకంగా 2012లో రైతు సత్యాగ్రహ యాత్ర జరిగిన సంగతి తెలిసిందే. కర్నూలు నుంచి కర్ణాటకకు, నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు బియ్యాన్ని తీసుకెళ్లి అమ్మి మార్కెట్ ఆంక్షల్ని లోక్‌సత్తా ఛేదించింది. దీనివల్ల తెలుగు ప్రాంతాల రైతులకు అప్పట్లో ఒక్క సీజన్‌లో, ఒక్క బీపీటీ వెరైటీ ధాన్యానికి రూ.3600కోట్ల ఆదాయం సమకూరింది. దేశమంతా ఒకే మార్కెట్‌గా ఉంటే రైతులకు మాత్రమేకాకుండా ఇతర రంగాలకు, వినియోగదారులకు కూడా మేలు జరుగుతుందని, అభివృద్ధి పెరుగుతుందని తొలి నుంచీ లోక్‌సత్తా వాదిస్తోంది. అలాంటి ఏక మార్కెట్‌కు సరళీకృత పన్నుల విధానంతో దోహదం చేసే వస్తు-సేవల చట్టానికి (జీఎస్‌టీ) కీలకమైన 122వ రాజ్యాంగ సవరణను తాజా సమావేశాల్లో రాజ్యసభ ఆమోదించింది. బీజేపీ, కాంగ్రెస్ దేశ ప్రయోజనాలపై అభినందనీయ రీతిలో, ప్రజాస్వామ్యాన్ని పెంచేలా చర్చ చేసి ఆమోదించిన అతికొద్ది కీలక బిల్లుల్లో ఇది కూడా ఒకటని భావించవచ్చు. దీనివెనక 16 ఏళ్ల ప్రయత్నం ఉంది. రాష్ట్రాల ఆమోదం కూడా పొందే అవకాశం ఉన్నందున జీఎస్‌టీ చట్టం 2017 ఏప్రిల్ నుంచి 18-20శాతంతో లాంఛనంగా అమల్లోకి రావచ్చు. జీఎస్టీ విషయంలో చట్టాలను రూపొందించటానికి రాష్ట్రాలకఅసెంబ్లీలకు, పార్లమెంటుకు సమాంతర అధికారాలుంటాయి. అంతర్రాష్ట్ర సరకుల కదలికల మీద పన్ను విధించే హక్కు కేంద్రానికే ఉంటుంది. పన్నుల విధింపు, నిర్ణయం వంటి వ్యవహారాలను చూడటానికి కేంద్ర ఆర్థికమంత్రి, ఆదాయ సహాయమంత్రి, (75శాతం మెజారిటీ విధానంలో 67శాతం ఓటుండే)రాష్ట్రాల ఆర్థికమంత్రులతో కూడిన ఒక జీఎస్టీ మండలి ఉంటుంది. ఐదేళ్లపాటు జీఎస్టీ వల్ల వచ్చే నష్టాన్ని కేంద్రం భర్తీ చేస్తుంది. మద్యాన్ని పూర్తిగా జీఎస్టీ నుంచి మినహాయించారు. పెట్రోలియం క్రూడ్, డీజిల్, పెట్రోలు, సహజవాయువు, విమాన ఇంధనం కొన్నేళ్లపాటు ఈ పరిధిలోకి రావు. పొగాకు ఉత్పత్తుల మీద జీఎస్టీతోపాటు కేంద్ర ఎక్సయిజు పన్ను కూడా ఉంటుంది. స్వతంత్ర భారత చరిత్రలో అతి పెద్ద పరోక్ష పన్నుల సంస్కరణ జీఎస్టీ. అయితే ఇప్పటికే సెస్సులు, పరోక్ష పన్నుల భారం పేదల మీద ఎక్కువగా ఉందని భావిస్తున్నందున, పన్ను పెంపు హేతుబద్ధతకు సరైన ఏర్పాటు, స్థానిక ప్రభుత్వాలకూ వాటా వంటి అంశాలను కూడా చట్టం పట్టించుకోవాల్సుంది. ✸



LS Times August 16-31 2016 Issue.pmd 17 8/11/2016, 2:47 PM

## ప్రజల సార్వభౌమాధికారం వర్సెస్ బాధ్యతాయుత ప్రభుత్వం

# పౌరసేవల పత్రాలు - పరిధి

- డా॥ జయప్రకాష్ నారాయణ్

**త**మ ఉమ్మడి అవసరాలను తీర్చటానికి, శాంతిభద్రతల పరిరక్షణ నుంచి విద్య, ఆరోగ్య భద్రత వరకు ఉమ్మడి సేవలను అందించటానికి ప్రజాస్వామ్యంలో ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు. పౌరులే నిజమైన సార్వభౌములు. పౌరుని సంతృప్తే ప్రభుత్వ పనితీరుకు నిజమైన కొలమానం. తనకు నిజమైన ప్రభువులైన పౌరులకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వం, తమకు జీతభత్యాలను చెల్లిస్తున్న పన్నుచెల్లింపుదారుల అవసరాలకు తక్షణం స్పందించే ప్రజాసేవకులు – ప్రజాస్వామ్యంలో ఉండే స్వాభావికాంశాలు.

అయితే, భారతదేశంలోని పాలనాఉపకరణం పౌరుల స్థానంలో ప్రభుత్వోద్యోగులను అసలైన యజమానులుగా మార్చింది. కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో ప్రభుత్వోద్యోగులు ప్రత్యక్షంగా 1.3 కోట్ల మంది ఉండగా, పరోక్షంగా ప్రభుత్వ రంగ సంస్థలలో 70లక్షలమంది వరకూ ఉంటారు. జనాభా నిష్పత్తి ప్రకారం, ప్రపంచ ప్రమాణాల ప్రకారం చూస్తే ఈ సంఖ్య అసాధారణమేమీ కాదు. కానీ మొత్తం సంఘటితరంగంలో నెలవారీ జీతం తీసుకుంటున్న శ్రామికులలో ప్రభుత్వోద్యోగులు 70శాతం మేర ఉంటారు. అపార నిరక్షరాస్యత, అజ్ఞానం ఉన్న భారత్ వంటి దేశంలో చదువుకోవటం, ఉద్యోగ భద్రత కలిగివుండటం ఒక వరమే. ఆ ఉద్యోగం గనక వలసపాలనావశేషంగా ఉన్న అధికారదర్పాన్ని అందించే ప్రభుత్వోద్యోగమైతే ఇక ఆ ఉద్యోగిని మిగతావారికంటే ఎంతో ప్రత్యేకమైన వ్యక్తిగా, ఇంద్రుడిలాచంద్రుడిలా చూస్తారు. దశాబ్దాలపర్యంతం కొనసాగిన సోషలిస్టు మైండ్‌సెట్ వల్ల, ప్రభుత్వోద్యోగి అంటే ప్రభుత్వం దయదల్చి ఇచ్చే దానాన్ని బట్వాడా/ పంపిణీ చేసేవానిగా, పౌరుడంటే లైసెన్సు, పర్మిట్, కోటా కోసం చేయిజాచి అర్థించే బిచ్చగాని లెక్కన పరిస్థితి తయారైంది. అవినీతి క్రమంగా జడలుపరుచుకుంది. ప్రతిస్థాయిలో ప్రభుత్వోద్యోగికి కల్పించిన జీవితకాల అసాధారణ భద్రత, ఉద్యోగిని అంత సులభంగా దోషిగా నిరూపించి శిక్షించే అవకాశాలు పెద్దగా లేకపోవటం వల్ల ఏ ప్రభుత్వం వచ్చినా ఉద్యోగులను జవాబుదారీగా మార్చలేకపోయింది. ఆ రకంగా, పౌరుల, ప్రజాసేవకుల పాత్రలు తారుమారయ్యాయి. పర్యవసానంగా, ఒక తాలూకా ఆఫీసులో ఉండే బంట్రోతు లాంటి అట్టడుగు స్థాయి ప్రభుత్వోద్యోగి కూడా 80శాతం భారతీయుల కంటే ఎక్కువ పలుకుబడిని, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఆధిపత్య శక్తిని అనుభవిస్తున్నాడు.



ఫలితంగా, ప్రభుత్వం నుంచి తనకు హక్కుగా రావాల్సిన ఏదైనా సేవ కోసం వెళ్లే పౌరులకు తిరస్కారాలు, ఛీత్కారాలు, వేధింపులు, ఆలస్యాలు, అసమర్థత, అవినీతి, ఉదాసీనత, ప్రతికూల ధోరణులు ఎదురవుతున్నాయి. ఈ మొత్తం పరిస్థితుల వల్ల, పోలీసు కానిస్టేబుళ్లంటే భయపడే, లంచం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యాలయంలో కనీసం మొర వినిపించుకునే అవకాశం లేని పౌరులు, ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలకు కాస్త మంచి చదువు కూడా పొందలేని తల్లిదండ్రులు, రేషన్ దుకాణంలో సరకులు పొందలేని వినియోగదారులు, స్వేచ్ఛగా ఓటువేయలేని పౌరులు, ఆరోగ్య కేంద్రాలలో రోగనిరోధక టీకాలు వేయించుకోలేని పిల్లలు, న్యాయబద్ధమైన మార్కెట్లలో తమ పంట ఉత్పత్తుల్ని అమ్ముకోలేని రైతులు, సకాలంలో గమ్యాన్ని చేరుకోలేని ప్రయాణీకులు, సదుపాయాలు లేకుండానే డబ్బు గుంజే సర్కారీ సేవలు (పబ్లిక్ యుటిలిటీస్), ఏళ్ల తరబడి న్యాయం దక్కని కక్షిదారులు మనకు ఎటుచూసినా కనిపిస్తారు.

నిలువెల్లా అహంకారం నిండిన ప్రభుత్వాలు, అసమర్థ ప్రభుత్వోద్యోగుల వల్ల పౌరుని స్వేచ్ఛ ప్రమాదంలో పడింది. తనకు సేవచేసేందుకు జీతం ఇచ్చి మరీ పెట్టుకున్న వారి తప్పుడు పనులు, అసమర్థతల పట్ల పౌరులు మౌనప్రేక్షకులుగా



LS Times August 16-31 2016 Issue.pmd 18 8/11/2016, 2:47 PM

ఉంటే స్వయంపాలన అపహాస్యం అవుతుంది. నిర్ణీత కాలవ్యవధితో వచ్చే ఎన్నికలలో ప్రభుత్వాన్ని శిక్షించే అవకాశం పౌరురాలు/పౌరుడికి ఉందన్నది నిజమే. కానీ భారతదేశంలో ఎన్నికైన ప్రభుత్వాలు క్రమం తప్పకుండా తర్వాతి ఎన్నికలలో దిగుపోతుండటం ఆనవాయితీగా వస్తోంది. చట్టసభ సభ్యులలో దాదాపు 50శాతం లేదా ఇంకా ఎక్కువే ఏ ఎన్నికలలోనూ తిరిగి ఎన్నికవ లేదు. అయినా, తరచూ ఆటగాళ్లు మారుతున్నా ఆటనియమాలు మాత్రం యథాతథంగానే కొనసాగుతున్నాయి. కాబట్టి, శాశ్వత ప్రాతిపదికన ప్రజాసేవల పంపిణీని మెరుగుపరిచే యంత్రాంగాలు మనకి ఉండాలి. ప్రజాసేవలను మెరుగుపరచటానికి పౌరులకు, భాగస్వాములకు సాధికారత కల్పించటం ఎంతో కీలకం.

బ్రహ్మపదార్థంలాంటి సంక్లిష్ట చట్టాలతో, గందరగోళపు నిబంధనలు, పద్ధతులతో ప్రభుత్వం పెత్తనం చేస్తుంటుంది. ఉదాహరణకి, మనదేశంలో 3000కిపైగా కేంద్ర ప్రభుత్వ చట్టాలు, 30,000 వరకు రాష్ట్రాల చట్టాలు ఉన్నాయి. చాలా సందర్భాలలో పౌరులను పనికిమాలిన రోతగా ప్రభుత్వం, ప్రభుత్వోద్యోగులు విదిలించేస్తుంటారు. ప్రభుత్వం నుంచి తమకు హక్కుగా రావాల్సిన సేవలను గురించి ఎవరైనా పౌరురాలు/పౌరుడు నిలదీస్తున్నట్టనిపిస్తే చాలు, చట్టాలు, నిబంధనలు, పద్ధతులు అంటూ వాళ్లని ముప్పతిప్పలు పెట్టటం మొదలెడతారు. ఇక దరఖాస్తులు, ఇతర పత్రాలను వాటి గురించి సరైన అవగాహన లేని అసమర్థ కిందిస్థాయి ఉద్యోగులు ఇష్టమొచ్చినట్టు తయారుచేస్తారు. వాటిని రూపొందించేటప్పుడు సీనియర్ అధికారులు, సంబంధిత రాజకీయ విధాననిర్ణేతలు పర్యవేక్షించటంగానీ, సూచనలివ్వటంగానీ ఉండదు. పౌరులు తమకు అందాల్సిన వివిధ సేవల గురించి ప్రాథమిక సమాచారాన్ని తెలుసుకుని, చెమటలు కక్కి ఎంతో సమయాన్ని వెచ్చించి గందరగోళపు పద్ధతుల దొంతరలను దాటగలిగితే అప్పుడు ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టగలుగుతారు.

అదృష్టవశాత్తూ, ఇలాంటి ఎడతెగని వేధింపులకు సిటిజన్స్ ఛార్టర్ (పౌరసేవల పత్రం) వంటి సులభమైన, ఆచరణసాధ్యమైన, ప్రభావవంతమైన పరిష్కారాలున్నాయి. జవాబుదారీతనాన్ని పెంచి అవినీతిని తగ్గించటానికి సిటిజన్స్ ఛార్టర్ చాలా ప్రభావశీలమైనది. బ్రిటన్‌లో మాజీ ప్రధాని జాన్ మేజర్ 1991లో సిటిజన్స్ ఛార్టర్స్‌ను ప్రవేశపెట్టారు. ఆ తర్వాత, బెల్జియం, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు అదే బాటలో నడిచాయి. సిటిజన్స్ ఛార్టర్ నాలుగు కీలక ఏర్పాట్లతో అమల్లోకి వస్తుంది:

**1) స్పష్టంగా నిర్వచించిన జవాబుదారీతనం:**

- సేవలు అందించటానికి బాధ్యత వహించేది ఎవరు
- దరఖాస్తు, రుసుముకు సంబంధించి పౌరురాలు/పౌరుడు చేయాల్సింది ఏమిటి

... ఈ సమాచారం చాలా సీదాసాదా భాషలో పూర్తి, ఖచ్చిత స్థాయిలో అందుబాటులో ఉంటుంది.

**2) నిర్దిష్టంగా నిర్వచించిన, గణించదగ్గ పనితీరు ప్రమాణాలు:**

ఛార్టర్ కేవలం గొప్ప ఆశయాల ప్రకటన పత్రంగా మిగిలిపోకూడదు. అందులో ఈ అంశాలన్నీ ఉండాలి :

- సేవల్ని అందించటానికి స్పష్టమైన కాలపరిమితి
- అందించిన సేవలను గణించటానికి తగిన ఏర్పాట్లు

ఉదా: ఇచ్చిన ఇంధనం ఎంతమొత్తమో కొలిచి చూసుకునేందుకు పెట్రోల్ స్టేషన్ వద్ద ఒక కొలమాన పాత్ర (క్యాలిబరేటెడ్ క్యాన్)

- స్పష్టంగా నిర్వచించిన నాణ్యతా కొలబద్దలు

**3) పనిచేయకపోతే పరిహారం :**

నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పౌరసేవ అందించకపోతే డబ్బు రూపంలో పరిహారం చెల్లించే ఏర్పాటు ఈ ఛార్టర్‌ని ప్రభావశీలం చేయటంలో కీలకమైనది. పౌరుడు/పౌరురాలికి ప్రతి రోజూ లేదా ప్రతి గంటా పరిహారం చెల్లించేలా ఉండటం మంచిది. ఉదాహరణకి, జనన ధ్రువపత్రం తెచ్చుకోవటంలో లేదా విద్యుత్ వినియోగదారుని నుంచి వచ్చిన ఫ్యూజ్ కాల్‌కు హాజరవటంలో ఆలస్యమైతే డబ్బు చెల్లించాలి. ఆ డబ్బుని వెంటనే ప్రభుత్వం (ఏజన్సీ/యుటిలిటీ) నుంచి చెల్లించి, తర్వాత వైఫల్యానికి కారణమైన ఉద్యోగి నుంచి వసూలు చేయాలి.

సేవల జారీని స్థానిక అథారిటీ/ఏజన్సీకి అప్పచెబితే – సరఫరా కొరత లేనప్పుడు, సేవల జారీలో వేగాన్ని, సంఖ్యను పెంచేందుకు తగినంత వెసులుబాటు అవకాశాలు ఉన్నప్పుడు, సేవకు వినియోగ రుసుము పెట్టినప్పుడు పౌరసేవలకు పరిహారం ఇవ్వటం పనితీరును ఇంకా మెరుగుపరుస్తుంది.

**4) ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికి ఏర్పాట్లు :**

ఆచరణసాధ్యమైన, స్థానికంగా ఉండే, వేగంగా చర్యలు తీసుకునే ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలను ఏర్పాటు లేకపోతే ఛార్టర్ వల్ల పెద్దగా ఫలితం ఉండదు. ఇలాంటి వ్యవస్థ – సేవలు సకాలంలో సరిగా అందటంతోపాటు ఆలస్యం, వైఫల్యం జరిగిన సందర్భాలలో ఖచ్చితంగా పరిహారం చెల్లించేలా చేస్తుంది.



LS Times August 16-31 2016 Issue.pmd 19 8/11/2016, 2:47 PM

సాధారణంగా అందుబాటులో ఉండే 40కిపైగా సేవల వివరాలతో 1998లో లోక్‌సత్తా (జనంబలం) పీపుల్స్ ఛార్టర్ పేరుతో జాబితాను విడుదల చేసింది. ఆ చార్టర్‌ని అమలుచేయాలని దక్షిణ భారతదేశంలో సుమారు 7.5 కోట్ల జనాభా కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. లోక్‌సత్తా వాదనకు తలగ్గి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అటువంటి ఛార్టర్‌ని నాలుగు ప్రాథమిక సేవలకు వర్తింపచేస్తూ మునిసిపాలిటీలలో ప్రారంభించింది: జనన, మరణ ధ్రువపత్రాల జారీ (5 రోజులు), ఇంటి కుళాయి కనెక్షన్ (30 రోజులు, 10 రోజుల ఓవైటీ కింద), గృహనిర్మాణ ప్లాన్ ఆమోదం (15 రోజులు), ఆస్తిపన్ను మదింపు (15 రోజులు). పరిహారానికి ఏర్పాటు లేదు, నామమాత్రంగానే ఉన్నాయి. ఇప్పుడు మనం తక్షణం చేయాల్సింది - సరఫరా కొరత లేనిచోట అన్ని సేవలకూ డబ్బురూపంలో జరిమానా చెల్లించే నిఖార్సయిన ఛార్టర్లను అమలు చేయటం, వాటికి విస్తృత ప్రచారం కల్పించటం, ప్రభావవంతంగా అమలుచేయటం.

కేవలం సిటిజన్స్ ఛార్టర్లను రూపొందించటమే పాలనాయంత్రాంగం దృక్పథంలో, వ్యవహారశైలిలో మార్పు తేలేదు. ప్రజల నిజమైన సాధికారతకు సిటిజన్స్ ఛార్టర్లు నిజమైన సాధనాలుగా ఉపయోగపడాలంటే, ఇంకొన్ని ఇతర చర్యలను దాంతోపాటు చేపట్టాల్సుంది. జనమాధ్యమాలు చాలా శక్తిమంతమైన వ్యవస్థ. సిటిజన్స్ ఛార్టర్లపై ప్రజలలో చైతన్యం పెంచేందుకు దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. నిర్దిష్ట సేవల గురించి తెలియచేస్తూ, ప్రాథమిక సమాచారంతో, సిటిజన్స్ ఛార్టర్లను వినియోగించుకోవటం ద్వారా మెరుగైన ప్రజాసేవల కోసం ప్రజలంతా సంఘటితంగా కదలాలని కోరుతూ మీడియా నిర్ణీత కాలవ్యవధి కార్యక్రమాల్ని రూపొందించవచ్చు.

**కొన్ని విభాగాలలో సిటిజన్స్ ఛార్టర్లు - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

| విభాగం పేరు | సేవ/పని పేరు | స్పందించాల్సిన సమయం | చెల్లించాల్సిన రుసుము |
|---|---|---|---|
| ట్రెజరీలు మరియు అకౌంట్లు విభాగం | చలానాలు రాయటం (ఎన్‌ఫేస్‌మెంట్) | తక్షణం | |
| | క్రెడిట్ ధ్రువపత్రాల జారీ | 2 రోజులు | |
| ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా అథారిటీ | డ్రైవింగ్ లైసెన్సు | | |
| | ■ శిక్షణ దశకు | అదేరోజు | 60-00 |
| | ■ జాతీయ | అదేరోజు | 390-00 |
| | ■ అంతర్జాతీయ | 2 గంటలు | 350-00 |
| ఆంధ్రప్రదేశ్ పోలీసు | ఎఫ్.ఐ.ఆర్ రిజిస్ట్రేషన్ | తక్షణం | ఉచితం |
| | ఎఫ్.ఐ.ఆర్ ప్రతి జారీ | 3 గంటలు | ఉచితం |
| | నేరఘటనా స్థలానికి చేరుకోవటం (ప్రయణసమయం కాకుండా) | | |
| | + పట్టణ ప్రాంతం | 10 నిమిషాలు | ఉచితం |
| | + సెమీ పట్టణ | 20 నిమిషాలు | ఉచితం |
| | + గ్రామీణ | 30 నిమిషాలు | ఉచితం |
| | మెడికల్ ఆఫీసర్ నుంచి రెసీప్ట్ అనంతరం పోస్టుమార్టం నివేదిక | 4 రోజులు | 10-00 |

భారతదేశంలోనే మొదటిసారిగా సేవల జారీలో ఆలస్యానికి రోజుకు రూ.50 పరిహారం చెల్లించే ఏర్పాటును ఈ ఛార్టర్ కల్పించి పౌరునికీ, ప్రభుత్వానికీ మధ్య సంబంధ స్వభావాన్ని విప్లవాత్మకంగా మార్చేసింది. ఈ ఛార్టర్ బాగా పనిచేస్తూ, వందలాది పౌరులు పరిహారాన్ని కూడా అందుకున్నారు. క్రమంగా 700కిపైగా ఛార్టర్లు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ఇతర విభాగాలలో, భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో అమలయ్యాయి. వాటిలో చాలా పౌరసేవా పత్రాలలో

పౌరులు సంఘటితంగా నిరంతర అప్రమత్తతతో ముందుకు రాకపోతే ప్రజాసేవలు మెరుగుపడవు. ఈవేళ ఒక పౌరునికి ఎదురైన సమస్య రేపు ఇంకొకరికి వస్తుంది. కాబట్టి,



LS Times August 16-31 2016 Issue.pmd 20 8/11/2016, 2:47 PM

తమ ప్రయోజనాలని సమష్టిగా పరిరక్షించుకునేందుకు, ప్రభుత్వం నుంచి మెరుగైన సేవలను పొందేందుకు నైబర్‌హుడ్ వాచ్ (ఇరుగుపొరుగు రక్షణ) బృందాలుగా ఏర్పడాలి, అందుకు సిటిజన్స్ ఛార్టర్స్‌ని తొలి మెట్టుగా ఉపయోగించుకోవాలి. ఈ ప్రయత్నంలో పౌరసమాజ సంస్థలు సులభతరం చేసే పాత్రను పోషించగలుగుతాయి. అంతిమంగా, పౌరుల సమష్టి ప్రయత్నాలు కొన్నయినా విజయవంతంగా కళ్లెదుట కొట్టచ్చినట్టు కనిపిస్తుంటే సిటిజన్స్ ఛార్టర్లు ప్రభావవంతంగా అమలవుతాయని చెప్పవచ్చు.

ఉదాహరణకి, లోక్‌సత్తా ఉద్యమం ఛార్టర్లని సృజనాత్మక పద్ధతుల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ప్రాచుర్యంలోకి తెచ్చింది. పనిచేయని స్థానిక ప్రభుత్వం నుంచి పౌరులు పరిహారాన్ని వసూలుచేసుకున్నచోటల్లా మ్యాచింగ్ అవార్డులను ప్రకటించటం జరిగింది. ఇది పోటీ మనస్తత్వాన్ని పెంచి తద్వారా మీడియా దృష్టిని ఆకర్షించి సందేశం వేగంగా వ్యాపించటానికి దోహదం చేసింది. అదేవిధంగా, 1998లో పెట్రోల్ కొలతలో అవకతవకలను గుర్తించేందుకు లోక్‌సత్తా వలంటీర్లు పెట్రోల్ స్టేషన్ల యధేచ్ఛ (ర్యాండమ్) తనిఖీలు మొదలుపెట్టారు. ఖచ్చితమైన కొలత, ముందస్తు ధృవీకరణ ఉన్న చేతిగిన్నెల (క్యాన్ల)ను పెట్రోల్ స్టేషన్లకు తీసుకెళ్లి వాటిలో పెట్రోల్ నింపాలని డీలర్లను అడిగారు. ఎంత పెట్రోల్ పోశారో వెంటనే గుర్తించే అవకాశం ఉంటే, కొలతకంటే తక్కువ పోశారనటానికి సాక్ష్యం దొరుకుతుంది. ఆ ర్యాండమ్ తనిఖీ వల్ల కలిగిన ప్రయోజనం మాత్రం అపారం. ఆంధ్రప్రదేశ్ మొత్తంలోని 1500 పెట్రోల్ స్టేషన్లలోని మీటర్లను కేవలం 15 రోజులలో సరిచేశారు. అప్పటిదాకా మీటర్లను అక్రమంగా మార్చటంలో పెట్రోల్ స్టేషన్లతో కుమ్మక్కయిన ప్రభుత్వ సంస్థే (లీగల్ మెట్రియాలజీ విభాగం) ప్రజల ఒత్తిడి, కొలతల తనిఖీకి పకడ్బందీ ఏర్పాట్లతో ముందుకొచ్చిన పౌరుల భాగస్వామ్యం వల్ల చట్టాన్ని నిక్కచ్చిగా అమలుచేయాల్సి వచ్చింది. ఈ రకంగా ఆదా అయిన డబ్బు రోజుకు రూ.1 కోటి పైగానే ఉంటుంది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఇప్పటిదాకా ఈరకంగా ప్రజలకు ఆదా అయిన డబ్బు సుమారు రూ.2000 కోట్లు వరకూ ఉంటుంది.

అనేక రకాల పౌర సేవలకు, వసతులకు వర్తింపచేస్తూ సిటిజన్స్ ఛార్టర్లను విస్తరించాల్సిన అవసరముంది. ఇది తమకు సంబంధించిన చాలా పెద్ద అంశంగా పౌరులు గుర్తించేలా చేయాలి. ఇందులో పౌరసమాజ బృందాలు కీలక పాత్ర పోషించాల్సుంది. సిటిజన్స్ ఛార్టర్లు తమకు సేవలందించటానికి ఉపయోగపడే బ్రహ్మాస్త్రాలని పౌరులు గనక ఒక్కసారి గుర్తిస్తే ఇక ప్రతిచోటా, అవసరమైన ప్రతి అంశంలో డిమాండ్ చేయటం మొదలుపెడతారు, నాణ్యమైన సేవల్ని హక్కుగా పొందగలుగుతారు. అప్పుడు మాత్రమే ప్రభుత్వం ప్రభావశీలంగా, అవినీతిరహితంగా మారుతుంది.

ఏమైనా, అన్ని ప్రజాసేవలకూ సిటిజన్ ఛార్టర్లు సర్వరోగ నివారిణి కావు. అవినీతి, దుష్పరిపాలన, అధ్వాన్నపు సేవలు, పౌరులను వేధించటం – లోతుగా పాతుకుపోయిన పాలనా జాడ్యానికి తరచూ పైకి కనిపించే లక్షణాలు. గుత్తాధిపత్యాలు అవినీతికి, నిర్లక్ష్యానికి బీజం వేస్తాయి. అటువంటి సందర్భాలలో ఆలస్యాలు కేవలం తప్పించుకునే మోసపూరిత ఎత్తుగడలు మాత్రమే. సరఫరాలలో కొరత వల్ల రేషనింగ్, విచక్షణను ప్రదర్శించటం తప్పదు. కాబట్టి, సాధ్యమైనచోటల్లా పోటీ, ఎంపికకు అవకాశాలు కల్పించటం కీలకం. మితిమీరిన విచక్షణ కూడా తరచుగా అవినీతికి మూలమవుతుంది. అదేవిధంగా, రహస్య వ్యవహారశైలి, సందేహాస్పద పద్ధతులు, పౌరులకు సమాచారమివ్వకపోవటం కూడా దుష్పరిపాలన పరిణామాలే. కాబట్టి పారదర్శకతను కల్పించే చట్టాలు, వాటిని ప్రభావవంతంగా అమలుచేయటం అవసరం. విపరీతమైన కేంద్రీకృత పాలన వల్ల జవాబుదారీతనం పల్చబడుతుంది. ఒకరి మీద ఒకరు నెపం నెట్టుకుంటూ తప్పుచేసినా నిర్దోషులుగా బుకాయించే రుజువుల (ఎలిబీల) విధానం తయారవుతుంది. స్పష్టమైనరీతిలో అధికారం, జవాబుదారీతనం కలగలిసిన బలమైన వికేంద్రీకరణ, స్థానికంగానే సేవల్ని అందించే ఏర్పాటు వల్ల పౌరులలో సంతృప్తి భావన ఏర్పడి, సకాలంలో, సరైన రీతిలో స్పందించే వాతావరణం నెలకొంటుంది. స్వతంత్ర ప్రతిపత్తిగల, పటిష్టమైన అంబుడ్స్‌మన్, చట్టబద్ధ పాలన సంస్కృతి, తప్పులకి, ఉద్దేశపూర్వక నిష్క్రియకు వేగంగా శిక్షలు విధించటం, ప్రోత్సాహకాలను మార్చి మంచిపనితీరు కనబర్చినవారికి ప్రోత్సాహకాలిచ్చే ప్రయాసకు పురస్కారం విధానం – ప్రజాసేవకులలో జవాబుదారీతనాన్ని పెంచటానికి సరైన మార్గాలని పలు సందర్భాలలో రుజువైంది.

అన్నిటినీ మించి, సేవల నాణ్యతను ఎన్నికల, రాజకీయ విధానం నుంచి వేరు చేయటం సాధ్యం కాదు. చట్టవిరుద్ధంగా వచ్చే నిధుల కోసం ఎడతెగకుండా చేసే ప్రయత్నాల మీదే మొత్తం రాజకీయ వ్యవస్థ నడుస్తుంటే, దిగువస్థాయిలో సేవలు మెరుగుపరిచేందుకు ఎన్ని చర్యలు చేపట్టినా పెద్దగా ఫలితాలు కనిపించవు. ఒకవేళ ఫలితాలు కనిపించినా, అవి తాత్కాలికం, ఆ అంశానికే పరిమితం. చట్టవిరుద్ధ నిధులకున్న డిమాండ్‌ని దీర్ఘకాలిక రాజకీయ సంస్కరణతో నిరోధించకుండా అలాంటి నిధులచ్చే కొన్ని మార్గాల్ని నియంత్రించటం వల్ల పరిస్థితిలో చెప్పుకోదగిన మార్పు రాదు. నిజానికి, అవినీతి మరింత



LS Times August 16-31 2016 Issue.pmd 21 8/11/2016, 2:47 PM

ప్రమాదకరమైన స్థాయికి, రాజ్యవ్యవస్థలోని పైస్థాయిలోకి కేంద్రీకృతమవుతుంది. భూముల పట్టాలు, న్యాయ నిర్వహణ, నేరాల నియంత్రణ, నేరాల దర్యాప్తు, ప్రాసిక్యూషన్, పన్నుల ప్రక్రియ, ప్రభుత్వ రెవిన్యూ విభాగాలు, వస్తువుల, సేవల పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ – వీటిని ప్రైవేటీకరించటం సాధ్యం కాదు. ప్రభుత్వ పాత్ర ఉండే ఈ విభాగాలలో అవినీతి, అపసవ్యాలు – సేవల జారీలో తప్పించుకునే మోసపూరిత వ్యవహారశైలి కంటే కూడా పెను ప్రమాదకర పరిణామాలకు దారితీస్తాయి. కాబట్టి, ఫలితాల్ని పటిష్టంగా, సుస్థిరంగా కొనసాగేలా చేయాలంటే రాజకీయ, పాలనా వ్యవస్థ సమూల ప్రక్షాళనకు ఉద్యమస్థాయి పోరాటం అవసరం.

వ్యవస్థలలో మార్పు తెచ్చుకోవటానికి, రిపబ్లిక్ పునరుజ్జీవనానికి ఓ అభివృద్ధి చెందుతున్న దేశం ఏం చేయగలదనటానికి గత దశాబ్దకాలానికి పైగా మెక్సికోలో భారీయెత్తున అమలుచేస్తున్న రాజకీయ సంస్కరణలే మంచి ఉదాహరణ. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థలున్న చాలా దేశాలు అటువంటి పోరాటాన్ని బహుముఖంగా చేయాల్సి ఉంది. అవగాహన కలిగిన పౌరులు, బలమైన ప్రజాభిప్రాయం, స్వేచ్ఛాయుత మీడియా, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయవ్యవస్థ, ప్రభావశీలమైన అవినీతి నిరోధక వ్యవస్థలు, అప్రమత్తంగా ఉండే బలమైన ప్రతిపక్షం – ఇవన్నీ మొండి, అచేతన వ్యవస్థలో సంస్కరణల్ని జొప్పించేందుకు, జనహితాన్ని పెంపొందించేందుకు కీలకమైనవి. ప్రజాధనానికి మంచి విలువ దక్కించుకునేలా పౌరులను తయారుచేయటానికి ఇంకా చాలా చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం కూడా ఒక సర్వీస్ ప్రొవైడరే, పౌరులంటే హక్కులు కలిగిన వినియోగదారులే. వినియోగదారునికీ, పౌరునికీ మధ్య ఉన్న రెండు ప్రధాన తేడాలేమిటంటే – తాను అందించే సేవలపై ప్రభుత్వం తరచుగా గుత్తాధిపత్యాన్ని ప్రదర్శిస్తుంది, కాబట్టి ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు కట్టడి చేస్తుండాలి. రెండోది, పౌరులు కేవలం వినియోగదారులు మాత్రమే కాదు, ప్రజాస్వామ్య ప్రభుత్వానికి యజమానులు, ప్రభుత్వం పనిచేయటానికి డబ్బు చెల్లించేవారు. కాబట్టి, ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా ఉండటానికి పౌరులు సంఘటితంగా తమ సార్వభౌమాధికారాన్ని ప్రదర్శించటం మించి గ్యారంటీ ఇంకోటి లేదు. పౌరుల్ని ప్రభువులుగా, ప్రభుత్వాన్ని వారికి సేవకునిగా చేయటానికి చేస్తున్న ఈ నిరంతర పోరాటంలో సిటిజన్ ఛార్టర్లు ఒక కీలక సాధనం. ఏమైనా, ప్రభుత్వం, ప్రభుత్వోద్యోగులు పౌరులకి నిజమైన జవాబుదారీతనంతో వ్యవహరించేలా చేయటానికి తగిన పరిస్థితుల్ని ఏర్పరచటానికి ఇంకా ఎంతో చేయాల్సి ఉంది. 2500 సంవత్సరాల కంటే ముందు ప్లేటో చెప్పినట్టు, ప్రభుత్వంలో బాధ్యత తీసుకోవటానికి తిరస్కరించే విజ్ఞులు అనుభవించే శిక్ష ఏమిటంటే, చెడ్డవ్యక్తుల ఆధ్వర్యంలోని ప్రభుత్వం కింద బతకటం. అధికారంలో ఉన్న కొద్దిమంది వ్యక్తులు అధికార దుర్వినియోగానికి పాల్పడటాన్ని అడ్డుకునే సత్తాని మనందరం సంపాదించుకోవాల్సిన అవసరముంది.

('సిటిజన్ ఛార్టర్ల'పై దాదాపు 13 ఏళ్ల క్రితం డా॥ జేపీ రాసిన ఆంగ్లవ్యాసమిది) ★

# లోక్‌సత్తా పార్టీని బలోపేతం చేయాలి



లోక్‌సత్తా పార్టీని మరింత బలోపేతం చేయటానికి కార్యకర్తలు, నాయకులు అంకిత భావంతో పనిచేయాలని భీశెట్టి బాబ్జీ కోరారు. పార్వతీపురం మండలం లోని బందలుప్పి గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సత్తా పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, ఆ పునాది మీద పార్టీని విస్తరించటానికి కృషి చేయాలని అన్నారు. ప్రస్తుత రాజకీయాల పట్ల ప్రజలు విసిగిపోయారని, ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చటం లేదన్నారు. కార్యక్రమంలో అల్లం ప్రభాకరరావు, కె. పాపారావు, సింహాచలం, తవిటి నాయుడు, దామోదరరావు, ధనుంజయరావు, సత్యవతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ★



LS Times August 16-31 2016 Issue.pmd 22 8/11/2016, 2:47 PM

# మార్పు కోసం మరో అడుగు

- చెరుకుపల్లి రవీందర్‌రెడ్డి
విశ్రాంత పోలీస్ అధికారి



భారత స్వాతంత్ర్యోద్యమాన్ని చూసే భాగ్యం కలుగలేదు. ప్రజలంతా ఒక ఉమ్మడి ఆశయం కోసం ఉప్పెనలా కదిలి సమాజాన్ని మార్చుకుంటారని, భవిష్యత్తును నిర్మించుకుంటారని పుస్తకాల్లో చదివాను. కానీ అలాంటి సన్నివేశమే ఒకటి కళ్లముందు జరిగి నన్ను అమితంగా ప్రభావితం చేసింది. అదే తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం. నిజానికి నేను మొదట్లో తెలంగాణ ఉద్యమం గురించి 'క్రిటిక్'గానే ఉన్నాను. అప్పటికి ప్రచారంలో ఉన్న వాదనలు, అపోహలతో నాకు తెలంగాణ అభివృద్ధి పట్ల అనేక అనుమానాలు, భయాలుండేవి. ఉద్యమవాదులు చెబుతున్న వాటిలో కొంత 'ఎగ్జాగరేషన్' ఉన్నట్లు కూడా అనిపించేది. కానీ ఉద్యమం కొనసాగుతున్న కాలంలో నా ఉద్యోగ బాధ్యతల రీత్యా ఉద్యమాన్ని దగ్గరగా చూసే అవకాశం ఉండింది. తెలంగాణ ఉద్యమ ప్రారంభ రోజుల నుంచీ తెలంగాణ ఉద్యమకారులు చెబుతున్న వాటి గురించి ఒక్కొక్కదానిపై విశ్వాసం ఏర్పడింది. అన్నింటికన్నామించి ప్రజల భాగస్వామ్యం, రాష్ట్ర సాధన కోసం ఆబాలగోపాలం కలిసి నడవటం ఆలోచింపజేసింది. చిన్న పిల్లవాడు మొదలు పండు ముసలి దాకా ఉద్యమకారులై కదులుతుంటే.. వారి మొహాల్లో విరిసిన ఆకాంక్షల వెలుగులు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి. సామాన్యులు అసమాన పట్టుదలతో, త్యాగాలతో అద్భుతాలు సాక్షాత్కరింపచేస్తారని అనుభవంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ.. రెండు విషయాల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉన్నది. తెలంగాణ పునర్నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు అభివృద్ధి ఒకటైతే, అవినీతిరహిత పారదర్శక పాలన రెండవది. వీటి గురించి నాదైన అనుభవంతో కొన్ని ఆలోచనలు పంచుకోవడానికి ప్రయత్నిస్తాను.

తెలంగాణ సాధించడం కోసం సాగిన పోరాటకాలంలో ప్రజలు చూపిన ఐకమత్యం, చైతన్యం చూసిన తర్వాత తెలంగాణ ఒక ఉజ్వల భవిష్యత్తులోకి అడుగిడబోతున్నదన్న నమ్మకం ఏర్పడింది. రాష్ట్రమైతే సాధించుకున్నాంగానీ.. ఉద్యమకాలంనాటి ఐకమత్యం, చైతన్యంతో మనల్ని మనం తీర్చిదిద్దుకోవడంలో చూపలేకపోతున్నామన్నది ఇప్పుడు అనుభవంలోకి వస్తున్నది. ప్రభుత్వంగా ప్రవేశపెడుతున్న సంక్షేమపథకాలు క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రజల జీవితాల్లో ఎంతమేరకు మార్పునకు దోహదపడుతున్నాయన్నది చూస్తే కాస్తంత నిరాశ కలుగు తున్నది. ఇలాంటి సందర్భా ల్లోనే ప్రభుత్వ, పౌర సమాజం ముందుకువచ్చి బాధ్యతా యుతంగా ఆలోచించాల్సిన అవసరమున్నది. రాష్ట్ర సాధన లక్ష్యాలను సాకారం చేసుకు నేందుకు ప్రజలను ఏకతాటి పై నడిపి అభివృద్ధిపథంలో నడిపించే బాధ్యతను భుజ స్కంధాలపై వేసుకోవాల్సిన చారిత్రక సందర్భమిది.

ఈ నేపథ్యంలో నిజామా బాద్ జిల్లా అంకాపూర్, వరంగల్ జిల్లా గంగదేవిపల్లి, నల్లగొండ జిల్లా ప్రొద్దుటూరు మనకు మార్గం చూపిన విషయాన్ని గమనంలోకి తీసుకోవాల్సి ఉన్నది. ప్రజలంతా ఐకమత్యంగా ఉమ్మడిగా కలిసి నడిస్తే ఎంతటి అద్భుతాలు సాధించవచ్చునో ఆ గ్రామాలు మనకు చెబుతున్నాయి. ఈ సందర్భంలో మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ఆలోచిస్తే.. ఈ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎలా సమన్వయంతో చేయవచ్చునో ఒక ప్రణాళిక రూపొందించుకోవచ్చు. ప్రతి గ్రామానికి వీఆర్‌వో, వీడీవో ఉంటారు. అలాగే మండల కేంద్రంగా అగ్రికల్చర్ అధికారులు, వెటర్నరీ ఆఫీసర్, మండల అభివృద్ధి అధికారులు, ఇంజినీర్లు ఎంతలేదన్నా ముప్పై మంది దాకా ప్రభుత్వాధికారులుంటారు. ఒక్కో గ్రామాన్ని ఒక్కో అధికారి దత్తత తీసుకోవాలి. మండలంలో గరిష్టంగా 25 నుంచి 30 గ్రామాలుంటాయని అనుకున్నా.. ఒక్కో గ్రామానికి ఒక మండలస్థాయి అధికారిని బాధ్యుడిగా నియమించి ప్రజలందరి సహకారంతో



LS Times August 16-31 2016 Issue.pmd 23 8/11/2016, 2:47 PM

సంక్షేమపథకాలు అమలుజరిగేలా చూడాలి. ఈ విధంగా ఓ ఐదేళ్లు నిబద్ధతతో, నిజాయితీతో పనిచేస్తే.. తెలంగాణ అంతా అంకాపూర్‌లు, గంగదేవిపల్లి, ప్రొద్దుటూరులే అవుతాయి. రాష్ట్రం సాధించుకుని రెండేళ్లు పూర్తయి మూడో ఏట అడుగిడబోతున్న వేళ.. ఈ విధమైన కార్యాచరణకు ప్రభుత్వం పూనుకుంటే తెలంగాణ అంతటా ఒక అద్భుతాన్నే ఆవిష్కరించవచ్చు. ఆ అద్భుతమే బంగారు తెలంగాణ అనుకోవచ్చు. తెలంగాణ ప్రాంతంలో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ లాంటి పథకాలతో సమూలు మార్పు తీసుకొచ్చి తెలంగాణ చరిత్రలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడతామంటున్న ప్రభుత్వం ఈ విధమైన కార్యాచరణపై కూడా ఆలోచిస్తే ఎంతో మేలు జరుగుతుంది. లేకపోయినట్లయితే.. గత ప్రభుత్వాల ఆచరణ, అనుభవం ఉండనే ఉన్నది. పథకాలు ఎంత గొప్పవి అయినా.. ప్రజల భాగస్వామ్యం లేకుంటే.. ఫలితాలు ఆశించిన స్థాయిలో కాదు కదా, కనీసంగా కూడా కానరాని స్థితి చూశాం. కాబట్టి నేటి ఆదర్శ గ్రామాల ఆచరణ, అనుభవంతో ఈ సమైక్య జీవనం, సమష్టి పనివిధానం కేంద్రంగా గ్రామాలన్నీ కదిలే విధంగా చూడాల్సిన అవసరం ఉన్నది.

రాష్ట్ర సాధనలో ప్రజలు చూపించిన చొరవ చూస్తే.. రాష్ట్రం ఆవిష్కృతమైతే, తాము ఒక కొత్త ప్రపంచంలోకి వెళతామన్న ఆకాంక్షలు కనిపించాయి. అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం అనలే లేని ఒక జనరంజక పాలన ఆవిష్కరించబడుతుందన్న ఆశ బలంగా ఉండింది. కానీ ఇవ్వాళ.. ప్రధానంగా ప్రభుత్వ యంత్రాంగంలో పాత వాసనలు పోయిన దాఖలాలు కనిపించడం లేదు. ఏ ఆఫీసును చూసినా జవాబుదారీతనం కనిపించడం లేదు. లంచగొండితనం సరేసరి. నేను 33 ఏళ్లు ప్రభుత్వంలో ఒక అధికారిగా ఉండి ఈ మధ్యనే పదవీవిరమణ పొందాను. దైనందిన జీవితంలో ప్రభుత్వ సేవలు అవసరమై ఎక్కడికి పోయినా గతంలో కనిపించినదానికి భిన్నంగా వాస్తవ రూపంలో ఏ మార్పులేదని అర్థమవుతున్నది. ప్రభుత్వ ప్రభావశీల అధికారిగా ఉన్నప్పుడు కనిపించని చీకటి మూలలెన్నో నేనిప్పుడు ఓ సాధారణ పౌరునిగా 'నేకెడ్ ఐ'తో చూస్తున్నప్పుడు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రెవిన్యూ, పోలీస్ డిపార్ట్‌మెంట్ల పని విధానంలో సమూల మార్పు రావాల్సిన అవసరం ఉన్నది. ఈ సందర్భంగానే నాకు ఎదురైన అనుభవమొకటి చెబుతాను. హైదరాబాద్ నగరం బేగంపేట దగ్గరలోని ప్రకాష్‌నగర్‌లో ఓ సాధారణ పౌరునికి వంశపారంపర్యంగా వచ్చిన ఐదెకరాల భూమి ఉన్నది. ఆ భూమిలో అతను ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా తనదైన సాదాసీదా జీవనం సాగిస్తున్నాడు. రాష్ట్ర సాధన తర్వాత హైదరాబాద్ విశ్వనగరంగా మారిన క్రమంలో నగరంలోని భూమి అంటే.. 'బంగారు ఇటుక'గానే చెప్పుకోవచ్చు. అదిప్పుడు ఎంతలేదన్నా 50-60 కోట్ల విలువ చేస్తుందని అంటున్నారు. ఈ క్రమంలో.. దానిపై ఓ బడాబాబు కన్నుపడి దాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాడు. సదరు భూమికి సంబంధించి రికార్డులు, న్యాయబద్ధమైన హక్కు పత్రాలన్నీ భూమి స్వంతదారుని వద్ద ఉన్నా, డబ్బులున్న దొరబాబు దొంగపత్రాలతో భూమిని ఆక్రమించి ఏకంగా నిర్మాణాలనే ప్రారంభించాడు. ఈ విషయం తెలిసి నా వంతు కర్తవ్యంగా సామాన్యునికి న్యాయపరంగా ఉన్న హక్కును పరిరక్షించాలని సంబంధిత పోలీస్, రెవిన్యూ, జీహెచ్ఎంసీ అధికారులందరినీ కలిసి విన్నవించడం జరిగింది. కానీ.. ఏ ప్రభుత్వాధికారి కూడా సామాన్యునికి అండగా నిలబడలేదు. ఏదో కారణం చూపి 'సివిల్ సమస్య' అని, 'లిటిగేషన్ ఇష్యూ' అని అన్ని విభాగాల ప్రభుత్వాదికారులు పరోక్షంగా బడా బాబు కొమ్ముకాస్తున్నారు. నేనొక రిటైరైన ఉన్నతోద్యోగిగా పరిచయం చేసుకుని సామాన్యునికి న్యాయం జరగాలని ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. నాదంతా అరణ్యరోదనే అయింది. ఈ పరిస్థితులను చూసిన తర్వాత నేను చాలా నిరుత్సాహపడ్డాను. నేను సర్వీసులో ఉన్నతాధికారిగా ఉన్నప్పుడు ఈ ప్రభుత్వ విభాగాల మీద సదభిప్రాయం ఉండేది. కానీ వాస్తవ జీవితంలో ప్రభుత్వ యంత్రాంగమంతా ఎంతగా ఆశ్రిత పక్షపాతంతో వ్యవహరిస్తున్నదో అనుభవమైన తర్వాత ప్రభుత్వ యంత్రాంగంపై విశ్వాసం సన్నగిల్లుతున్నది. ఈ పరిస్థితులు ఎక్కడా, ఏ రూపంలో సమాజానికి మంచిది కాదు. ఆరోగ్యకర సమాజానికి ప్రభుత్వ యంత్రాంగ పనివిధానం కూడా అతి కీలకమైనది. అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ యంత్రాంగమంతా ఉండాలి. సేవలందించాలి. పారదర్శక పాలనా విధానంతోనే ప్రజాస్వామ్యంపై విశ్వాసం పెరుగుతుంది. కాబట్టి పాలనా విభాగాలన్నింటా పారదర్శకతతో కూడిన పనివిధానాన్ని పాదుకొల్పి, అవినీతిని అంతమొందించాలి. ఈ విధమైన పాలనాపరమైన చర్యలు తీసుకుని ముందుకుపోయిన నాడే రాష్ట్ర సాధనోద్యమంలో కలలుగన్న విధంగా ప్రజాపాలన అనుభవంలోకి వస్తుంది. ఈ దిశగా కూడా తెలంగాణ ప్రభుత్వం ఆలోచించాలి. అడుగులు వేయాలి. అందరూ నచ్చే, మెచ్చే పాలనను ప్రజలకు అందించాలి.

(నమస్తే తెలంగాణ సౌజన్యంతో) ★



LS Times August 16-31 2016 Issue.pmd 24 8/11/2016, 2:47 PM

# మేలు చేయని మోదీ నిజాయితీ!

- భరత్ ఝున్‌ఝున్‌వాలా

మోదీ సర్కారు నిజాయితీ గల ప్రభుత్వం అయితే ఈ నిజాయితీ ప్రజలకు శాపంగా పరిణమించింది. తప్పుడు విధానాలను చిత్తశుద్ధితో అమలుపరచడమే ఈ అనర్థానికి హేతువు. పిల్లలు ఆరోగ్యవంతంగా వర్ధిల్లాలని వారికి మంచి పిజ్జాలు ఇచ్చే మాతృమూర్తి వైనం లాంటిదే మోదీ పాలనా వ్యవహారం కూడా. ఆ తల్లి పిజ్జాలను తయారుచేయడానికి నాణ్యమైన పిండి, టమాటాలను తీసుకువస్తుంది. తల్లి అభీష్టానికి విరుద్ధంగా ఆ పిజ్జాలు పిల్లల అనారోగ్యానికి కారణమవుతాయి. నాణ్యత తక్కువగా ఉన్న గోధుమ పిండి తీసుకువచ్చి దాల్‌తో చపాతీలను ఇచ్చినట్టయితే పిల్లలు బాగా ఆరోగ్యంగా ఉండేవారు కదా.

చాలామంది యూపీయే మంత్రులు, సీనియర్ అధికారులు అవినీతిపరులు. లంచాలు తీసుకుని చట్టోల్లంఘనలను ఉపేక్షించారు. ఒక పారిశ్రామికవేత్త తన ఫ్యాక్టరీలో కాలుష్యనివారణ యంత్రాలను ఏర్పాటు చేయవలసి ఉంది. అందుకు కోట్ల రూపాయల వ్యయమవుతుంది. ఆ వ్యయాన్ని తప్పించుకోవడానికిగాను ఆ పారిశ్రామిక మంత్రి సంబంధిత మంత్రికి ఏటా ఐదు లక్షల రూపాయలు లంచంగా ఇస్తాడు. దీనివల్ల అతని ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. కాలుష్య నియంత్రణ యంత్రాలను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉండదు. వాటి నిర్వహణకయ్యే విద్యుత్తు వ్యయం కూడా అతనికి కలిసి వస్తుంది మరి. ఉత్పత్తి వ్యయం తక్కువ గనుక మంచి లాభాలనార్జిస్తాడు. లేదా ఆ పారిశ్రామికవేత్త ఉత్పాతదక సుంకం, అమ్మకపు పన్ను చెల్లించనవసరం లేకుండా తన ఉత్పత్తులను నల్ల బజారులో విక్రయించుకుంటాడు. దీనివల్ల కూడా ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. సరే, అతని నుంచి లంచం తీసుకున్న మంత్రి ఆ డబ్బును రియల్ ఎస్టేట్‌లో మదుపు చేస్తాడు. సులభ ధనం అందుబాటులో ఉండడంతో భవన నిర్మాణాన్ని బిల్డర్ శీఘ్రగతిన పూర్తి చేస్తాడు. ఆర్థిక వ్యవస్థలో పనులు సజావుగా సత్వరమే జరిగిపోవడానికి అవినీతి ఇలా వీలు కల్పిస్తుంది.

మోదీ ప్రభుత్వం ఇటువంటి అవినీతిని అంతమొందించింది. తత్ఫలితంగా పారిశ్రామికవేత్త తప్పనిసరిగా తన ఫ్యాక్టరీలో కాలుష్య నియంత్రణ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నాడు. ఉత్పత్తి వ్యయం పెరిగింది. తన ఉత్పత్తులను నల్లబజారులో విక్రయించుకోవడం అసాధ్యమై పోయింది. ఇప్పుడు అతను గతంలో కంటే మరిన్ని పన్నులను చెల్లిస్తున్నాడు. ఉత్పత్తి వ్యయం పెరిగిపోవడానికి ఇది దారితీస్తోంది. సరే మంత్రి మహాశయుడు కూడా బిల్డర్‌కు సులభ ధనాన్ని సమకూర్చలేకపోతున్నాడు. దీంతో రియల్ ఎస్టేట్ లావాదేవీలు మందగించాయి. గతంలో మంత్రి గారి జేబులోకి వెళ్లిన ధనం ఇప్పుడు ప్రభుత్వ ఖజానాకు జమ అవుతోంది. ఇది మౌలికంగా మంచి పరిణామం. గృహిణి గతంలో మాదిరిగా నాణ్యత లేని పిండికి బదులు మేలురకం పిండిని కొనుగోలు చేయడం లాంటిదీ మార్పు.

మరి ఈ నిజాయితీ ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుంది? మళ్లీ తల్లీపిల్లల వద్దకు వెళదాం. మంచి నాణ్యత గల పిండిని ఎలా ఉపయోగిస్తున్నారనే దానిపై పిల్లల ఆరోగ్యం ఆధారపడివుంటుంది. ఆ మేలురకం పిండితో చపాతీలు చేస్తే పిల్లల ఆరోగ్యం భేషుగ్గా ఉంటుంది. అలాకాక అదే పిండితో పిజ్జాలు చేసి పిల్లల చేత తినిపిస్తే వారి ఆరోగ్యం దెబ్బతినడం ఖాయం. ఇదే నియమం ఆర్థిక వ్యవస్థకూ వర్తిస్తుంది. మంత్రుల నిజాయితీ చూపే ప్రభావం పెరిగిన ప్రభుత్వ ఆదాయాన్ని ఏ విధంగా ఉపయోగిస్తున్నారన్న దానిపై ఆధారపడివుంటుంది.

పెరిగిన రాబడిని హైవేల నిర్మాణం, విద్యుత్తు సరఫరాను మెరుగుపరచడానికి ఉపయోగిస్తే ఆర్థిక వ్యవస్థ మరింత సౌష్టవాన్ని పొందుతుంది. పన్నులను ఖచ్చితంగా చెల్లించవలసి రావడం వల్ల పారిశ్రామికవేత్తక పెరిగిన ఉత్పత్తి వ్యయంతో తగ్గిన ఆదాయాన్ని, మెరుగైన హైవేల నిర్మాణం తగ్గించే ఉత్పత్తి వ్యయంతో పెంచుకోవడం సాధ్యమవుతుంది. అయితే పెరిగిన ఆదాయాన్ని ప్రభుత్వోద్యోగుల వేతన భత్యాల పెంపుదలకు ఉపయోగిస్తే ఆర్థిక వ్యవస్థ డీలా పడిపోతుంది. పారిశ్రామికవేత్తలు మరింత ఎక్కువగా నష్టాల పాలవుతారు. రియల్ ఎస్టేట్ రంగంలోకి వచ్చే నల్లధనం కూడా ఆగిపోతుంది.



LS Times August 16-31 2016 Issue.pmd 25 8/11/2016, 2:47 PM

గత రెండేళ్లుగా మోదీ ప్రభుత్వ పాలనలో జరుగుతుంది ఇదేనని చెప్పకతప్పదు. మంత్రుల నిజాయతీ వల్ల ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు దోహదం జరగడం లేదు. పెరిగిన ప్రభుత్వ రాబడిని ఏడవ వేతన సంఘం సిఫారుసుల మేరకు ప్రభుత్వోద్యోగుల, పెన్షనర్ల వేతన భత్యాల పెంపుదలకే ఉపయోగించవలసి రావడవే ఇందుకు కారణమని చెప్పనవసరం లేదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే, మోదీ ప్రభుత్వం కోట్లాది ప్రజల ఆదాయాన్ని పన్నుల రూపేణా స్వాయత్తం చేసుకొని ప్రభుత్వోద్యోగుల, పెన్షనర్ల లబ్ధికి వినియోగిస్తుంది. ఈ ప్రభుత్వం 'ప్రభుత్వోద్యోగుల యొక్క ప్రభుత్వోద్యోగుల చేత, ప్రభుత్వోద్యోగుల కొరకు' పనిచేస్తున్న ప్రభుత్వంగా ఉన్నది. 'ప్రజలు' మాత్రం నిస్సహాయంగా నలిగిపోతున్నారు. సెప్టెంబర్ 30లోగా తమ వద్దనున్న నల్లధనం వివరాలను వెల్లడించాలని వ్యాపారవర్గాలను ప్రభుత్వం ఆదేశించింది. ఆ గడువు తరువాత, నల్లధనం వివరాలను వెల్లడించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. దీనివల్ల పరిస్థితులు మరింతగా విషమిస్తాయి. ఆదాయపన్నును చెల్లించవలసిన క్లిష్ట పరిస్థితి నుంచి తమను తాము తప్పించుకోవడానికి అవసరమైన ఉపాయాలను కనుగొనేందుకు వ్యాపారవేత్తలు తమ సమయాన్ని, శక్తియుక్తులను వినియోగించవలసి వస్తుంది. ఇక కొత్త పరిశ్రమలో మదుపు చేసే విషయం గురించి వారు ఆలోచించరు. దీనివల్ల నష్టపోయేది ఎవరో స్పష్టమే. కనుక మోదీ మొదట పెరిగిన ప్రభుత్వాదాయాన్ని ఉత్పాదక రంగాలకు మళ్లించాలి. అప్పుడు మాత్రమే పాలకుల నిజాయతీ ప్రజలకు నిజంగా లబ్ధిని సమకూరుస్తుంది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ✶

# దార్శనిక పత్రం- 2030



పేదరిక నిర్మూలన లక్ష్యంగా 15 ఏళ్ల దార్శనిక పత్రాన్ని రూపొందించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశానికనుగుణంగా నీతి ఆయోగ్ కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రాలతో భేటీ అనంతరం ప్రధానమంత్రి, నీతి ఆయోగ్ ఛైర్మన్ నరేంద్ర మోదీతో కూడా సమావేశమైంది. దేశ ఆర్థిక పురోగతి, వివిధ ప్రభుత్వ పథకాల పురోగతి గురించి ప్రధాని ఈ సందర్భంగా సమీక్షించారు. ప్రజల జీవితాల్ని మెరుగుపరిచేలా దేశ సమూల రూపాంతరీకరణకు సమయం ఆసన్నమైందని ప్రధాని అన్నారు. ఖచ్చితమైన విధానాల ద్వారా దేశ సంపదను సద్వినియోగం చేసేలా దార్శనిక పత్రం-2030ని రూపొందించాలన్నారు.

### నిష్ణాతుల్ని ప్రభుత్వంలోకి తీసుకోవాలి

వివిధ రంగాలకు చెందిన నిష్ణాతుల్ని ప్రభుత్వంలో తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఈ సందర్భంగా నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగడియా ప్రధానికి సూచించారు.

ఆరు దశాబ్దాలుగా కొనసాగుతున్న పంచవర్ష ప్రణాళికల స్థానంలో ఈ కొత్త ప్రణాళిక ముందుకురానుంది. మౌలిక సౌకర్యాల కల్పన, వాణిజ్యం, విద్య, ఆరోగ్యం, అంతర్గత భద్రత, రక్షణ రంగాలకు కూడా ఈ దార్శనిక పత్రంలో పెద్దపీట వేయనున్నారు. ప్రభుత్వ వర్గాల వివరాల ప్రకారం:

- 2030 నాటికి లక్ష్యాల్ని, సాధించేందుకు మార్గాల్ని ఈ డాక్యుమెంట్‌లో తెలియచేయాలి
- దీర్ఘకాలిక దార్శనిక పత్రాన్ని ఆచరణయోగ్యమైన విధానంగా మలచటానికి వీలుగా ఏడేళ్ల వ్యూహాన్ని (2017-18 నుంచి 2023-24) కూడా నీతి ఆయోగ్ రూపొందిస్తుంది. 2020లో మధ్యంతర సమీక్ష ఉంటుంది.
- 12వ పంచవర్ష ప్రణాళిక (2012-17) ముసాయిదా అంచనా పత్రం ప్రస్తుతం ఖరారు దశలో ఉంది. 15 ఏళ్ల దార్శనిక పత్రం, ఏడేళ్ల వ్యూహాత్మక పత్రం రూపకల్పనకు కసరత్తు త్వరలోనే ప్రారంభంకానుంది. ✶



LS Times August 16-31 2016 Issue.pmd 26 8/11/2016, 2:47 PM

# వైఫల్యం కాదు ప్రతిభకు కొరత

- శేఖర్ గుప్తా

ఢిల్లీ మేధావులకు కేంద్రమైన ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్ (ఐఐసీ)లో ఇటీవల మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవిత చరిత్ర ఆవిష్కరణ జరిగింది. గ్రంథ రచయిత వినయ్ సీతాపతి హఠాత్తుగా.. పీవీ నుంచి నరేంద్ర మోదీ నేర్చుకోవలసిన పాఠం లేదా నైపుణ్యం ఏదైనా ఉంటే అది ఏమిటి? అనే ప్రశ్నను సంధించి వేదిక మీదున్న నాతో సహా ప్రతాప్ భానుమెహతా, సీ రాజామోహన్, కే నట్వర్‌సింగ్‌లను ఆశ్చర్యంలో ముంచెత్తారు. ప్రధానిలో ఏదైనా నైపుణ్యం కొరవడిందని, మరెవరి నుంచో దాన్ని నేర్చుకోవాలని సూచించటమంటేనే నిర్లక్ష్యంగా ప్రవర్తించడమైన ఈ రోజుల్లో నేను నా వణుకును శ్రోతలపై ప్రశ్నల వర్షం కురిపించడం ద్వారా వ్యక్తం చేశాను. 2014 వేసవిలో మోదీ భారత్‌కు కొత్త ఆశను వాగ్దానం చేసి దిగ్భ్రాంతికరమైన ఆధిక్యతతో ఎన్నికయ్యారు. కాబట్టి విషయ పరిజ్ఞానులైన శ్రోతలను ఈ "ఆశ"కు బాధ్యత వహిస్తున్న కొన్ని మంత్రిత్వ శాఖలను తెలపమని (తాజా మంత్రివర్గ విస్తరణ జరగకముందు) కోరాను. వ్యవసాయం, ఆరోగ్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ, గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, సాధికారతలను ఏకరువుపెట్టాను. 500మంది మేధో నిధులతో కిక్కిరిసిన హాలులో కేవలం 2శాతం, దాదాపు 10మంది మాత్రమే వ్యవసాయ శాఖామాత్యులు రాధామోహన్ సింగ్‌కు చేతులు ఎత్తారు. అదే అత్యధికం. ఇక గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు బీరేంద్ర సింగ్‌కు అతి తక్కువగా ఇద్దరు మాత్రమే చేతులెత్తారు. ఆరోగ్యమంత్రి జేపీ నడ్డా, శాస్త్ర సాంకేతిక మంత్రి హర్షవర్ధన్, సామాజిక న్యాయ మంత్రి చాంద్ గెహ్లోట్‌లు ఆ రెంటికీ మధ్యన ఉన్నారు. కార్మిక, ఉపాధి, ఆదివాసి వ్యవహారాలు, గనులు గురించి అడిగినా అంతకంటే మెరుగ్గా ఉండేదేమీ కాదు. రాంవిలాస్ పాశ్వాన్, ఉమాభారతి అందరికీ తెలిసినవారే. కానీ మోదీ మంత్రివర్గంలో వారు ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ, జల వనరుల శాఖలను నిర్వహిస్తున్నారని వెంటనే ఎవరికీ గుర్తురాదు.

## నిష్క్రియాపరులైన మంత్రుల పరంపర

నిజానికి ఇటీవలి కాలపు మన మంత్రివర్గాలలోని చాలామంది మంత్రులు ఎవరికీ తెలియదు. యూపీయే అధికారంలో ఉండగా వర్షాలు బాగా తక్కువగా పడి, తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే కాలమని వాతావరణ శాస్త్రజ్ఞులు చెబుతున్నప్పుడు సైతం మన నీటి వనరుల మంత్రి ఎవరో కొద్దిమందికే తెలిసేది. యూపీయే ఆరోగ్య మంత్రులు మాత్రం వారు సృష్టించిన వివాదాల వల్ల బహుశా మీలో చాలామందికి గుర్తుండవచ్చు. ఏఐఐఎంఎస్-రాందాస్‌ల వివాదం వాటిలో ఒకటి. గులాం నబీ ఆజాద్ కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత అయినా ఆయన యూపీయే-2 హయాంలో పూర్తి ఐదేళ్లూ ఆరోగ్యమంత్రిగా పనిచేశారని చాలామందికి తెలియదు. ఈ ఐదేళ్ల కాలంలో యూపీయే-2 ప్రభుత్వానికి ఏడుగురు రైల్వే మంత్రులు ఉండేవారు. వారిలో ప్రతి ఒక్కరూ ముందటి వారికంటే అధ్వాన్నం కావడం సర్వసాధారణం. చివరకు ఆ యూపీయే ప్రభుత్వాన్ని భారత రాజకీయ చరిత్రలోనే అత్యంత



మొరటుగా ప్రజలు అధికారంలో నుంచి గెంటేసి, ఆశను వాగ్దానం చేసిన మోదీని గెలిపించారని గుర్తుంచుకోవాలి.

ఆరోగ్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, నీరు, ఉపాధి, ఆహార శాఖలు నేటి "ఆశ" మంత్రిత్వ శాఖలు. మోదీ ఈ శాఖలకు ఎంపిక చేసిన ప్రస్తుత మంత్రులను వారి మౌలిక అర్హతలను లేదా వారికి ఉన్న పలుకుబడిని బట్టి చూస్తే.. సైన్స్, ఆరోగ్య శాఖల మంత్రుల వలే అసమర్థులని అనటానికి వీల్లేదు. అయినా అవి నిరాశ మంత్రిత్వ శాఖల్లా కనిపిస్తున్నాయి. వ్యవసాయమంత్రి "జైవిక్ ఖేతీ" (సేంద్రియ వ్యవసాయం), ఆవు పేడ, మూత్రాల మహత్యాలను మించి మాట్లాడరు. ఇక జలవనరుల శాఖ గత రెండు వానాకాలాల్లాగే ఆలోచనలు, ఫలితాల దుర్భిక్షాన్ని ఎదుర్కొంటోంది. ఇక ఆరోగ్య శాఖను చూస్తే అది వాస్తవంగా నిజ మంత్రిత్వశాఖయైన ఆయుష్‌కు అనుబంధమేననిపిస్తూ ఆశ్చర్యం కలగజేస్తుంది. ఇక గ్రామీణాభివృద్ధి మంత్రి ఎప్పుడూ తన సొంత రాష్ట్రానికి విద్యుత్తుపైనే దృష్టిని సారిస్తారు. సైన్స్ మంత్రి ఢిల్లీలో తనను కాదని కిరణ్ బేడీకి పగ్గాలు అప్పగించడం వల్ల, తనను



LS Times August 16-31 2016 Issue.pmd 27 8/11/2016, 2:47 PM

అమర్యాదకరంగా ఆరోగ్యశాఖ నుంచి తప్పించడం వల్ల కలిగిన గాయాల నుంచి ఇంకా కోలుకుంటూనే ఉన్నారు.

**ప్రతిభను ఆహ్వానిస్తే ఫలితాలు**

మోదీ ప్రభుత్వం ఘోరవైఫల్యానికి గురికాలేదు. వాస్తవానికి అది అందుకు చాలా దూరంగా ఉంది. సవాళ్లను విసురుతున్న అంతర్జాతీయ వాతావరణంలో ఆర్థిక వృద్ధి దృఢంగానే ఉంది. కాశ్మీర్ పరిస్థితి దిగజారుతున్నా సామాజిక స్థిరత్వానికి సవాలేమీ లేదు. అయితే అది తాను వాగ్దానం చేసిన ఆశ కనబడేట్టు ఏమైనా చేస్తోందా? వరుసగా జరిగిన రాష్ట్రాల ఎన్నికలు, కొన్ని చిన్న రాష్ట్రాలలో ఆప్ పట్ల ఆకర్షణ పెరుగుతుండటం.. లేదు అని సూచించే ఆధారాలు. అయినా తీర్పు చెప్పాల్సిన వారు ఇంకా న్యాయపీఠంపైకి రాలేదు. మోదీని ఇందుకు పెద్దగా తప్పు పట్టాల్సిన పనిలేదు. ఆయన మంత్రివర్గంలో, ఆయన ప్రభుత్వం చుట్టూ ప్రతిభ కొరవడటమే అందుకు కారణం. రహదారులు, రైల్వేలు, విద్యుచ్ఛక్తి, కోశ క్రమశిక్షణ, బ్యాంకుల ప్రక్షాళన వంటి విషయాలలో మంచి పని సాగుతున్నా అది ఆయా మంత్రిత్వ శాఖలకు నేతృత్వం వహిస్తున్న మంత్రులతో ముడిపడి ఉండటమే అందుకు అత్యుత్తమమైన ఆధారం.

రెండేళ్ల క్రితం మోదీ సంకీర్ణ భాగస్వాముల తలబరువు లేకుండానే తమ స్వంత మెజారిటీతో అధికారంలోకి వచ్చినప్పుడు.. ఆయన తన ప్రభుత్వంలోకి దేశంలోని అత్యుత్తమ ప్రతిభను సాధ్యమైనంత విస్తృతంగా ఆకర్షిస్తారని చాలామంది ఆశించారు. మంత్రివర్గంలోకి, అత్యున్నత అధికార స్థానాల్లోకి నిపుణులను తీసుకోవడానికి, "వ్యవస్థ బయటి"వారి ప్రతిభ నేతృత్వంలో సాధికారత గలిగిన ప్రత్యేక లక్ష్యాల బృందాలను ఏర్పాటు చేయడానికి తగిన రాజకీయ పెట్టుబడి ఉండేది. పాత భావజాల బంధాలకు అతీతంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ ప్రతిభను సేకరించకుండా ఆయనను అడ్డుకోగలిగినది ఏదీ నాడు లేదు. అయితే ఆయన ఆ పని చేయలేదు.

గడచిన పలు దశాబ్దాల కాలంలో పార్టీయేతర ప్రతిభను స్వీకరించడానికి వెనుకాడే ప్రధాని మోదీనే. ఎన్ని గందరగోళాలున్నా యూపీయే-2 సైతం నందన్ నీలేకనిని తీసుకొచ్చి, నేడు మోదీ ప్రభుత్వ ప్రధాన పథకాలకు ఆధారంగా ఉన్న ఆధార్‌ను సాకారం చేసే అధికారాన్ని అప్పగించింది. మోదీ ప్రభుత్వపు నీలకేని ఎవరు? ఆధార్‌తో సరితూగగల దాని నూతన ఆలోచన ఏది? ఇందిరాగాంధీ కార్పొరేట్ రంగం నుంచి ప్రతిభను సేకరిస్తుండేవారు. రాజీవ్‌గాంధీకి టెలికాం రంగాన్ని విప్లవాత్మకంగా మార్చిన శ్యామ్ పిట్రోడా ఉన్నారు. వాజపేయికి విద్యుత్తు శాఖ కార్యదర్శిగా ఉండిన ఆర్‌వీ షాహీ.. సంస్కరణలను రూపొందించి, అమలుచేయడానికి పూనుకున్నారు. స్వల్పకాలమే ప్రధానిగా ఉన్న వీపీ సింగ్‌కు మనం చెప్పుకున్న ఈ ప్రధానితో పోల్చినా అత్యల్ప రాజకీయ పెట్టుబడి ఉండేది. ఆయన సైతం రాజీవ్ నుంచి అర్జున్‌సింగ్‌ను దొంగిలించి మన రక్షణ మంత్రిత్వశాఖ, త్రివిధ బలగాల ఆధునికీకరణ బాధ్యతను అప్పచెప్పారు. ఆయన తయారుచేసిన అద్భుతమైన నివేదిక నేటికీ ఉపయోగకరమైనదే. పాతుకుపోయి ఉన్న అధికార యంత్రాంగాలలో "బయటి" శక్తుల పట్ల అతి తీవ్ర నిరోధకత వృద్ధి చెందుతుంది. నాయకుడు అలాంటి బయటి శక్తులు మనగలిగేట్టుగా చేయాల్సి ఉంటుంది.

## పీవీ నుంచి ఏం నేర్చుకోవాలి?

మనం మొదలు పెట్టింది పీవీ నరసింహారావుతో, బహుశా ఆయనే ఇప్పుడు చెప్పుకున్న అందరు ప్రధానుల్లోకీ అత్యంత బలహీనమైన, తక్కువ జనాకర్షణగలవారు. అయినా ఆయనను నేటికీ ప్రేమతో (కొన్నిసార్లు ఆయన పెద్ద తప్పిదాలను సైతం విస్మరించేంత స్థాయిలో ప్రేమతో) గుర్తు చేసుకుంటాం. అందుకు కారణం ఆయన తనకున్న పరిమిత ప్రతిభతో, తక్కువ ప్రజాకర్షణతో, మెజారిటీ లేకపోయినా, తన సొంత పార్టీ సీనియర్లే ద్వేషించినా.. ఎక్కడ కనబడ్డా ప్రతిభను చేరదీయడమనే మంచి వివేచన, పెద్ద మనసు ఆయనకు ఉన్నందువల్లే. పీవీ.. మన్మోహన్‌సింగ్‌లోని రాజకీయవేత్తను కనిపెట్టి, హఠాత్తుగా ఆర్థికమంత్రిని చేశారు. ఆయన ఆర్థికశాఖకు కార్యదర్శి పనిచేసిన మాంటెక్‌సింగ్ ఆహ్లువాలియా ఒక ఐఏఎస్‌యేతర ఆర్థిక శాస్త్రవేత్త. అప్పటికి ఆయన ఇంకా 40ల వయస్కులే. పీ చిదంబరాన్ని పీవీ తన వాణిజ్యమంత్రిగా తీసుకుని, కీలకమైన అంతర్గత భద్రత శాఖను రాజేష్ పైలట్‌కు ఇచ్చారు. "రాజీవ్ కుర్రాళ్లు"గానే వారిని ఎక్కువగా చూసేవారు. ఫలితం.. ఎవరూ ఆశించని వారసత్వాన్ని ఆయన నిర్మించగలిగారు.

పీవీ నుంచి మోదీ నేర్చుకోవాల్సిన ఒక నైపుణ్యం, లక్షణం అదే. నిస్సందేహంగా పీవీ కంటే మోదీ చాలా యుక్తివంతుడైన, అపార జనాకర్షణ గల పెద్ద నేత. పైగా వయసు ఆయన పక్షాన ఉన్నది. మనదేశపు ముగ్గురు తెలివివంతులైన ప్రధానులు పీవీ, వాజపేయి, మన్మోహన్‌లకు 10 ఏళ్లు ఆలస్యంగానూ, రాజీవ్‌కు 10 ఏళ్లు ముందుగానూ అధికారం లభించింది. నూతన, ఆశావహ భారతానికి మోదీ వద్ద ఆలోచనలున్నాయి. ఆ ఆశను రేకెత్తించగల చక్కటి భాష ఉంది. కానీ వాటిని సాకారం చేసి చూపగల బృందం ఇప్పటికీ లేదు. అసహనంతో కూడిన, భావజాలమేదీ లేని, నేను ఎవరికీ ఏమీ రుణపడిలేనని భావించే ఓటర్ల తరం కటువైన ప్రశ్నలను లేవనెత్తే సమయం త్వరలోనే వస్తుంది.

(కర్టెసీ: సాక్షి) ★



LS Times August 16-31 2016 Issue.pmd 28 8/11/2016, 2:47 PM

ఫిరాయింపులపై నిర్ణయాధికారం ఈసీకివ్వాలి: రాజకీయ, న్యాయ, సామాజికవేత్తలు

# ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకోవటమూ అవసరం: జేపీ




పార్టీలు ఫిరాయించే ఎమ్మెల్యేలు, ఎంపీలపై వేటు వేసే అధికారం స్పీకర్‌కుకాకుండా, ఎన్నికల సంఘానికి ఇవ్వాలని ఎప్పట్నుంచో లోక్‌సత్తా చేస్తున్న వాదనలతో న్యాయనిపుణులు, రాజకీయ, సామాజికవేత్తలు కూడా ఏకీభవించారు. దేశ రాజకీయాలలో పేట్రేగిపోతున్న పార్టీ ఫిరాయింపులు అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని మంటగలుపుతున్నాయని, ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న అధికార పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు లేని చట్టసభ ఫాసిస్టు వ్యవస్థన్నారు. 'పార్టీల ఫిరాయింపులు–స్పీకర్ పాత్ర'పై ఇటీవల హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానభవన్‌లో జరిగిన సదస్సు స్పీకర్‌ల పక్షపాత వైఖరిని తీవ్రంగా ఎండగడుతూ పరిష్కారాలను చర్చించింది.

లోక్‌సత్తా, జనచైతన్య వేదిక, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్, అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫాంస్, అప్సా, ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్, జనవిజ్ఞాన వేదిక తదితర స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి, జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి, జస్టిస్ బి.శేషశయనారెడ్డి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ కె.రామచంద్రమూర్తి మాట్లాడారు.

జేపీ మాట్లాడుతూ, పార్టీల ఫిరాయింపులకు వ్యతిరేకంగా 52వ రాజ్యాంగ సవరణ స్థానంలో వచ్చిన 91వ రాజ్యాంగ సవరణను తీసుకురావటంలో లోక్‌సత్తా కీలక పాత్ర పోషించిందని, అలాగే 2003లోనే నేరచరితులు బైటపడేందుకు వీలుగా ఎన్నికలలో పోటీచేసేవారంతా తమ వివరాలను ప్రజలముందుంచాల్సిందేనన్న చట్టాన్ని కూడా తీసుకువచ్చిందని, అయితే ఇలాంటి చట్టాలు ఒక ముందడుగు మాత్రమే తప్ప మన వ్యవస్థలోని సంక్షోభాన్ని పరిష్కరించటానికి ఇవి మాత్రమే చాలవని స్పష్టంచేశారు. నేరస్తులకు టికెట్లివ్వటాన్ని ఏ పార్టీ సమర్థించుకోదని, అయితే ఇలా తాము బహిరంగంగా చెప్పుకోలేని రాజకీయాల్నే చేస్తూ పార్టీలు నేరస్తులకు టికెట్లివ్వటం కుళ్లిన రాజకీయానికి సంకేతమని అన్నారు. ఇంత కుళ్లిన రాజకీయంలో మార్పు తేవాలంటే బలమైన చట్టసవరణలతోపాటు ఎన్నికల సంస్కరణలు, ప్రజల్లో చైతన్యం తేవటం అవసరమన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు, ఎంపీలపై వేటు వేసే అధికారాన్ని మనదేశ పరిస్థితుల్లో స్పీకర్‌కు కాకుండా ఎన్నికల సంఘానికి ఇవ్వాలని 91వ రాజ్యాంగ సవరణ సమయంలో కూడా లోక్‌సత్తా ప్రతిపాదించినా ఓట్లు, సీట్లు ఉన్నవారు కలిసిరాలేదన్నారు. ఇప్పుడు పొరపాటున ఫిరాయింపుదారులు రాజీనామా చేసినా స్పీకర్లు ఆమోదించని దురవస్థకు ప్రజాస్వామ్యం దిగజారిందన్నారు. అందువల్ల ఫిరాయింపుదారులపై చర్య తీసుకునే అధికారాన్ని ఎన్నికల సంఘానికి ఇవ్వటం, విప్‌ను కేవలం అవిశ్వాసం, బడ్జెట్‌లకే పరిమితం చేయటం, ముఖ్యమంత్రులను ప్రత్యక్షంగా ఎన్నుకోవటం ఇప్పుడు చేయాల్సిన దిద్దుబాట్లని అన్నారు. ఫిరాయించినవారిని ఓడిస్తామనే సంకేతం ప్రజల నుంచి కూడా గట్టిగా వస్తే నిజమైన మార్పు వస్తుందన్నారు.

అసాధారణ నిర్ణయాధికారాలను స్పీకర్‌కు కట్టబెట్టటం



LS Times August 16-31 2016 Issue.pmd 29 8/11/2016, 2:47 PM

వల్ల వారి నిర్ణయాలు రాజకీయ సంక్షోభాలకు దారి తీస్తున్నాయని జస్టిస్ జీవన్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తులో 300 మంది స్వతంత్ర జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ, పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని 1985లో తెచ్చినప్పుడు తాను ప్రతిపక్షంలో ఉండి కూడా సమర్థించానని, అనర్హత వేటు వేసే అధికారాన్ని స్పీకర్‌కు కట్టబెట్టటం పెద్ద లసుగుగా మారుతుందని అప్పట్లో కూడా తాను వ్యతిరేకించానని తెలిపారు.




తెలుగుదేశం నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస యాదవ్‌ను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు రాజ్‌భవన్‌కి తీసుకెళ్తే, మంత్రిగా తలసానితో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారని కె. రామచంద్రమూర్తి అన్నారు. ఈ విషయంలో తప్పు ముఖ్యమంత్రిదా? గవర్నర్‌దా? ఎవరిపై ఎవరు చర్యలు తీసుకోవాలి? అని ప్రశ్నించారు.

పి. భాస్కరరావు, చిదంబరరావు, మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.వి.ఆర్ చంద్రశేఖరరావు, శ్రీనివాస్‌రెడ్డి, పలు ప్రజాసంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ✸

# ఇది తెలంగాణ భవిష్యత్తు పట్ల నిర్లక్ష్యమే

## -ఎంసెట్ లీకేజీపై విద్యార్థిసత్తా నిరసన-

కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థత వల్లే తెలంగాణ ఎంసెట్ పేపర్ లీకై విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవ్వాల్సి వచ్చిందని లోక్‌సత్తా విద్యార్థి విభాగం 'విద్యార్థిసత్తా' నేతలు అన్నారు. విద్యావ్యవస్థ పట్ల నిర్లక్ష్యమంటే తెలంగాణ భవిష్యత్తు పట్ల నిర్లక్ష్యమే నన్నారు. ఒక పరీక్షను సక్రమంగా నిర్వహించలేని వారు బంగారు తెలంగాణను ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. వరంగల్ విద్యార్థిసత్తా అధ్యక్షుడు తోట పవన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఎన్నో ఆకాంక్షలతో కష్టపడి సాధించుకున్న తెలంగాణలో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం బాధాకరమన్నారు. ఈ విధానాలనే ఇంకా కొనసాగిస్తే విద్యార్థి లోకమంతా ఏకమై ప్రభుత్వానికి గుణపాఠం చెబుతుందని పవన్ అన్నారు. ప్రభుత్వం వెంటనే ఎంసెట్ పేపర్ లీకేజీకి కారకులైన అధికారులను జైలుకు పంపి వారి ఆస్తుల్ని జప్తు చేయాలని, లీకు ద్వారా ర్యాంకులు తెచ్చుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిజాయతీగా పరీక్ష రాసి మంచి ర్యాంకులు తెచ్చుకున్న విద్యార్థులకు నష్టం రాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థిసత్తా నాయకులు చరణ్, రాహుల్, సమర్, అరుణ్, ప్రణయ్, అరుణ్‌లాల్, పవన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు. ✸



# హోదాపై టీడీపీ, బీజేపీ దొంగాట



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామన్న బీజేపీ, తెస్తామన్న తెలుగుదేశం పార్టీలు ఇప్పుడు మాట మారుస్తూ నాన్చుడు ధోరణితో ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని పలు పార్టీల నేతలు ధ్వజమెత్తారు. విభజన హామీలు అమలు చేయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంగతి తేల్చేలా ప్రజాఉద్యమం ప్రారంభించాలని నిర్ణయించారు. విభజన హామీల అమలు కోసం ఆంధ్ర మేధావుల ఫోరం కన్వీనర్ చలసాని శ్రీనివాస్ అధ్యక్షతన అన్ని పార్టీల ప్రతినిధులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ ఏపీ అధికార ప్రతినిధి కూనంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రత్యేక హోదా ప్రతిపాదన తొలుత లోక్‌సత్తాయే చేసిందని, రాష్ట్రం మొత్తానికీ ప్రత్యేక హోదా అంటే ఇతర రాష్ట్రాలు అభ్యంతరం చెప్పే అవకాశం ఉంది కాబట్టి రాయలసీమకు ప్రత్యేక హోదా, వెనకబడిన ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణకు ప్రత్యేక సాయం ప్రతిపాదనల్ని అసెంబ్లీలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ చేశారని అన్నారు. అయితే రాష్ట్రం మొత్తానికీ ప్రత్యేకహోదా ఇస్తే చాలా సంతోషిస్తామని, ఇందుకోసం ప్రతి ప్రయత్నానికీ మద్దతిస్తామని చెప్పారు. ప్రజలకు వాస్తవాలు అర్థమయ్యేలా చెబుతూ వారి సహకారంతో ప్రత్యేక హోదాను సాధించే కార్యాచరణను రూపొందించాలని సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ, ఏపీకి ప్రత్యేకహోదా పదేళ్లు కావాలని వెంకయ్యనాయుడు, పదిహేనేళ్లు సాధిస్తామని చంద్రబాబు మాటల గారడీ చేశారన్నారు. విభజన చట్టంలో హోదాను పొందుపరచలేదంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్యాకేజీ, రైల్వే జోన్, పోలవరం వంటి హామీలపై ఏం చెబుతారని ప్రశ్నించారు. వైకాపా అధికార ప్రతినిధులు పి.గౌతం రెడ్డి, జోగి రమేష్ మాట్లాడుతూ, ప్రజల్లో విభజన గాయాలు మాన్పాలంటే ప్రత్యేక హోదా ఒక్కటే మందు అన్నారు. హోదాపై చంద్రబాబు అవకాశవాదాన్ని గమనిస్తున్న ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్ర ప్రజల మేలు కోరేవారయితే కేంద్రంపై టీడీపీ ఎందుకు వత్తిడి తేవటం లేదని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిడుగు రుద్రరాజు ప్రశ్నించారు. బీసీ జనసభ అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సీపీఎం నాయకుడు వై.వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నేత డి.హరనాథ్, ఏఐటీయూసీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి.ఓబులేసు, జల్లి విల్సన్, రైతు సంఘం జాతీయ కార్యదర్శి రావుల వెంకయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లెనిన్‌బాబు, కార్యదర్శి ఐ.బయ్యన్న, ఏపీఎస్ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శులు వైవీ రావు, దామోదర్ తదితర నేతలు మాట్లాడారు. ✶

# వెనకబడిన జిల్లాలకు హోదా పన్ను రాయితీలివ్వండి







ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా విషయంలో తెలుగుదేశం, బీజేపీ ప్రజలను మభ్యపెడుతున్నాయని లోక్‌సత్తా పార్టీ ధ్వజమెత్తింది. రాష్ట్రం మొత్తానికి ప్రత్యేక హోదా వల్ల ఇతర రాష్ట్రాల నుంచి సమస్యలొస్తాయనుకుంటే వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు హోదా పన్ను రాయితీల్ని ఇవ్వాలని పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. పన్ను రాయితీలుండే ఈ ప్రాంతాల్లో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రత్యేక హోదా కోసం లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో విజయనగరంలో జరిగిన ఆందోళనకు బాబ్జీ నేతృత్వం వహించారు. పార్టీ నాయకులు నాగభూషణం, చిన్నారావు, కోటేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. పార్వతీపురంలో నిర్వహించిన ఆందోళనలో లోక్‌సత్తా నేతలు కొత్తకోట పాపారావు, రాజు, నాయుడు, బాషా, సింహాచలం, ప్రభాకరరావు, కిషోర్, సతీష్, విశాఖపట్నంలో చేసిన ర్యాలీలో ఎంఎస్ఎన్ మూర్తి, సిరిపు శ్రీనివాస్, హర్షవర్ధన్, నూకరాజు, పక్కి శంకర్రావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. ✶



LS Times August 16-31 2016 Issue.pmd 31 8/11/2016, 2:47 PM

# మోదీ, కేసీఆర్ కంటే స్వచ్ఛ హైదరాబాద్‌లో వెంకటయ్యే మిన్న

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు నిర్వహించిన స్వచ్ఛ హైదరాబాద్‌కి తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కన్నా స్థానికంగా పనిచేసే పారిశుద్ధ్య కార్మికుడు వెంకటయ్య (49) ఎక్కువ సేవలందించారంటే కాదనటం కష్టమే. పారిశుద్ధ్య కార్మికుడిగా వెంకటయ్యది 16 ఏళ్ల సర్వీసు. ఉదయం ఐదున్నరకల్లా విధులకు వచ్చి బాధ్యతలో నిమగ్నమవుతారు. చెత్తా చెదారం, మురుగు నిర్వహణ చేపడతారు. మద్యం చుక్క కూడా ముట్టకుండా. ఎయిర్‌టెక్ మిషన్లు లేకుండానే డ్రైనేజీ పనుల్ని పరిష్కరిస్తారు. బాబుల్‌రెడ్డి నగర్, దాని పక్కనే సాయిబాబా నగర్ బస్తీల్లో ఆరు చెత్తకుండీలు, 24వరకు గార్బేజీ స్థలాలు ఉండేవి. వీటన్నిటినీ తొలగించటంలో వెంకటయ్య కీలక పాత్ర పోషించారు. తాను పనిచేసే ప్రాంతాల్లో ఎక్కడ బహిరంగ చెత్త కనిపించినా వినుక్కోకుండా తొలగించటవే కాదు, అలా చెత్తవేయవద్దని ప్రజలకు నచ్చచెప్పి వారిని మార్చగలిగారు. ఇప్పుడా ప్రాంతాలకు వెళ్తే బహిరంగంగా చెత్త వేయటం కనిపించదు, పూలమొక్కలు కనిపిస్తాయి. మరి కేసీఆర్‌గారు దత్తత తీసుకున్న పార్సిగుట్ట, ఆ మాటకొస్తే రాష్ట్ర గవర్నర్‌గారు దత్తత తీసుకున్న ఆనందనగర్ కాలనీలో పరిస్థితి ఎలా వుంది? మోదీ ప్రభుత్వ విధానాలు, నిధులు ఏం సాధించాయిక్కడ? మిగతా దేశంలో చూసినా, ప్రధాని మోదీగారి వారణాసి ఎలా ఉంది? అనేకమంది సెలబ్రిటీలు చీపుళ్లు పట్టుకుని ఊడ్చిన, దత్తత తీసుకున్న కాలనీలు ఎలా వున్నాయి?.. ఈ నాయకులు, సెలబ్రిటీలు వ్యక్తిగత స్థాయిలో గొప్పవారు, కష్టజీవులే కావచ్చు, కానీ వ్యవస్థను బాగు చేయటానికి వారి నిజాయతీ, సామర్థ్యం చాలటం లేదు. స్వచ్ఛభారత్ రూపకల్పనలోనే లోపం వల్ల ఎన్ని వేల కోట్లు ప్రచారం కోసం ఖర్చు చేస్తున్నా మోరీలో కలిసిపోతున్నాయి. ఎంతమంది స్వచ్ఛందంగా ప్రచారం చేస్తున్నా ఒకస్థాయికి మించి ప్రజల జీవితాల్లో మార్పు రావటం లేదు. వెంకటయ్యలను తయారుచేసే విధానాలను రూపొందించి సమర్థవంతంగా అమలుచేయాల్సిన పాలకులు వ్యక్తిగత, రాజకీయ ప్రచారం కోసం స్థానిక ప్రభుత్వాల బాధ్యతలను కబ్జా చేయటం వల్ల ఈ సమస్య ఏర్పడింది. వృత్తిలో వెంకటయ్య చూపే నిబద్ధతను చూసి జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్ రెడ్డి ఆయన్ను ఉత్తమ పారిశుద్ధ్య కార్మికుడు పురస్కారం కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. వెంకటయ్యతోపాటు కోయంబత్తూరు కార్పొరేషన్‌కు చెందిన మరో కార్మికుడు జాతీయ స్థాయిలో పురస్కారాన్ని అందుకున్నారు. వెంకటయ్యలాగా వ్యక్తిగత నిజాయతీ, నిబద్ధతతో పనిచేసేవారు మరికొందరు ఉండవచ్చు. కానీ ఒక వ్యవస్థగా పారిశుద్ధ్యాన్ని అలా నిర్వహిస్తే తప్ప స్వచ్ఛ భారత్ లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరదు. అది స్థానికంగా మాత్రమే చేయగల నిరంతరాయ కార్యక్రమం అని గుర్తుంచుకోవాలి. స్థానిక ప్రజల్ని, ఆ ప్రజల చేతుల్లో నిధుల్ని, అధికారాల్ని, స్థానికంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల్ని, ప్రభుత్వ యంత్రాంగాన్ని సమన్వయం చేస్తేనే ఎక్కడికక్కడ స్వచ్ఛభారత్ సాధ్యమవుతుంది. ఇలా వార్డు స్వచ్ఛభారత్ సాధ్యమైతేనే స్మార్ట్ సిటీలు సాధ్యమవుతాయి.


వెంకటయ్య

'హైదరాబాద్ రోడ్లు బాగు పడాలంటే వర్షాకాలం పూర్తవ్వాల్సిందే' అని ఓ ప్రముఖ ఆంగ్ల పత్రిక ప్రభుత్వ పనితీరుని పతాక శీర్షికలో బైటపెట్టింది. ఒక రోడ్డు వేసిన చోటే మకాం వేసి ఎన్ని గంటల్లో అది గుంటలు పడిందో క్లిక్ మనిపించి వివరాలతో ఓ ప్రముఖ తెలుగు పత్రిక సిటీ ఎడిషన్ వేడివేడి కథనాన్ని మొదటి పేజీలో ప్రచురించింది. ఇవన్నీ కూడా ప్రస్తుత కేంద్రీకృత పాలన ఎంత విఫలమవుతోందో మళ్లీమళ్లీ రుజువు చేస్తున్నాయి. వార్డు స్థాయి పాలన, ప్రత్యక్ష ఎన్నికతో బలమైన మేయర్ వ్యవస్థ వంటి వికేంద్రీకరణ పాఠాల్నే చెబుతున్నాయి. వెంకటయ్యకు జీహెచ్‌ఎంసీ నుంచే కాకుండా వ్యక్తిగతంగా కూడా నగదు బహుమతిని అందించి ఆయన్నుంచి సక్సెస్ సీక్రెట్లను అడిగి తెలుసుకున్న మునిసిపల్ శాఖా మంత్రి కె.తారకరామారావు ప్రజలకు నీతులు చెప్పటానికి పరిమితం కాకుండా హైదరాబాద్ గోడల మీద తమ పోస్టర్లను తొలగించి ఇకనైనా అధికార వికేంద్రీకరణను వేగవంతం చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్‌ను బలమైన స్థానిక ప్రభుత్వాలతో అనుసంధానం చేయాలి. లోక్‌సత్తా తొలి నుంచీ సూచిస్తున్నట్టు.. స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేసి, తలసరి ప్రజలకు ఏటా రూ.1000–2000 కేటాయించి ఎన్నుకున్న వార్డు కమిటీలకే స్వచ్ఛభారత్‌ను అప్పగిస్తే అనేకమంది వెంకటయ్యలు తయారవుతారు. జీఎస్టీ సహా ఇతర మార్గాల నుంచి రాష్ట్రాలకు బదిలీ చేసే ఆదాయంలో 33శాతాన్ని స్థానిక ప్రభుత్వాలకు వాటా లభించేలా నిర్దిష్టమైన ఏర్పాటు చేయాలి. అప్పుడు మూడో అంచె ఫెడరలిజం కూడా వేళ్లూనుకుని సహకార సమాఖ్య వ్యవస్థ ఇంకా పటిష్టమవుతుంది. బయటి పారిశుద్ధ్యం తొలి దశ మాత్రమే, వివక్షల్ని, విద్వేషాల్ని కొనసాగిస్తున్న మానసిక పారిశుద్ధ్యం కోసం రెండో దశ స్వచ్ఛ భారత్‌ను కూడా పకడ్బందీగా ప్రభుత్వాలు చేపట్టాలి. ✶



LS Times August 16-31 2016 Issue.pmd 32 8/11/2016, 2:47 PM

# సహకార వ్యవస్థను అణగదొక్కటం ఏ రకమైన స్వయంపాలన, అభివృద్ధి?

## జీవో 28పై స్టేని స్వాగతిస్తున్నాం, ఇప్పటికైనా ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి: జేపీ

రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ, ప్రజల స్వయంపాలన, ఆర్థికాభివృద్ధి అవకాశాలను అణగదొక్కుతూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.28ను వెనక్కి తీసుకోవాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం వెనకనున్న ప్రజల ఆకాంక్షలకు తూట్లు పొడుస్తూ జారీ చేసిన ఈ జీవో.. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్వార్థ రాజకీయాల కోసం పాలకులు చేసిన ప్రయత్నాల్ని తలపిస్తోందన్నారు.

1995లో వచ్చిన పరస్పర సహాయ సహకార సంఘాల చట్టం (మ్యాక్స్) ప్రకారం ఏ పాల డెయిరీనీ నమోదు చేయకూడదని, ఏ సహకార సంఘమూ ఆ చట్టం కింద డెయిరీగా నమోదు కాకూడదు అని ఏప్రిల్ 19, 2016న ప్రభుత్వం జీవో 28ని జారీ చేసింది. జీవోకు వ్యతిరేకంగా లోక్‌సత్తా సహకారంతో పలు సంఘాలు హైకోర్టును ఆశ్రయించటంతో జీవోను నిలుపుచేస్తూ ధర్మాసనం తాజాగా ఉత్తర్వునిచ్చింది.

హైకోర్టు స్టేను జేపీ స్వాగతిస్తూ.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, 2014లోని సెక్షన్ 101లో చట్టానికి అవసరమైన సాంకేతికపరమైన మార్పులు చేసుకోమంటే, ఏకంగా చట్టం మౌలిక లక్ష్యాల్నే దెబ్బతీసేలా రాజ్యాంగవిరుద్ధంగా జీవో జారీ చేశారని, అసెంబ్లీ చేయాల్సిన నిర్ణయాలను ప్రభుత్వం జీవో ద్వారా చేయటం చెల్లదని స్పష్టం చేశారు. ఇది కేవలం ఏపీ పునర్విభజన చట్టానికి వక్రభాష్యం చెప్పటమే కాదు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) ప్రజలకు కల్పించిన సహకార సంఘాలుగా ఏర్పడే హక్కును కాలరాయటమేనన్నారు. మ్యాక్స్ చట్టం కింద ఏర్పడిన పాల సహకార సంఘాల ద్వారా ఉపాధి పొందుతున్న లక్షలాది రైతులు, మహిళలు, పేదలు, వెనకబడిన వర్గాలు, ఎస్సీలు, ఎస్టీల జీవనాదాయాన్ని కూడా ఈ జీవో దెబ్బకొడుతుందన్నారు. ఇది ఆర్టికల్ 21 కింద రాజ్యాంగం కల్పించిన జీవించే, జీవనోపాధిని పొందే హక్కుని కాలరాయటమేనన్నారు. మ్యాక్స్ చట్టం ద్వారా కాకుండా ఇతర చట్టాల ద్వారా సహకార సంఘాలుగా ఏర్పడవచ్చుని (జీవోలోని 6(1) క్లాజ్ పేర్కొనడం) చట్ట సమానత్వం కల్పించే ఆర్టికల్ 14ను ధిక్కరించటమేనన్నారు. సహకార సంఘాలలో దేశద్రోహ కార్యకలాపాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్రలు, అనైతిక కార్యకలాపాలు ఉన్నప్పుడు మాత్రమే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, అవేవీ లేకుండా ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆర్టికల్ 19 (1), 21, 14తోపాటు సహకార సంఘాలకు స్వయంప్రతిపత్తి, ప్రజాస్వామిక నిర్వహణ, వృత్తిపరమైన నైపుణ్యాలతో నిర్వహించాలన్న ఆదేశిక సూత్రాలలోని 43బి ఆర్టికల్‌ను కూడా ఉల్లంఘిస్తుందన్నారు.

సహకార సంఘాల నిర్వహణలో రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వ జోక్యానికి ఆస్కారం కల్పిస్తోంది కాబట్టే 1964 చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ 1995లో మ్యాక్స్ చట్టం వచ్చిందని, పాత చట్టాన్ని తిరగదోడాలనుకోవటం పెద్ద తప్పిదమవుతుందని జేపీ అన్నారు. సహకార సంఘాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించవచ్చని, కానీ ఆ సంఘాలు తన ఆదేశాలకు లోబడి పనిచేయాలని 1964 చట్టం చెబుతున్నట్లు ప్రభుత్వం ఒత్తిడి చేయలేదన్నారు. సహకార సంఘాల వ్యవహారాల్లో ప్రభుత్వ ప్రతినిధిగా రిజిస్ట్రార్ చేసిన మార్పులపై కోర్టుకు కూడా వెళ్లకూడదనే ఆ చట్టం.. ప్రాథమిక హక్కుల ఉల్లంఘనపై కోర్టులకు వెళ్లచ్చని భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 32, 226ను ఉల్లంఘిస్తోందన్నారు. ఇలాంటి చట్టాన్ని తిరిగి అమలు చేస్తే ప్రజలు కోరుకుంటున్న స్వయంపాలన, అభివృద్ధి ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నించారు.

సహకార సంఘాల స్వయంప్రతిపత్తి కోసం వర్గీస్ కురియన్ స్ఫూర్తితో లోక్‌సత్తా అనేక పోరాటాలు చేసిందని, సుప్రీంకోర్టు వరకు వెళ్లి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలకుల అప్రజాస్వామిక, పెత్తందారీ ధోరణులపై విజయం సాధించిందని, సహకార సంఘాల స్వతంత్ర ప్రతిపత్తికి గ్యారంటీనిచ్చే 97వ రాజ్యాంగ సవరణను 2012లో సాధించిందని జేపీ అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా జీవో 28ను వెనక్కితీసుకోవాలని, 1964 చట్టాన్ని రద్దు చేయాలని, లేకుంటే న్యాయపోరాటాన్ని ఎంతదూరమైనా తీసుకెళ్లి గెలుస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సహకార వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందని, రుణమాఫీలు వంటి అసంబద్ధ, తాత్కాలిక పథకాలతో ప్రజలను ఇంకా మభ్యపెట్టకుండా స్వతంత్ర సహకార వ్యవస్థను పటిష్టం చేసి సుస్థిరాభివృద్ధి కోసం అన్ని రంగాలకూ విస్తరించేలా చర్యలు చేపట్టాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. ★



LS Times August 16-31 2016 Issue.pmd 33 8/11/2016, 2:47 PM

# లోక్‌సత్తా భావజాలం నా ప్రభుత్వోద్యోగం మైండ్‌సెట్‌ని మార్చింది,

## అమెరికా అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే స్థాయినిచ్చింది: వనపర్తి యువకుడు రాఘవేందర్

మొదట ఈ యువకుడు గ్రూప్స్ రాసి మంచి ప్రభుత్వోద్యోగంలో స్థిరపడాలనుకున్నాడు. ఆ తర్వాత ఆర్థిక సంస్కరణలు, సామాజిక ఉద్యమాల్లో పాలుపంచుకోవటంతో ప్రభుత్వోద్యోగాన్ని మించిన జీవితం ఉందని గుర్తించాడు. ఇదే స్ఫూర్తితో ఆలోచనతో కూడిన చదువును కొనసాగించాడు. సమాజాన్ని పీడిస్తున్న రుగ్మతలను విద్యార్థి దశ నుంచే దగ్గరగా గమనిస్తూ పరిష్కారంలో భాగమయ్యాడు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ మద్దతు, మార్గదర్శకత్వంలో వచ్చిన 'యూత్ ఫర్ బెటర్ ఇండియా' (వైబీఐ)లో తోటి యువతీయువకులతో కలిసి అవినీతి నిర్మూలన, ఓటు హక్కు వినియోగం, సమాచార హక్కు చట్టంతో పారదర్శకత తదితర అంశాలపై పనిచేశాడు. ఇంటర్మీడియెట్‌లో సీఈసీ అనంతరం వనపర్తిలో బీఏ చదువుతూనే సంస్కరణల కార్యకలాపాల్లో భాగంగా పాలమూరు విశ్వ విద్యాలయం, హైదరాబాద్‌లలో అనేక సదస్సులు, కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. ఇలా తన భావజాలంలో పరిణతిని పెంచుకోవటంతో అమెరికాలో ఇటీవల జరిగిన ఆర్థిక సెమినార్‌కు తెలంగాణ నుంచి ఎంపికయ్యాడు. అతనే మహబూబ్‌నగర్ వనపర్తి పట్టణం బండార్‌నగర్ కాలనీకి చెందిన ఎం. రవి రాఘవేందర్.




ఎఫ్ఈఈ సదస్సులో ఎకనామిక్స్‌లో నోబెల్ బహుమతి గ్రహీత వెర్నాన్‌స్మిత్‌తో రాఘవేందర్

అమెరికాలోని ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్స్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఈఈ) అనే సంస్థ ప్రతి సంవత్సరం ఆర్థికశాస్త్రంపై అవగాహన పెంచేందుకు ఆర్థిక అంశాలు, వ్యాపార నైపుణ్యాలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఉన్న యువతను ఎంపిక చేసి సదస్సులను నిర్వహిస్తుంది. అందులో భాగంగానే అమెరికాలోని సౌత్ కరోలినా రాష్ట్రంలోని క్లెంసన్ యూనివర్సిటీలో 'పెట్టుబడిదారీ విధానం–మానవ జీవన విధానం'పై, గ్రాండ్ రాపిడ్స్‌లో సదస్సులు నిర్వహించింది. వీటిల్లో 30 దేశాల నుంచి ఎంపిక చేసిన 80 మందిలో, 80 దేశాల నుంచి ఎంపిక చేసిన 900మందిలో రాఘవేందర్ ఒకరు. సదస్సుల్లో పాల్గనే యువత ఎంపిక ఆన్‌లైన్ ద్వారా జరిగింది.

వైబీఐ, సురాజ్య ఉద్యమం, లోక్‌సత్తా తరపున అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, రోడ్ల విస్తరణ, ఫీజు రీఇంబర్స్‌మెంట్ వంటి ఉద్యమాలు, కార్యక్రమాల ద్వారా నేర్చుకున్న పరిజ్ఞానం, పరిణతి తనను అంతర్జాతీయ వేదిక మీదకు తీసుకెళ్లాయని రాఘవేందర్ అన్నారు. ఏ కోర్సు చదివేవారయినా సమాజం, పరిపాలన, రాజకీయాల గురించి అవగాహన పెంచుకుంటే ప్రభుత్వ ఉద్యోగం వంటి పరిమిత ప్రయోజనాలకే పరిమితం కాకుండా మరింతగా వృత్తివ్యాపారాల్లో రాణించగలరన్నారు. అమెరికా సహా అభివృద్ధి చెందిన దేశాల్లో పారదర్శకత, పాలనలో పౌరులకు భాగస్వామ్యం, చట్టబద్ధ పాలన ఉండటం వల్ల అక్కడ అవినీతి బాగా తగ్గిందని, ప్రజలకు సేవలు, అవకాశాలు బాగా అందుతున్నాయని అన్నారు. 19వ శతాబ్దంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పుంజుకుంటే, మనదేశంలో బ్రిటీషర్లు దాన్ని తమ స్వార్థం కోసం ఉపయోగించుకున్నారన్నారు. తర్వాత స్వాతంత్ర్యం వచ్చినా ఆర్థికాభివృద్ధి అవకాశాలను అందుకోలేకపోయామన్నారు. దీనివల్ల కొన్ని తరాలు నష్టపోయామని, ప్రపంచంలో ఉన్న పరిస్థితులు ఇప్పుడు మనదేశాభివృద్ధికి మరోసారి అవకాశాన్ని కల్పిస్తున్నాయని అన్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా కాలాన్ని సద్వినియోగం చేసుకోవటం వల్లే అమెరికా అగ్రదేశంగా మారిందని, అందరికీ అవకాశాల్ని కల్పించే సరైన విధానాల్ని భారత్ ఆలస్యం చేయకుండా అవలంబించాలని, ఇందులో చట్టబద్ధపాలన, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, అధికార వికేంద్రీకరణ కీలకమని అన్నారు. వివేకవర్ధిని కాలేజీలో పీజీ ఎకనామిక్స్ పూర్తి చేసుకుని ఇప్పుడు ఎకనామిక్స్ రీసెర్చర్‌గా, ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా చేస్తున్నానని, స్టార్టప్‌తో స్వయంఉపాధి పొందుతూ దేశ సంపద సృష్టిలో అందరికీ భాగస్వామ్యం కల్పించే కృషిలో ఎదగాలని కోరుకుంటున్నానని రాఘవేందర్ తెలిపారు. ✶



LS Times August 16-31 2016 Issue.pmd 34 8/11/2016, 2:47 PM






"ప్రభుత్వం, మార్కెట్ - భారత పాలనాసంస్కరణలు' పై
ఎఫ్‌డీఎస్ డబ్ల్యుఎల్  ఇటీవల హైదరాబాద్ ఫ్యాప్సీ (ఎఫ్‌టిఎపిసీసీఐ)
హాల్‌లో నిర్వహించిన డా॥ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్
స్మారకోపన్యాస కార్యక్రమంలో ప్రసంగిస్తున్న
లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్

Posting Date 22-08-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on August 16th 2016

# నిజాలు మాట్లాడుకుందాం-3

మార్పు తీసుకు రావడానికి ఎన్నికలు ఒక మార్గం కాని ఎన్నికలే మార్గం కాదు. ప్రస్తుతం ఉన్న ఎన్నికల వ్యవస్థ ద్వారా మార్పు వీలు కానప్పుడు ఓటు అనే అస్త్రం పక్కన పెట్టి ఉద్యమం అనే మరో అస్త్రం తీసామే తప్పే, ఇది

# అస్త్ర సన్యాసం కాదు!

అసలు అస్త్రాలే చేపట్టని వాళ్ళు అస్త్ర సన్యాసం గురించి మాట్లాడటం హాస్యాస్పదం . కాబట్టి కబుర్లు మాని చేతల్లో చూపెట్టమని కోరుతున్నా !



షేర్ చెయ్యండి...
ప్రజలకు నిజాలు చేరవేయండి

**Book-Post**
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad